
ఆంధ్రమహిళ



FEBRUARY '60 ANDHRA MAHILA 37 NAYE PAIS

ఆంధ్రమహిళ

సంపుటి 16 :: ఫిబ్రవరి '60 :: సంచిక 2

ఈశ్వరీ ప్రసాద్ దత్తాత్రేయ ఆర్థోపెడిక్ సెంటర్

అదృష్టహీనులు అంగవికలులు. అంగవికలులైన పిల్లలకి చూసే దిక్కు, చదువు సంధ్యలు నేరపించే అవకాశాలు చాలా తక్కువ మన దేశంలో. సంఘంలో వారిని బాధ్యతా యుతులైన పౌరులుగా రూపొందించాలంటే ప్రాథమికమైన శ్రమ చాలా వుంటుంది ఇప్పుడిప్పుడే మన దేశంలో అంగవికలులైన పిల్లల పట్ల శ్రద్ధా శక్తులతో సేవ చేయాలన్న దృష్టి ప్రబలుతూంది. ఇది సంతోషింప తగ్గ విషయమే.

ఆంధ్ర మహిళా సభ కాలూనిన నాటి నుంచి యీ నాటి వరకు ఎన్నెన్నో సేవా కేంద్రాలకు ప్రాణం పోస్తూ వచ్చింది. ఇన్నాళ్ళకి, అంగవికలులైన బాల బాలికలకి చేయూతనిచ్చే యీ కేంద్రానికి ప్రారంభోత్సవం చేయడం జరిగింది.

అసలీ కేంద్ర స్థాపనకి నాంది పల్కినది హనుమంతరావు దంపతులు. వీరి ఏకకైక పుత్రుడు ఈశ్వరీప్రసాద్ దత్తాత్రేయ తల్లి తండ్రులను శోకాబ్ధిలో ముంచి కను మూశాడు. అతని జ్ఞాపకార్థం ఆంధ్ర మహిళా సభ నర్సింగుహోమ్‌నకు ఒక లక్ష రూపాయల భూరివిరాళం యిచ్చారు, హనుమంతరావు దంపతులు. దీనికి జతగా భారత ప్రభుత్వం ఒక లక్షా ముప్ఫయినాలుగు వేలు గ్రాంటుగా మంజూరు చేయ డంతో అంగవికలులైన పిల్లలకి సహాయార్థం ఒక కేంద్రాన్ని నెలకొల్పాలన్న కాంక్ష నెరవేరింది.

జూలై 26 1958 లో మద్రాసు గవర్నరు శ్రీ బిష్ణురామ్ మెధి యీ ఆర్థోపెడిక్ కేంద్రానికి శంకుస్థాపన చేశారు. 19, జనవరి నాడు యీ కేంద్రానికి శ్రీమతి యిందిరా గాంధీ ప్రారంభోత్సవం చేశారు.

ప్రారంభం జరుపుతూ, శ్రీమతి యిందిరా గాంధీ, మానవ సేవా కార్యక్రమాలలో వైద్య చికిత్సకు తోడుగా, విద్యా బోధన సదుపాయాలు జత చేయాలనీ. అంగవికలుల సేవలో. దయ జాలికంటె ఎక్కువగా హృదయపూర్వకమైన అభిమానం చూపడం అవసరం అనీ ఉద్ఘాటించారు

యీ కేంద్ర కమిటీకి అధ్యక్షులైన శ్రీ లక్ష్మణస్వామి మొదలియార్ ఉపన్యసిస్తూ, ఇటువంటి కేంద్రాలు చాలా అవసరం అనీ, దేశం మొత్తంమీద బొంబాయిలో తప్పించి యిక యిటువంటి సంస్థలు లేవనీ, వీటి స్థాపన ఎంతైనా అవసరమనీ అన్నారు. ఇటువంటి కేంద్రం ధ్యేయం, అంగ వికలురూ నిస్సహాయులూ అయిన పిల్లలకు, వైద్య చికిత్సకు తోడుగా, చదువు సదుపాయం యిచ్చి వారిని ఉపయుక్తమైన భావి పౌరులుగా రూపొందించడమే. యీ కేంద్రంలోని పిల్లలకు జనరల్ ఆస్పత్రి, ఆర్థోపెడిక్ శాఖవారి వైద్య సదుపాయం లభిస్తుంది. శ్రీమతి గాంధి తమ ఉపన్యాసంలో ఒక్క బొంబాయి కేంద్రం చేయగల్గిన సేవ అవసరాల దృష్ట్యా చాలా తక్కువ అవుతుందనీ, ఇటువంటి కేంద్రాలు యింకా చాలా కావలనీ అన్నారు.

శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్ ప్రసంగించుతూ యిటువంటి కేంద్రం అవసరం ఉపయోగం అంతగా తెలియక, పంచవర్ష ప్రణాళికలలో అంగవికలుల సహాయర్థం కేటాయింప బడిన మొత్తం సద్వినియోగం కాలేదనీ, యిప్పు డిప్పుడే ప్రజానీకం వారిపట్ల శ్రద్ధ కనబరుస్తున్నదనీ అన్నారు. యీ మహిళాసభ వారి కేంద్రంలో దీర్ఘ కాలం చికిత్స అవసరం అయిన వారి కోసం ఫిజియోథెరఫీ అక్యుపేషనల్ థెరఫీ విభాగాలు నెలకొల్పబడుతాయి అన్నారు.

మానవ సేవే మాధవ సేవ అన్నారు, నిస్సహాయులైన అంగ వికలురకు చేసిన సేవే, నిజమైన సేవ, పిల్లల హృదయాలు ఎంతో సున్నితాలు వాటిని నొప్పించకుండా పెంచే బాధ్యత తల్లి తండ్రులదీ, సంఘానిది. అది గుర్తించిన సేవాసంస్థలు యిటువంటి ఆర్థోపెడిక్ కేంద్రాలు అతి ఉత్సాహంతో స్థాపించడంలో ఆశ్చర్యం లేదు. అది వాటి బాధ్యత. ★



గవర్నరు దంపతులతో హనుమంతరావు దంపతులు. పై కేంద్రానికి శంఖుస్థాపన జరిగిన సందర్భంలో తీసిన ఛాయా చిత్రం.

మనుష్యులు మరువకూడని

కొత్త దేవత

విశ్వాసం నీ నీడవంటి దేవత
విశ్వాసం మనిషికి వెన్నెముక
అది వుంటే జయించలేనిది ఏదీ వుండదు

బయట వాకిట్లో పిల్లల గోల మహా ఎక్కువగా ఉంది. ఉండుండి పెద్ద పెద్ద కేకలు, నవ్వులు, గోలాను. మండి పోతున్నాయి యెండలు. ఈ యెండబాధ ఈ పిల్లలకి కొంచెంకూడా లేదు కాబోలు. ఇంటి చుట్టూ అల్లుకుపోయిన దట్టమైన తీగెల చల్లదనానికి తోడు గదిగుమ్మాలకీ, కిటికీలకి తడిపిన వట్టివేళ్ళ తడికెలు, ఆగకుండా ఫుల్‌స్పీడ్‌లో తిరిగేఫానూ, ఈ గ్రీష్మతాపాన్ని కొంచెం కూడా చల్లార్పలేక పోయాయి. నిద్రపట్టలేదు సరికదా విశ్రాంతిగా కూడలేదు శరీరానికి. అల్లాంటి వేడిలో ఈ పిల్లలు ఎల్లా ఆడుకుంటున్నారో? అనిపించి తన చిన్నతనం జ్ఞాపకానికి వచ్చి అవును తనకీ అప్పుడు ఎండా వానా బాధలుండేవి కావని సర్దుకున్నాడు.

పక్కనే హాయిగా నిద్రపోతున్న ఉమ నిద్రలోనే ఎందుకో అమాంతం కళ్ళువిప్పి మళ్ళీ మూసుకుని నిద్రపోయింది. కాని తిరిగి అంతసరిగా పట్టలేదు. ఊరికే అవతల రణగోలగా ఉంది. ఈ మాటు ఆ గోలకి తోడు ఎగబీలుస్తూ ఏడుస్తున్న స్వరం వినపడింది. ఉమ ఉలిక్కిపడిలేచి తీవ్రంగా బయటకి నడిచింది: ఒక మాటుగా నిశ్శబ్దమై పోయింది. ఉమ కంఠస్వరంమాత్రం తీవ్రంగా లోపలికి కూడా వినిపిస్తూంది. "అబ్బబ్బా! పిల్లలు కాదర్రా! పిశాచాలు కాని! ఇంత అల్లరిచేసి వేపుకుతింటున్నారు మీకేంగతుందోనర్రా! ఓరి భగవంతుడా, ఎవరు చెప్పారురా నీకు ఈ కసాయి వెధవలతో చేరి ఆడమని? అబ్బారామా! కొంచెం కళ్ళుతెరచి చూడు నాయనా! అంటూ ఉమ శాపనార్థాలు...

మణిబాబు తల్లికి ఒకే విసుగు. వాణ్ణి తీసుకొస్తూంది. గదిలోకి. వాడంత సులభంగా రావడంలేదు. లాక్కొస్తూంది గట్టిగా నేనూరికే వింటూ పడుక్కున్నాను

ఉమ ఏడేళ్ళ క్రిందట ఈ యింటికి నాకు భాగస్వామినిగా వచ్చింది ఎన్ని దేవతలకి మ్రొక్కామో, ఎన్ని వ్రతాలు చేశామో ఒక చిన్నిపాప కోసము. ఉమ గర్భవతి అయినాక కూడా, అందరు నవదంపతులు తమ కొత్తగా పుట్టబోయే పాపల్ని గురించి ఎలాంటి కోరికలు కోరుకుంటారో. అలాంటివన్నీ మేమూ కోరాము. మా బాబు ముందెవ్వరిలా కాకుండా చాలామంచిగా, గొప్పగా ప్రపంచంలో అందరితోటి కూడా సంబంధం ఉండేంత గొప్పవాడు కావాలనీ. ఎన్నో ఎన్నో కోరాము. ఈ విధంగా మణిబాబు అవతరించాడు. పిల్లవాడు కలిగాడన్న సంతోషం ఎంతోసేపు నిలవకుండానే వాడి కుంటితనం ఒక కొత్త పెద్ద సమస్యగా తయారయింది.

వాడు పెద్దవాడవుతూ ఉంటే మా బాధకూడా వృద్ధి కావడం మొదలు పెట్టింది, అందరి పిల్లలూ ఈ ఈడుకి చక్కగా కిలకిల్లాడుతూ ఇక్కణ్ణుంచి అక్కడికి, అక్కణ్ణుంచి ఇక్కడికీ ఊరికే పరుగెలెడుతూంటే మా మణి భూమిమీద దుమ్ములో దొర్లుతూ పాకుతూండడం సహించలేనంత బాధగా ఉండేది. మా అదృష్టాన్ని మా హృదయాల్ని ఈ విధంగా విధి నేలమీద పొర్లిస్తుందా! అనిపించి విపరీతమైన దుఃఖం కలిగేది. మేం ఎన్నివిధాల నచ్చచెప్పినా కూడా మణిబాబు వినకుండా ఒంటరిగా నెమ్మదిగాపోయి తన బాలమిత్రులతో కలిసిపోయేవాడు. ఇతర పిల్లలు వాణ్ణి వెక్కిరించి ఆక్షేపించి, జాలిపడి, ఇన్నివిధాలుగా చూస్తుంటే ఆఖరికి సహించలేక ఒక్కొక్కప్పుడు ఏడ్చేవాడుకూడా, కాని ఇల్లాజరుగుతున్నాసరే సందు దొరికే సరికి పోయి వాళ్ళతో ఊగుతూ దేకుతూ ఆడుతుండేవాడు. ఇవన్నీ చూడలేక కళ్ళు పోతేనేగా బాగుండుననిపించేది. హృదయం బ్రద్దలయ్యేది. విధి మా

మూలం: గంగాధరశుక్ల

అనుసరణ: కె. సీతాదేవి.

సంతోషానికి ఇల్లాంటి అంతరాయం కల్పించాడు కదా ! అని దుఃఖం కలిగేది.

ఉమ మణిని లోపలికి తీసుకువచ్చి కళ్ళెర్ర చేసింది,

వాడు తన తప్పు ఒప్పుకున్నట్లు ఊరుకున్నాడు.

అవతల కుర్రాళ్ళగోల, నవ్వులు, మళ్ళా వినిపిస్తూన్నాయి. మణి ఇంకా వెక్కి వెక్కి ఏడుస్తూనే ఉన్నాడు లోపల్లోపల. ఉమ ఊరికే కటకట పడుతూంది. నాకు మాత్రం మనస్సులో ఏమౌతుందో చెప్పలేక పోతున్నా. ఒకటే భయం. వీడికి ఇంకా అయిదో సంవత్సరం వస్తూందికదా ! భవిష్యత్తేమిటి. ఇక్కడ ఈ పిల్లలతోటే వేగలేకుండా ఉంటే ఇంక తర్వాత ఎల్లా బ్రతకగలడు? అబ్బా ! ఎలాంటి ఆవేదన? మిగతవాళ్ళ మంచి చెడ్డలతో పోనీ మనకేమిటని సద్దుకుందుకులేదు, అక్కడిస్కూలుకి ఎల్లా వెళ్ళగలడు పాపం ఈ కుంటివాడు? ఇంతంట్లో ఉమ మణిబాబుతో అంటూంది. కదా "ఏరా మణీ ఎందుకురా బయటికిపోయి వాళ్ళతో ఆడడానికి పడి చస్తావు? నిన్ను వాళ్ళు ఎంత హీనగతికి తెస్తున్నారో చూస్తున్నావు తదా ! బాబీ పడుకో నాన్నా ! వాళ్ళ దగ్గరికేపోకు నువ్వు పెద్దవాడివి అవుతావుబాబూ ! నా బాబు పెద్దవాడైనప్పుడు అందర్నికూడ ఒక్క నిముషంలో కొట్టగలడు, ఓడించ కలడుఅంటూనే స్వరంతీవ్రంగాఅయింది ఆమెకి. అచేతనంగా పడుకుంది. అల్లాగే మాట్లాడుతూ ఉంది. నాకింక ఏమీ వినిపిస్తున్నా వినిపించనట్లుగా ఉంది. అవునువాడు పెద్దవాడయి ఏం చేస్తాడు. ఇదే నన్ను వేధిస్తూంది.

ఇదే ప్రశ్న మనస్సులో బయలుదేరి మాటి మాటికీ వేధిస్తూంటే జవాబు యోచించ గలిగేశక్తి మాత్రం నాలో కొంచెంకూడ లేదు. ప్రశ్నవరకూ మాత్రమే ఆలోచించి హద్దుదాటలేదు. జవాబు అంతంత దూరంలో కనిపిస్తుందేమోనన్న భయానికి పారిపోదామా అనిపించెంత పిరికితనం తోచేది మనస్సుకి ఈ కష్టాన్ని సహించకుండా ఎక్కడికి పోగలను? పోలేను. నిజంగా వాడి భవిష్యత్తు విషయం ఊరుకుని ఉండలేను. ఆలోచించనూలేను. ఏ ఘోరమైన అపరాధం చేశామనోమాకీశిక్ష. వాడి యాతన చూస్తూ ఇలా బ్రతికుండడమే మా మహాశాపం.

వాడింకా పిల్లలతో ఆడుకుంటానని గోల చేస్తూనే ఉన్నాడు. శారీరకంగా వాడికి అంతబాధగా లేకపోయినా అంతకంతకి పెద్దవాడయినప్పుడు తన కుంటితనం నలుగురిలో లోకువగా ఉంటుందని బాధపడతాడు. పెద్దవాళ్ళవుతూన్న కొద్దీ ఇల్లాంటి ఆలోచనలు వృద్ధి పొందడం సహజం కదా ! అనిపించేది.

ఉమ మాటలు విన్పిస్తూనే ఉన్నాయి. అయినా నాకు బోధకావడంలేదు. నా కళ్ళ ముందర. ఆఫీసులముందరా గోడ్లప్రక్కనా, దేవాలయాల ప్రక్కనా, బజార్లలో తరుచుగా చూసే వికలాంగులు, కుంటివాళ్ళూ అడుక్కు తిరుగుతున్నారు. నా మణిబాబు కూడా వీళ్ళలాంటి వాడె అవుతాడా? వాళ్ళకూడా వీడిలాంటివాళ్ళేనా అబ్బా ! గుండెల్లో ఎంతో బాధ కలిగింది !

దీని కోసమని తను ఎంత మందిని సలహాలకోసమని అడగలేదు? ఎంతమంది డాక్టర్లకి చూపించలేదు. ఆఖరికి మూఢనమ్మకాలువాళ్ళుచెప్పినట్లు దిగదుడుపులు. దిష్టులు మ్రొక్కుబళ్ళుఎన్నోచేశాము. ఏంలాభం? ఏంలేదు. వాడి రెండు కాళ్ళూ ప్రక్కకుతిరిగి అల్లాగేఉన్నాయి. కొంచెం కూడా మార్పులేదు. మొన్న ఒక మహానుభావుడు అన్నీ తెలిసినవాడు ఊటీనించి వస్తే ఆయనకి చూపించాము. ఆయన చూసి "ఆశ కొంచెంగా కనుపిస్తూంది కాని విశ్వాసం మట్టుకు వదల కుండా ధైర్యంగా ఉంటే ఈ అబ్బాయి అవస్థ బాగుపడే సూచన కనుపిస్తూంది. ధైర్యంగా ఉండండి. ఇప్పుడీమధ్యనే ఇలాంటి వికలాంగులని బాగుపరచే సాధనాలు చేయడానికి సంస్థలు కొన్ని కేంద్రాలు స్థాపించారు. అక్కడ ఇటువంటి వాళ్ళకి బాగా నడవడం, తిరగడం నేర్ప బడతాయి."

ఉమ ఇంకా కొడుకుతో అల్లా మాట్లాడుతూనే ఉంది. "నమ్మకంగా ఉంచి ధైర్యంగా ఉంటే బాగుపడతావు బాబాడాక్టరుగారదే అన్నారు." "రేపు నేనందరి పిల్లల్లాగా ఆడగలనా? అమ్మా?"

"తొందరగా బాబూ తప్పకుండా నడుస్తావు. నువ్వప్పుడే పెద్దవాడవుతున్నావు" అంది తల్లి.

"అయితే ఎంతపెద్దవుతానమ్మా? దీనూని చూశావా వాడు నాకంటే చిన్న జ్ఞానూ కూడా మూడేళ్ళవాడే" అంటూ మణిబాబు గబగబా మాట్లాడేస్తున్నాడు. "అయితే ఏమయిందిలే. నాబాబు ఎప్పుడు పెద్ద వాడవుతాడో.... అంటూ తరవాత మాట తోచక ఏదో ఆలోచిస్తూ ఉండిపోయింది.

"అమ్మా అయితే నేను పరుగులు కూడా పెట్టగలనా?

"ఓ ! నా బాబు అందర్నీ ఓడించగలడు కూడా !

"అయితేఎప్పుడమ్మా" అన్నాడు అమాయికంగా.

"తొందరలోనే బాబూ. నువ్వందర్నీ కూడా వెనక పెట్టి ముందుకుపోయి నెగ్గుతావు బాబా ! మరి నిద్రపో నిద్రపో."

"నువ్వు అబద్ధం చెప్పుతున్నావు! నేనెప్పుడూ పరిగెత్తలేనమ్మా. నడవలేమ్మా," అంటూంటే గొంతు హెచ్చించాడు.

"ఎవరుచెప్పారు నీకు?" తిరిగి అడిగింది ఉమ.

"నాన్నగారితో డాక్టరు బాబు చెపుతూంటే విన్నాను, నేనెప్పుడూ నడవలేనట" అంటూంటే కంఠం జీర పోయింది. ఏడ్పుతో. కొంచెంసేపు నిశబ్దమైపోయింది. తిరిగి ఉమ మెల్లి మెల్లిగా బుజ్జగించుతూ చెప్పుతూంది.

"అంతా అబద్ధం. ఉత్తి అబద్ధం, మణి బాబూ! నీకు నేను రోజూ పొద్దున్నా, సాయంత్రం. నూనెలు, తైలాలు, కాళ్ళకు మర్దనా చేస్తానాన్నా! కొత్త స్కూలుకు కూడా తీసికెళ్లి చేర్పిస్తాను. అక్కడ పెద్ద పెద్ద మాస్టర్లంతా నిన్ను సరిచేస్తారు, నా బాబు అప్పుడు బాగా నడుస్తాడు, ఆడుతాడు. పరిగెత్తుతాడు. అందరి పిల్లల్ని బాగా ఓడించుతాడు ఏం బాబూ సరేనే? మరి నిద్రపో అమ్మా అంటూ ఊరికే ఆవేశంగా చెప్పుతూంది.

"అవునమ్మా తప్పకుండా జరుగుతుంది. నేను అందర్నీ ఓడిస్తా. అన్నాడు మణి ఉల్లాసం ఉత్సాహం నిండి పోయింది మనస్సంతా "అప్పుడంతా నన్ను కుంటాడు. అని హేళనకూడా చేయరు కదా!"

"అల్లా ఎప్పుడూ జరగదు బాబా! ఎప్పుడూ జరగదు. అల్లా ఎవరేనా అంటే నా వాళ్ళ ప్రాణాలు తీసేయనూ? నా బాబు తప్పక నడుస్తావు. నిద్రపో నాన్నా? అంటూంది.

ఆమె కంపించిపోతూన్న కంఠంలో కరుణా. వేదనా, మమతా గోచరించాయి నాకు.

కొంచెంసేపు పోయాక కళ్ళు తెరిచి చూస్తే ఉమ మణితల హత్తుకుని నిద్రపోయింది. మణి గుండెలమీద చెయ్యి వేసుకుని హాయిగా నిద్రపోతున్నాడు. ఎప్పుడు నిద్ర పట్టిందో తెలియదు నాకు.

♦ ♦ ♦

ఉండుండి ఒక్కమాటు పిల్లల గోల రేగింది. కళ్ళు తెరిచి చూసేసరికి మణి అక్కడలేడు. ఉమ కళ్ళప్పుడు తెరిచి చూసింది. బయట కుర్రాళ్ళ గోల ఎక్కువయి పోతోంది. వాళ్ళు తప్పట్లు కొట్టి ఎవళ్ళనో ఉత్సాహ పరుస్తున్నారు. హడావిడిగా బయటకి పోయింది ఉమ. సాయంత్రం అవుతూంది. నేను కూడా కిటికీ దగ్గరకెళ్లి చూస్తూ ఉండిపోయాను ఆశ్చర్యంతో.

గోడపట్టుకుని వణుకుతూ, ఊగుతూ, నించున్నాడు. మణి. వాడిమోకాలు పగిలి రక్తం కారుతూంది. చూడగానే తెలిసింది. వాడెంత కష్టపడి బాధపడి లేవగలిగాడో పిల్లలంతా చుట్టూచేరి తపట్లు కొట్టుతూ ప్రోత్సహిస్తున్నారు. వాడు చేయెత్తి విజయ వీరుడిలా చెప్పుతున్నాడు.

"చూడండి! అంతా చూడండి నన్ను! నేను లేచి నించున్నాను. నేను కుంటాణ్ణి కాను, నేను నడుస్తాను, పరుగెత్తి అందరికంటె ముందుకొస్తాను. అందరూ చూడండి. నేనేమీ కుంటివాణ్ణి కాను"

పిల్లలంతా తిరిగి తపట్లు కొట్టారు.

ఉమ, గుమ్మంమీద చెయ్యి ఆనుకుని చూస్తూంది. మాయిద్దరి కళ్ళూ కలుసుకోడంతో దుఃఖం ఆపుకోలేక ఏడ్చేసింది. నా పని కూడా అంతే. మేంఇద్దరం నిరాశా పూరితులం అయ్యాం. మణి బాబు దగ్గర ధైర్య పాఠం నేర్చుకోవాలి. డాక్టరు, వైద్యుడు, వాళ్ళందర్నీ మించిన శక్తి విశ్వాసానికి ఉందని ఇప్పుడు రుజువైంది, మనిషికి అది ఎప్పుడూ వదలని దేవతలాంటిది. ఎప్పుడూ మోసగించనిది. మేం దాన్ని మరిచిపోయి పొరబాటు చేశాం, దాని దర్శనమే, ఇప్పుడు మాకులభించిందన్న మాట.

మాటల మధ్యని మరిచిపోక తప్పక ఈ వాళ్ళే ఆ ఊటీ నించి వచ్చిన మహానుభావుడు చెప్పిన కేంద్రాన్ని గురించి వాకబు చేయాలి, నాకు విశ్వాసము ఉంది. నా మణి బాబు ఇంక ఎన్నో రోజును నేలమీద పాకుతూ అవస్థ పడకుండా నడుస్తాడనీ. వాడు తప్పక నడుస్తాడనీ, ఈ వేళ కాకపోతే రేపైనా అందరికంటె పరుగులో ముందరగా వస్తాడనీ

విశ్వాసమే మాజీవితాల్ని తిరిగి చిగిరింప చేసింది.

★

భారత స్వాతంత్ర్యము

వచ్చితి, వినూత్న, వధువువై, భారతాం
బకుకోడ లవైయితి ఓయమ్మ నీవు
దిద్దుకో వమ్మపృథ్వియం దమరియున్న
ట్టి సకల– సంపదల్, ఠీవిగాను
దాగియు న్నాయి ఐశ్వర్య ఖనిజ ర
త్న సంపద దల్ నీ గర్భంబు నందు
నీదగు, ఐశ్వర్య నిధు లెన్నెన్నో నిండి
యుండెగా కొండలై మెండుగాను

ఇట్టి సహజ సౌందర్యరా సివగు నీవు
ఇప్పు డరయ నూత్న కళ్యాణివైతి ఓస్వ
తంత్ర రామరాజ్యలక్ష్మి దగిన సంప
దల వెలిబుచ్చ వమ్మ ఈ ధరణి యందు

మహత్త రోజ్వల మహానదుల్ బదిరెండు
శోభిల్లు- చున్నవి సొగసు గాను
ముదమార పంట భూములు ప్రాంగణం
బులవియొపం డుచుండె, మోదమలర
దట్టమై నట్టి ఘోరాండవుల్, బెరిగియు
న్నవహహా! యీభూతలంబు నందు

ఔర! నీ నూత్న సంసార, అంద, చంద
సౌమ్య తన్ గాంచి, ఇతర దేశము లనెడి
ప్రౌఢకు టుంబీకు లెల్లెడల్, ముగ్ధ లయ్యె
యన్ని టాదర్శ మీవెగా యంచు నెంచి

— గాడిచెర్ల సుబ్బాయమ్మ

"బొమ్మల కొలువు"

పెళ్ళాడే బొమ్మ	...	శారద	...	దత్తు వెళ్ళిన కూతురు
కీలు బొమ్మ	...	యశోద	...	యింటి యజమానురాలు
తోలు బొమ్మ	...	కుముద	...	పెద్ద కోడలు
దిష్టిబొమ్మ	..	వరద	...	ఇంటి విథవాడబడుచు
బుట్టబొమ్మ	...	ప్రమోద	...	పెద్ద కూతురు
పుత్తడి బొమ్మ	...	నీరద	...	ఇంటి చిన్నకోడలు.

[పండుగ వాతావరణాన్ని స్ఫురింపచేసే పాటలు వగైరా—ఏక కాలంలో డమ డమాల బండి—

కిర్రు కిర్రు మనే గిలకలు బూరాలు,

మొదలైన కలాగా పులగపు శబ్దాలమీద "అమ్మగారి ఇళ్ళు ధర్మలోగిళ్ళు" అనే పాట మాల ముత్తయిదువులు పాడుతూ ఉంటారు, ఆ పాట రాను రాను క్లియరుగా వినబడుతుంది. పాట పూర్తి అయేసరికి నాటకం ప్రారంభం అవుతుంది.]

నాటిక

శారద : (చప్పట్లు కొట్టి)-మార్వలెస్-ఎక్సలెంట్. మళ్ళా పాడండి. ఏం అలా విస్తుబోయి చూస్తారేం - మళ్ళా పాడండి. ప్లీజ్ డూ సింగ్.

౧వ మాలెత : ఓలప్ప-ఈ దొరసానమ్మగోరు ఎవారో?

౨వ మాలెత : నాకెరక నేదే. ఈ యింటికాడ ఈ దొరసానెమ్మగోరిని యెనకెప్పుడూ సూడలేదు.

శా : నేను దొరసాన్ని కాను. మామూలుదాన్నే. యశోదమ్మ గారి కూతుర్ని.

౧వ మా : ఆ యశోదమ్మగారి కూతురుగోరా?

౨వ మా : (రహస్యంగా)-ఒలేవ్. ఈయమ్మగోరు అసికోలాడుతుంటారు. యశోదమ్మగోరికి ఒక్కరేగా కూతురు.

౧వ మా : (రహస్యంగా) - అవునేవ్. ప్రమోదమ్మగారొక్కరే ఆడ కూతురుగోరు.

శా : కామలే ఈ శారదమ్మగోరు కూడ వారి కూతురే.

౨వ మా : ఇన్నారా అమ్మగారూ, మా మాటలు ఇనిపించాయా?

శా : వినిపించలేదు. గాని ఊహించుకొన్నా. నేను యశోదమ్మగారి కూతుర్నంటే-నమ్మనివాళ్ళలో మీరు నెంబరు నాలుగువందల నలభై నాలుగు. నలభై అయిదు అవుతారు. వెల్-దీనికేంగాని ఇంకో పాట పాడండి.

౧వ మా : ఇంకా శానా యిళ్ళున్నాయండి.

శా : రూపాయిస్తా పాడండి.

౨వ మా : పాడే.

౧వ మా : పాండవులు పాండవులు తుమ్మెదా

౨వ మా : పాండ పాండవులే తుమ్మెద—

ప్రియంవద : ఎవర్రోయ్ కొంచెం అసింటా తప్పుకోండి. తప్పుకోమంటే - చెవులు గింగురుమ నేట్టు - వీళ్ళూ వీళ్ళ పాటాను. దారికడ్డంగా. ఏంశారదా మీ అమ్మవాళ్ళూ ఇంట్లో ఉన్నారా?

"ఆరుద్ర"

శా : మీరెవరు? నన్ను మీకెలా తెలుసు?

ప్రి : నేనెవర్నో నీకు తెలియకపోయినా, నువెవ్వరో నాకు తెలుసులే. నువ్వు యశోదమ్మగారి చిన్నకూతురు శారదవి. చిన్నప్పుడే దత్తు వెళ్ళావు-అవునా చారూ.

శా : యస్-పులుసూ, వుయ్ ఆర్ నాట్ ప్రాపర్లీ ఇంట్రడ్యూస్డు. మన్ని - మామ్మూలుగా - అంటే క్రమంగా ఎవరూ పరిచయం చేయలేదు. సో ప్లీజ్ డోన్టు కాల్మీ యూజ్ చారూ. నన్ను చారూ అని దయచేసి చనువుగా పిలవొద్దు.

ప్రి : పోనీ అమ్మా. నువ్వు పిలవొద్దంటే మానేస్తా.

శా : నువ్వు ! మనకెన్నాళ్ళనుంచీ స్నేహం?

ప్రి : అదేమిటే?....

శా : ఎ? ఏవండోయ్. నువ్వు-గివ్వూ ఒసే-గిసే అంటే పనికిరాదు. మన ఇద్దరికీ ఎన్నాళ్ళనుంచో ఫ్రెండ్‌షిప్పు ఉన్నట్టు లిబరిటీస్ తీసుకొంటే టేక్కేర్-కపడ్‌దార్.

ప్రి : సర్లెండి. మీ అమ్మావాళ్ళూ లోపలున్నారా? అండీ పేరంటానికి పిలవాలి అండీ.

శా : పిలవండి. వెళ్ళండి.

ప్రి : మిమ్మల్నీ పిలవచ్చా-అండీ?

శా : ఓ-ఒసేగిసే అని పిలవొద్దన్నాను గాని, పేరంటానికి ఇన్వైట్ చేయొద్దన్నానా, బట్-వన్ థింగ్, ఒక్కటి చెప్పాలి. అమ్మవారిని అలంకరించినట్టు ఇంత కుంకం నా మొహాన కొట్టక-సింపుల్‌గా-సివిలైజ్‌డ్‌గా పేరంటానికి పిలవండి.

ప్రి : అదేమిటండీ-బొట్టు పెట్టకుండా పేరంటానికి ఎలా పిలవనండీ?

శా : ఆ కుంకంభరిణ - నా ఎదురుగుండా పెట్టండి - నేనే తీసుకొంటాను.

ప్రి : ఆహా-అందర్నీ బొట్టుపెట్టి మరీ పిలవాలని మా అత్త గారు చెప్పారు. అలాగ పిలవకపోతే ఆవిడ నన్ను చంపేస్తారు.

శా : మిమ్మల్ని చంపేసి-కొడుకుని విడోవర్ని చేసుకొంటుందా మీ అత్తగారు ! పూర్ ఫెలో. మీ ఆయన్ని నేను పిటీ చేస్తున్నాను.

ప్రి : పిటీ ఏవండోయ్. జాగ్రత్తా. మీరు ఢిల్లీనించి వచ్చారు. బాగానే వుంది. మా ఆయన్నేమయినా చేశారంటే ముక్కలు విరగడంతా. పిటీ చేస్తారట-పిటీ. ఢిల్లీనించి రాగానే మగవాళ్ళతో కలబడి-వస్తాదులాగ కుస్తీ పడతారు కబోలు-కుస్తీ.

శా : సారీ-క్షమించాలి. నా ఉద్దేశం అదికాదు, మీవారిని చూసి జాలిపడుతున్నాను అని అన్నాను అంతే.

ప్రి : మావారిని చూసి మీరు జాలీ పడక్కర్లేదు, యేవీ పడక్కర్లేదు.

శా : ఏవండోయ్, నన్ను పేరంటానికి పిలవకుండానే వెళిపోతున్నారు. ఇవేనా మేనర్సు.

ప్రి : నరుసా, నువ్వే నర్సువి. నువ్వే దొరసానివి. పెంపకం వెళ్ళి పదేళ్ళాయి ఢిల్లీలో ఉన్నంతమాత్రాన - ఇంత మిడిసి పడక్కర్లేదు. ఇవతలవాళ్ళని అవమానం చెయ్యక్కర్లేదు.

యశో : ఏమిటే చారూ. వీధిలో ఎవరితోటే ఘర్షణ పడుతున్నావ్. ఓహో. ప్రియంవదా. రా.

ప్రి : చూచారా. సోదెమ్మగారూ. మీ ఢిల్లీపిల్ల నన్నేమంటున్నదో.

య : ఏమే-తల్లీ-ఇప్పుడేం పేచీ తెచ్చావు.

శా : నేనేం పేచీ తేలేదమ్మా.

ప్రి : తేలేదూ. మా ఆయన్ని కుస్తీపట్టి ఈవిడ పిటీ చేస్తుందట. నేను నర్సునట.

శా : అదికాదమ్మా. వీళ్ళాయన్ని నేను పిటీ చేస్తున్నానన్నా. పిటీ.

ప్రి : విన్నారా-విన్నారా. మళ్ళా అదేమాట. పిటీ చేస్తుందట.

శా : గుడ్-హెవెన్సు !

య : తల్లీ శారదా. నువ్ ఇంట్లోకెళ్ళు. ఊరివాళ్ళ పెళ్ళాల మొగుళ్ళని నువ్వేం చెయ్యక్కర్లెదు. ఇంట్లోకి వెళ్ళు. ఎవరేనా వింటే అప్రతిష్ట.

శా : అమ్మా 'ఐ వోన్టు టోలరేట్ దిస్' నేనేం పరువు తక్కువ మాటన్నా? ఇంగ్లీషులో పిటీ అంటే జాలి, కరుణ, అన్నమాట. వీళ్ళ ఆయన్ను చూసి జాలిపడతానన్నా.

ప్రి : నువ్వు జాలిపడవలసినంత హీనంగా లేరులే మా ఆయన.

శా : ఇప్పుడు-లేదు-ఇకమీదట ఉంటారు.

య : చారూ.

శా : అవునమ్మా. ఆవిడ గుప్పెడు కుంకంతో నా మొహాన కొట్టి పేరంటానికి పిలవకపోతే వీళ్ళ అత్తగారు ఈవిడిగార్ని చంపేస్తారుట. పెళ్ళాం చచ్చిపోతే మొగుడు ఏమవుతాడు. విడోవర్. అంత చిన్న కారణానికి

పెళ్ళాన్ని తల్లి చంపేస్తే ఆ మొగాణ్ణి చూసి మనం జాలిపడాలి. వాట్ డుయూ సే?

య : తల్లీ నీకో నమస్కారం. నీ ఇంగ్లీషుకి పదివేల నమస్కారాలు యింట్లో కెళ్ళు.

శా : నేను యింట్లోకి వెళ్ళను. పదేళ్ళనుంచీ ఢిల్లీలో ఉంటూ తెలుగుదేశాన్ని మరిచిపోయాను. వీధరుగు మీద కూర్చొని ఈ పల్లెటూరి పండుగని చూస్తాను. బుడబుక్కలవాళ్ళు - గంగిరెద్దువాళ్ళు - పంగనామాలు పెట్టుకొని పాటలు పాడేవాళ్ళూ- మెడనిండా గంధం రాసుకొని పాడే ఆడవాళ్ళూ వీళ్ళందర్నీ చూడాలి.

య : సరే చూడు. ప్రియంవదా. మా శారదమ్మ నేం అనుకోను. రా లోపలకెళదాం.

ప్రి : తొందరగా వెళ్ళాలి. ఇంకా పిలవ్వలసిన యిళ్ళు చాలా ఉన్నాయి.

య : పేరంటం దేనికి? మీ తోటికోడలు కూతురుకి భోగి పళ్ళు పోస్తున్నారా?

ప్రి : కాదండి. ఇంట్లో బొమ్మలకొలువు పెట్టాం.

య : అహో. అలాగా. మీ తోటికోడలు కూతురుకి భోగి పళ్ళు పోయరా ఏం?

ప్రి : ఆవిడ పుట్టింటికి వెళ్ళిందిలెండి.

య : అన్నట్టు నువ్వు వెళ్ళలేదేం?

శా : పేరంటానికి సరిగ్గా పిలవకపోతే చంపెయ్యడానికి అత్తగారు అట్టే పెట్టినట్టు ఉంది.

య : చారూ.

శా : సారీ అమ్మా.

ప్రి : వస్తానండీ, సోదెమ్మగారూ. సాయంత్రం బొమ్మల కొలువు చూడడానికి వస్తారు కదూ.

య : వస్తా.

ప్రి : మీ అమ్మాయి కుముదనీ, కోడలు నీగదనూ కూడా తీసుకొస్తారుగా, తప్పకుండా తీసుకరావాలి.

శా : ఈ శారదని తీసుకరా అక్కరలేదా?

య : చారూ?

శా : సారీ.

వరద : సోదెమ్మా, సోదెమ్మా.

య : ఏం వదినా.

వ : పుట్టింట్లో పుస్తెడు పని పెట్టుకొని వీధరుగుమీద కూర్చుంటే ఎలాగే మా అమ్మా.

య : వస్తున్నా-వదినా-రాధమ్మగారి ప్రియంవద పేరంటానికి పిలవడానికొస్తే ఇలా వచ్చా.

వ : సరి లోపలికివెళ్ళు. ఏమే చారూ. అరుగుమీద నువ్వేం చేస్తున్నావ్?

శా : పండుగ చూస్తున్నా.

వ : ఆ–ఎంత ధైర్యం. నాకు సమాధానం చెపుతున్నావ్.

శా : సమాధానం అక్కరలేకపోతే ప్రశ్నించడమెందుకో

వ : ఈ యింట్లో నేనంటే అందరికీగడగడ. చూడమ్మాయి. నామాటకు మీ అమ్మే ఎదురుచెప్పదు. పదేళ్ళనుంచీ నువ్వు ఢిల్లిలో వుంటున్నావు కాబట్టి యీ యింటి సంగతులు నీకు తెలియవు. గాని తెలుసుకోడం చాలా మంచిది. నేనసలే మంచిదాన్ని కాను.

శా : ఆ సంగతి వేరే చెప్పాలా?

వ : ఇదుగో. నాకోపమొస్తే మనిషిని కాను.

శా : కోపంరాకపోతే మట్టుకు మనిషివా ఏం? దయ్యానివి.

వ : అ-అ-అ. ఏమిటే కూశావ్?

శా : ఆ ఎత్తిన చెయ్యి దింపు. నన్ను లెంపకాయ కొట్టా వంటే, ఒకటికి పది కొడతాను. జాగ్రత్త. మూడేళ్ళు మంచం దిగవు.

వ : చూశావే-చూశావే సోదెమ్మా నీ కూతురు. ఎంత తెగించిదో, నన్నే కొడుతుందట.

య : చారూ, ఏమిటే అది. నీ అంతరం ఏమటీ? ఆవిడ అంతరం ఏమిటి? ఎంత మాటపడితే అంతా అంటావా? కొడతానంటావా? ఇన్నాళ్ళాయి కాపరంచేస్తున్నాను. నేనే ఆవిడని ఏమీ అనను అలాంటిది నోటికొచ్చినట్టూ అంటావా? క్షమించమని అడుగు–అడుగూ.

శా : అమ్మా.

య : ఊ క్షమించమను.

శా : సారీ అంటా.

య : క్షమించమని అడుగుతావా లేదా?

శా : అడిగానుగా. ఇంగ్లీషులో అదే అన్నాను.

వ : ఆ ముదనష్టపు యింగ్లీషు మాటలు నాదగ్గర పనికి రావు. తెలుగులో క్షమించమంటే క్షమించుతాను.

శా : నువ్వు నన్నేం క్షమించక్కరలేదు. మా అమ్మ-అడగ మంది కాబట్టి ఆవిడమీద రిగార్డుకొద్దీ–సారీ అన్నాను గాని నేనయితే అనను.

వ : ఎలా అనవో చూస్తాను. సోదమ్మా ఇవాళ దీనికి అన్నం పెట్టకే. తెగులు అణుగుతుంది.

శా : ఊళ్ళో హోటేలున్న చాలా ఉన్నాయి.

వ : ఒటేల్లో తింటావూ. వొటేల్లో....సంసారివి కావూ.

శా : కాను.

వ : చూశావే-చూశావే. సోదెమ్మా. ఇది సంసారి కాదట ఎంత తెగేసి చెపుతున్నాదో.

శా : నేను సంసారిని కాను. నువ్వాంతకన్నా కావు.

వ : అ-ఆ-నేను సంసారిని కానూ.

శా : అవును ఇంకా పెళ్ళి కాలేదు కాబట్టి నేను సంసారిని కాను. అతి చిన్న వయస్సులోనే హజ్ బెండ్ పోయాడు కాబట్టి-నువ్వూ సంసారివి కావు.

య : నోర్ముయ్యవే—(లెంపకాయ కొట్టిన చప్పుడు)

శా : అమ్మా.

వ : ఆ — అదేమిటే - సోదమ్మా. పండుగపూట దాన్ని కొడతావటే. చిన్న పిల్ల దానినోటికి ఉచ్చం నీచం ఏమిటో తెలీదు. అంతమాత్రాన తొందరపడతామా.

య : లేకపోతే-ఏమిటి వదినా. హద్దూవద్దూ లేకుండా మాటలంటుందా. అందులోకి మిమ్మల్ని.

వ : నీ మొహం పండుగపూట యింట్లో ఎవరేనా కంట తడిపెట్టుకొంటే ఇంక ఈ ఇల్లు ఎక్కిపడినట్టే. యింక కొట్టకు.

శా : సారీ. నువ్వు మనిషివి కావు దెయ్యాని వనుకొన్నా. మనిషివే. తెలుసుకొన్నా.

వ : నేనంటే ఏమిటో ముందుముందు బాగా తెలుస్తుంది. నిన్న నేగా ఢిల్లినుంచి వచ్చావు పదిరోజులు పోతే దార్లో పడతావు, పద-సోదెమ్మా. ఏమే చారూ నువ్వూ యింట్లోకి రా.

శా : లేదు అంటే వీధులో వింతలు చూస్తా.

వ : ఏడూ.

శా : లుక్ హియర్ అంటే. నువ్వు చాలా మంచిదానివట. కాఫీ పంపించు. పంపిస్తావట

వ : ఏం సోద్యమే. ఆడదానివి కావూ. అరుగుమీద నిలుచొని కాఫీ తాగుతావా.

శా : నించోనికాదు. కూర్చొనే తాగుతా.

వ : కాఫీ కావలిస్తే యింట్లోకి రా. లేకపోతే మా నెయ్.

శా : ఇదుగో-అంటే, కాఫీ తాగకపోతే నాకు తలనొప్పి వస్తుంది. తలనొప్పి వస్తే ఏడుస్తాను. పండగపూట నన్ను ఏడిపించాలంటే కాఫీ పంపించడం మానెయ్. టా-టా.

(గంగిదెద్దువాడు వస్తాడు)

అమ్మగారికి దండంపెట్టూ....

పూర్తి పాట వాయిద్యాలతో దానిమీద శారద గుడ్. వెరీగుడ్ బ్యూటీఫుల్ అని వ్యాఖ్యానాలువిన్పిస్తాయిచివర్న.

శా : సింపిలీ వండర్ ఫుల్. జర్మను సర్కసులోని రింగ్ మాసర్ కన్నా నువ్వే గొప్పవాడివి. ఎందుకూ పనికిరాని శుద్ధ మొద్దావతారంలాంటి ఎద్దుచేత తిట్టించావు-ఇంద ఈ రూపాయి తీసుకో.

గంగిరెవాడు : దండాలమ్మా.

కుముద : శారదా-శారదా.

శా : ఏం వదినా.

కు : నీకేమైనా మతిపోయిందా ఏమిటే.

శా : మతిపోతే ఇక్కడింకా ఉండనిస్తారా. విశాఖపట్నం ఆస్పటల్ కి పంపించెయ్యరూ.

కు : హాస్యాలు కట్టిపెట్టి నేను చెప్పేది కొంచెంవింటావా?

శా : నాకు చెవులున్నాయి. వింటాను. అయితే నువ్వు చెప్పేది నాకు బోధపడాలి.

కు : ఈ చెవితో విన్నది ఆ చెవితో వదిలెయ్యకూడదు. తెలిసిందా?

శా : తెలిసింది. రెండు చెవులమధ్యా బుర్ర ఉన్నది. ఆ బుర్రలో తెలివి ఉన్నది నాకొక్కర్తికే. ఈ యింట్లో ఉన్న ఆడవాళ్ళలో అదే లోపం.

కు : పోనీలే. మా కర్మానికి నువ్వేం చేస్తావుగాని, నేను చెప్పేది శ్రద్ధగా విను.

శా : చెప్పు.

కు : నువ్వు మీ అత్తయ్యకి కోపం తెప్పిస్తున్నావ్,

శా : ఆవిడ నాకు కూడా కోపం తెప్పిస్తున్నది.

కు : మాటకిమాట తెగులు. నీటికి నాచు తెగులు.

శా : వెల్ సెడ్. వదినా. చక్కటి సామెత.

కు : మీ అత్తయ్యకి కోపం వస్తే ఈ యింట్లో ఇంక బతకలేం.

శా : పోనీ యింటిబయట బతుకుదాం.

కు : నీకేం తల్లీ. ఢిల్లీనుంచి నిన్న యింటికొచ్చావు. వారం రోజులు పోయాక వెళిపోతావు. ఆతరవాత బతకవలసింది మేమేగా.

శా : బతకండి ఎవరొద్దన్నారు?

కు : మీ వరదమ్మత్త అంటే ఎవరో తెలుసా?

శా : మా నాన్న చెల్లెలు.

కు : ఆవిడ ఎంత చెబితే అంత. ఈ యింట్లో ఆవిడ మాటకి ఎదురులేదు. ఆవిడ ఆజ్ఞలేందే ఎవరూ ఏమీ చెయ్యరు. మీ నాన్నగారు-అమ్మగారు మీ అన్నగారు....

శా : తమ్ముడుగారు - అక్కగారు పెద్ద వదినగారు చిన్న వదినగారు గోడమీద బల్లిగారు, గోడకింద పిల్లిగారు,

మంచంమీద నల్లిగారు; అంతా ఆవిడ చెప్పినట్టూ వింటూరు. అంతేనా వదినా.

వ: యింత వెటకారం అయితే నాకెందుకూ అవతల వంటింట్లో నాకు బోలెడంత పనివుంది. వస్తా పోనీకదా అని సలహా చెవిని వేద్దామని వచ్చా.

శా: నేను వేయించుకోటం లేదని వెళుతున్నావు. మంచిది పెద్దవదినా: వెళ్ళు. ఛీరియో. ష్సు! వాట్ వాటె కలెక్షన్ ఆఫ్ పీపుల్!

♦ ♦ ♦

నీర: ఛారూ-చారూ.

శా: ఓ-నీరూ. ఏం నీరదా?

నీ: ఇంద కాఫీ,

శా: థాంక్సు. అమ్మయ్యా. కొంచెం మనస్సు క్లియరవుతూంది. నీరూ నాతో సంగతి చెప్పు.

నీ: ఏమిటి?

శా: ఈ నరకంలో నువ్వెలా బతుకుతున్నావ్?

నీ: స్వర్గంలోకి వెళ్ళగలిగే అవకాశం లేకపోతే నరకంలో బతకవలసిందే.

శా: మైగాడ్, నిన్న మధ్యాహ్నం బండిదిగి ఈ యింట్లో అడుగు పెట్టిందగ్గర్నుంచీ కాలుతున్న అట్లపెనంమీద ఉన్నట్టుంది.

నీ: మరి ఆరునెల్లనుంచి నే నెలాగున్నానో నువ్వే ఆలోచించుకో. ఛేంగాడ్. మరో నెలరోజుల్లో ఈ శని నాకు విరగడ అవుతుంది.

శా: అయితే మా చిన్నన్నయ్య బొంబాయి నిన్ను తీసుకొని వెళుతున్నా రన్నమాట.

నీ: ఆ వాగు మొదటినించీ తీసుకెళతా మంటున్నారు. ఈవిడే ఈ వరదమ్మగారు అడ్డొస్తోంది

శా: ఎవరి మొగుళ్లు వాళ్ళ పెళ్ళాలని తీసుకుపోతామంటే ఈవిడ అభ్యంతర మేమిటో?

నీ: తనకా అదృష్టం లేదుకాబట్టి ...

శా: బాగా చెప్పావు. పోనీలే పదిరోజుల్లో నీకు మోక్షం దొరుకుతున్నది. అవునుగాని యీ యింట్లో అంతా ఆంటీ అంటే ఎందుకంత భయపడతారు?

నీ: దయ్యం-భూతం-రాక్షసి అంటే ఎవరు భయపడరు?

శా: అత్తయ్య దయ్యం కాదే - మానవత్వం ఆవిడలో ఉంది.

నీ: నీకు తెలియదు-ఆమె తత్వం..

శా: నాకు తెలుసు.

నీ: నీకేం తెలుసు-చిన్నప్పుడే పెంపకం వెళ్ళిపోయావు. పది సంవత్సరాలనుండీ పరాయిదేశంలో ఉంటున్నావు ఈమెగారి రాకాసితనం నీకెలా తెలుస్తుంది?

శా: పెద్దవదిన సామెత చెప్పినట్టు-అన్నం అంతా పట్టుకు చూడాలా? ఒక్క మెతుకు పట్టిచూస్తే తెలుస్తుంది. అత్తయ్య ఎంత డిక్టేటరులాగ కనపడ్డా కొంచెం హృదయం పిసరు ఆమెలో మిగిలిపోయింది. నేను ప్రత్యక్ష అనుభవంవల్ల చెపుతున్నా.

నీ: ఏమిటూ అనుభవం?

శా: ఒక పదినిముషాల కిందటే జరిగింది. నిన్న రైలు దిగిన దగ్గర్నుంచి యీవిడ నోరూ, జోరూ, వోరూ చూసి రాకాసి అని తెలుసుకొన్నా. దొంగని పట్టుకోనడానికి దొంగే అవసరం అన్నట్టు. నోరుపెట్టుకొని బతికేదాన్ని నోరుపెట్టుకొనే జయించాలని నిశ్చయించుకొన్నా.

నీ: అవును చూస్తున్నాగా-ఆవిడ యతి అంటే నువ్వు ప్రతి అంటున్నావు.

శా: ఎగ్జాక్ట్‌లీ....ఇందాకల ఆవిడని పట్టుకు దులిపేశా. అమ్మకి కోపం వచ్చింది.

నీ: ఎవరికీ ...మీ అమ్మగారికా.

శా: అవును. అత్తయ్యని క్షమార్పణ కోరుకోమని అమ్మ నాతో అంది. నేను కోరుకోనన్నాను. అమ్మకి కోపం వచ్చి నాచెంప ఛెళ్ళుమనిపించింది. అమ్మ కెంత సత్తు వుందనుకొన్నావ్ చిన్నవదినా-భూమి పచ్చగా కనబడింది.

నీ: పూర్ చారూ-నొప్పెట్టిందా?

శా: నొప్పి. కళ్లుతిరిగి భూమిమీద పడిపోతాననుకొన్నా కళ్ళంట నీళ్ళు తిరిగాయి.

నీ: పాపం.

శా: ఏదో పౌరుషంకొద్ది-ఏడుపు మనసులో దాచుకున్నాను గాని వెక్కి-వెక్కి ఏడవాలనిపించింది. అమ్మమీద చెడ్డకోపం వచ్చింది. అమ్మకాబట్టి ఊరుకొన్నా మరెవరయినా అయితే దవడపళ్లు రాలకొట్టేదాన్ని.

నీ: అంతదానివి కావనా?

శా: అవునుగాని-ఎంత పెంపకం వెళ్లిపోయినా అమ్మకి కన్నకూతుర్ని. ఆవిడ ఆడబిడ్డమీద గౌరవం బాగానే ఉందిగాని కన్నబిడ్డమీద ప్రేమకన్నా - ఆడబిడ్డమీద గౌరవం హెచ్చంటే నేను ఆశ్చర్యపడుతున్నా. సైకాలజీకి అది విరుద్ధం.

నీ: ఆడబిడ్డమీద గౌరవంకాదు. భయం.

శా: భయమెందుకో నాకు బోధపడడం లేదు. ఆవిడ రాక్షసికాదు. అమ్మ నన్ను కొట్టగానే ఆవిడ అమ్మమీద కేకలేసింది. పండుగపూటా పిల్లని కొడతావా అని అత్తయ్య అమ్మని తిట్టిపోసింది. హృదయంగాని మానవత్వంలో కొంత భాగంగాని లేకపోతే ఆవిడ అలా ఎందుకు చేస్తుంది.

నీ: అదా....(నవ్వుతుంది)

శా: ఏం నవ్వుతున్నావ్?

నీ: నీలో మానవత్వం ఉందని ఆవిడలో కూడా ఉందనుకొంటున్నావు. ఆవిడ సంగతి నీకు తెలియదు. పండుగనాడు కొట్టారని అత్తగారిమీద దెబ్బలాడింది అంతే.

శా: అది మంచితనానికి లక్షణమే.

నీ: కాదు. మూఢనమ్మకానికి పర్యవసానం. క్రిందటి దసరాకి ఒకటిలాగే జరిగింది. నేనూ మోసపోయాను అది చూసి.

శా: ఏమిటి?

నీ: మా తోడికోడలు లేదూ...

శా: ఎవరు-కుముద-పెద్దవదిన....

నీ: ఆవిడే. దసరా రోజుల్లో ఒకనాడు పండుగనాడు కుముద వరదమ్మగారిని ఏదో అంది. ఆవిడ ఉరిమి చూసింది. ఏదో పెద్ద రభస అవుతుందని అంతా భయపడ్డాం గాని అలాంటిదేం జరగలేదు.

శా: నేను చెప్పలేదూ. ఈవిడ అంత చెడ్డది కాదు.

నీ: కొసదాకా విను. ముందే అభిప్రాయాలు ఏర్పరుచుకోకు. పండుగలన్నీ అయిపోయాక ఒకనాడు ఉన్నట్టుండి-కుముద ఉన్న గదిలోకి వరదమ్మ వెళ్ళి తలుపు గడియపెట్టింది. చేంతాడు పట్టుకొని చితకబాదింది. ఎందుకు కొడుతున్నాదో కూడా కుముదకి బోధపడలేదు. వొళ్ళు హూనంచేసి ఆ తరువాత చెప్పింది పండుగనాడు ఎందుకు కొట్టడం అని మానేసి అది మామ్మూలు రోజుకి వాయిదా వేసిందట. ఈ సందర్భంలో కూడా అంతే. పండుగనాడు కొట్టినందుకే మీ అమ్మగారిని కోప్పడింది. ఇంకో నాలుగురోజులు పోయాక యీమె కొట్టకపోతే ఆమే కొడుతుంది.

శా; డెవిల్—అదా ఉద్దేశం. నేను ఏమో అనుకొన్నా.... అయితే నీరూ.

వ: (దూరంనుంచి) ఏమే -నీరదా- కాఫీ పట్టుకొని వెళ్లిన దానివిఅక్కడే ఉండిపోయావేం? వీధరుగుమీద కబుర్లు చెప్పుకొంటూ కూర్చుంటే-నీబాబు ఎవడు పనిచేస్తాడు ఇక్కడ.

నీ: అదుగో-తల్లి మాతల్లి-అరుస్తున్నది....వస్తా.

శా: అరుచుకోనీ-నీకెందుకు భయం. పదిరోజుల్లో ఎలాగా వెళిపోతున్నావుగా.

నీ: అందుకే యీలోపున జట్టీలెందుకూ అని ఊరుకొంటున్నా. వస్తా.

శా: (నిట్టూర్పు)

ప్రమోద: శారదా....శారదా....

శా: ఏం అక్కయ్యా.

ప్ర: శారదా....వేళ్ళకి వేసుకొనే రంగు నాకు ఇవ్వవే. నువ్వు వేసుకొన్నావు కదే.

శా: నా పెట్లో ఉంది తీసుకో.

ప్ర: పెదిమలకి వేసుకొనేది కూడా తీసుకోనా?

శా: తీసుకో.

ప్ర: పౌడరో?

శా: కావలసినవన్నీ తీసుకో. చిన్న పెట్టెలో ఉన్నాయి.

ప్ర: అదికాదే-తీసుకున్నాను. అవెలాగ వాడుకోవాలో తెలీదు. వచ్చి చూపెట్టు.

శా: అదా సంగతి. రేపు చూపెడతానులే.

ప్ర: రేపు అయితే ఎలాగే. సాయంత్రం పేరంటానికి వెళ్ళాలిగా-ఇవన్నీ పూసుకొని వెళ్దాం.

శా: ఓహో....అవునుగాని అక్కయ్యా—అందరూ మన్ని పేరంటానికి పిలిచేవాళ్లేగాని....మనం ఎవర్నీ పిలవలేదేం.

ప్ర: మనయింట్లో ఏం విశేషం లేదు. తక్కినవాళ్ళ యిళ్ళలో భోగిపళ్ళు పోస్తున్నారు-బొమ్మల కొలువులు పెట్టుకొన్నారు. మనము అదేం చెయ్యటంలేదు.

శా: మనమూ చేస్తే పోదూ.

ప్ర: భోగిపళ్లు పోయడానికి మనయింట్లో పిల్లలేరీ?

శా: నేను పిల్లనేగా-నాకు పొయ్యకూడదూ.

ప్ర; పోవే-ఎవరేనా వింటే నవ్వుతారు. రేపో మాపో పెళ్ళి చేసుకోబోతున్నావు. నీకు భోగిపళ్ళేమిటి?

శా: పోనీ బొమ్మలకొలువు పెడితే—

ప్ర: ఇంట్లో బొమ్మలు లేవు. ఉన్నా మనం పెట్టడానికి వీల్లేదు.

శా: ఏం ఎందుకు వీల్లేదూ.

ప్ర: మనకచ్చిరాదు.

శా: అచ్చిరాకపోడమేమిటి-ఫూలిష్‌నెస్.

ప్ర: ఏమో-అమ్మా—అత్తయ్య అలా అన్నారు.

శా: నేను బొమ్మలకొలువు పెడతాను. నువ్వెళ్ళి ఊళ్ళో వాళ్ళందర్నీ పిలుచుకురా.

ప్ర: నేను వెళ్ళను బాబూ. అత్తయ్య తిడుతుంది.

శా: ఆవిడంటే నీకెందుకూ భయం? పెదిమలకు రాసుకోనే రంగు యిస్తాను. బుగ్గలకు పూసుకోనేదిస్తాను. గోళ్ళకు వేసుకోనే దిస్తాను. అందరి యిళ్ళకీ వెళ్ళి పేరంటానికి పిలు. వెళ్ళు.

ప్ర: అత్తయ్య తిడుతుంది. ఇల్లు తీసి పందిరేస్తుంది.

శా: అంత భయమెందుకూ?

ప్ర: నీకేం తల్లీ. పదిరోజులు ఇక్కడుండి ఆ తరవాత ఢిల్లి వెళ్ళిపోతావు. ఆ తరవాత అనుభవించేది మేమేగా.

శా: నువ్వుమట్టుకూ యిక్కడుంటావా ఏం, మీ అత్తారింటికి నువ్వు వెళ్ళిపోతావు.

ప్ర: అందుకే యీలోగా ఆవిడతో పేచీపడ్డం ఎందుకూ.

శా: నీకు పౌడరూ-లిప్‌స్టిక్కూ వద్దా.

ప్ర: కావాలి.

శా: అయితే నేను చెప్పినట్టు చెయ్యి.

ప్ర: ఇస్తే యియ్యిగానీ-ఇలా షరతులు పెడితే నాకొద్దు.

శా: ఎంత సెల్ఫిష్‌దానివి అక్కయ్యా.

ప్ర: ఏమో-తల్లి-నాకు పనుంది.

శా: నీరదా-నీరదా; ఒక్కసారి ఇలా రా.

యశోద: అదెందుకే?

శా: పనుందమ్మా.

య: ఏం పని? నాతో చెప్పు.

శా: వేరే పనుందిలే.

య: ఏమిటి చెప్పు.

శా: బొమ్మలకొలువు పెడుతున్నా - అందుకు అందర్నీ పిలవాలి. నాకు ఈ ఊళ్ళోవాళ్ళెవరు తెలియదు. వెళ్ళి పిలవమని....

య: బొమ్మలకొలువు పెడతావటే-అయ్యో అయ్యో....

శా: ఏమిటి అంత గుండె బాదుకొంటావు. నేను ఏం తప్పుమాట అనలేదే.

య: తప్పా తప్పన్నరా.

శా: ఇందులో తప్పేముంది. బొమ్మలకొలువు పెడతానన్నాను గాని, ఇంట్లో కోడిని కాలుస్తాననలేదు. ఎవడితోటీ లేచిపోతాననలేదు.

య: నీ వాలకం చూస్తే అదీ అనేటట్టున్నావు.

వరదమ్మ: ఏమిటి సోదెమ్మా-మీ ఢిల్లీ పిల్ల మళ్ళా యేం పెంట తెచ్చింది?

య: చూడండి వదినా-ఇది బొమ్మలకొలువు పెడుతుందట. ఎంత తప్పు—ఎంత తప్పు.

వ: ఆ-బొమ్మలకొలువే....

శా: అవును.

వ: మనకది అచ్చిరాదు.

శా: అచ్చిరాని పని చేస్తే ఏమిటవుతుంది?

వ: యింట్లో అశుభం జరుగుతుంది.

శా: అయినా నేను పెట్టి తీరుతాను.

య: పెట్టడానికి వీల్లేదు.

శా: పెడతాను.

య: వీల్లేదంటే—

శా: పెడతానంటే—

య: తల్లీ నీతో దండం-కన్న కూతురువని కడుపుతీపికొద్దీ పండుగకి రమ్మన్నానుగానీ, యింత నాస్తికురాలివీ, గణపెంకెవీ అని తెలిస్తే పిలిపించకే పోదును.

శా: నేనేం తప్పుమాట అన్నానమ్మా-సరదాగా బొమ్మల కొలువు పెడతానన్నాను గాని....

వ: మనకి అచ్చిరాదు.

య: అదీకాక మనింట్లో బొమ్మలు లేవు.

శా: మీకా బాధ అక్కర్లేదు. అంటే-జస్ట్ ఓమాట ఇలా రా.

వ: నేను రాను.

శా: మాట విను.

వ: నామాట నువ్వు వింటున్నావు కనుక నా నీ మాట వినడానికి.

శా: వినమంటే ప్లీజ్. దయచేసి విను.

వ: ఏమిటి.

శా: ఫొటోలు చూడు.

వ: ఏమిటా ఫొటోలు.

శా: చూడు-చూడకండానే అడుగుతావేం?

వ: ఇది నీఫొటో-పెళ్లాడే బొమ్మలా ఉన్నావు.

శా: అవును నాదే. అలాగే ఉన్నా.

వ: ఇది సోదెమ్మది.

య: నాదా....

వ: అవును నీదే.

య: ఏదీ-ఏదీ చూడనీ.... బాగుందే.

శా: గుడ్-ఇది నీరద ఫొటో-ఇది కుముద ఫొటో.

వ: ఇది ప్రమోదది.

య: ఏమిటి-ప్రమోద బుట్టబొమ్మలా ఉంది.

శా: బుట్టబొమ్మలాగ ఉంటుంది కాబట్టి అలాగే కనబడుతూంది.

వ : ఏమిటి-ఇది నా ఫొటోగ్రాఫా.

య : మీదే వొదినా. అచ్చు మీరూ పే-బాగుంది.

శా : ఈ ఫొటోలు అన్నీ బాగున్నాయా.

వ : చాలా బాగున్నాయి.

య : ఇవన్నీ ఎక్కడివే?

శా : నిన్న రైలు దిగగానే తీశానుగా. రాత్రి డెవలప్ చేసి ప్రింటుచేశాను.

వ : ఆడదానివి నువ్వు ఫొటోలు తియ్యడమేమిటే.

శా : నయం. ఆడదానివి నువ్వు ఊపిరి తియ్యడ మేమిటే అన్నావు కాదు. దానికేంగాని ఫొటోలు బాగా వున్నాయా?

వ : బాగున్నాయి.

శా : ఢిల్లీనుంచి యింకా చాలా బొమ్మలు తెచ్చాను. ఎర్రకోట-జుమ్మా మసీదు. జంతర్ మంతర్-జమునా నది ఎన్నో తెచ్చాను.

వ : అవీ నువ్వే తీశావా?

శా : ఆ-అన్నీ నేనే తీశాను. మధ్యాహ్నం చూపిస్తా.

వ : భోజనాలయ్యాక చూద్దాం. సోదెమ్మా నీ కూతురు ఫరవా లేదే—

య : అవును వదినా.

శా : చూశారా. బొమ్మలకొలువు అంటే ఇదే. యింట్లో మీకు చూపించినట్లే ఊరివాళ్ళందరికీ యీ ఫొటోలు చూపిస్తా. గోడలకి వెళ్ళాడకడతా. ..

వ : ఏమేవ్..ఇంకా ఏదో చెప్తావనుకొన్నా. ఇదా-నీ ఉద్దేశం.

శా : అక్షరాలా ఇదే నా ఉద్దేశం.

య : మా బావుందే.

శా : బాగుంది కనకే పెడతా నంటున్నా.

వ : వీల్లేదు. మనకు బొమ్మలకొలువు అచ్చిరాదు.

శా : ఆ సంగతి చాలాసార్లు చెప్పావు.

వ : అయినా నీ పట్టు మానవేం.

శా : అచ్చిరానిపని చేస్తే కొంప మునిగిపోదు.

వ : అచ్చిరాని పనిచేస్తే-ఊరిపోసుకు చనిపోతా.

శా : ఇవాళ నేను బొమ్మలకొలువు పెట్టితీరుతా.

వ : నేను చచ్చితీరుతా.

శా : అంటే-చూదూ ఇవాళేమిటి. ..

వ : నువ్వనేది నాకు బోధపడడం లేదు.

శా : ఇవాళ ఏమటి?

వ : భోగి. ..

శా : రేపు?

వ : సంక్రాంతి.

శా : ఎల్లుండి.

వ : కనుము.

శా : ఈ మూడూ పండుగుల పేర్లు. ఈ మూడు రోజులూ ఉరుకో. పండుగనాడు యింట్లో శవం వెళ్ళిందన్న బాధ మాకు ఉండదు. ఆ తరువాత చచ్చిపో-శని విరగడ అయిందని సంతోషిస్తాం.

వ : ఆ - ఆ — ఎంతమాట.

శా : అవును. ఈ ఫొటోలన్నీ నేను యింట్లో కాకపోతే బజారులో వేలాడకడతాను. నీ ఫొటోకింద దిష్టిబొమ్మ అని రాస్తా. నీ చేతిలో కీలుబొమ్మ కనుక అమ్మ ఫొటో కింద కీలుబొమ్మ, అని ఆవిడ చేతిలో తోలుబొమ్మ, కనక పెద్దవదిన బొమ్మకింద అలా రాస్తా - ప్రమోదక్కయ్య-ఎంతసేపూ ముస్తాబు గోడవే కాబట్టి బుట్ట బొమ్మ అని రాస్తా. నా బొమ్మకింద అంటే చెప్పినట్టు-పెళ్ళాడే బొమ్మ అనీ-నీరద బొమ్మకింద పుత్తడి బొమ్మ అని రాస్తా. మన యింటి సంగతి ఊరంతా తెలుస్తుంది.

య : ఆ-ఆ-ఏమిటే.

శా : మీరు వప్పుకొంటే ఇంట్లో ఏమీ రాయకుండా పెడతా. వప్పుకోరూ ...రాసి బజారులో పెడతా. ఆలోచించుకోండి.

వ : సోదెమ్మా...

య : వదినా....

వ : మట్టి బొమ్మలకొలువు అచ్చిరాదుగాని కాగితం బొమ్మలు ఫరవాలేదనుకొంటా ...

య : మీరు చెప్పింది నిజమే—

వ : పెట్టుకోవే తల్లీ బొమ్మలకొలువు పెట్టుకో. గాని శారదమ్మా నువ్వు పెళ్ళాడే బొమ్మవి కావు. గోడ మీద బొమ్మవి కావు. గోడమీద బొమ్మవి-గొలుసు గొలుసుల బొమ్మవి.

శా : అవును-నీలాంటి వచ్చిపోయేవాళ్ళకి-బుద్ధి వడ్డించే బొమ్మని కూడాను !

కనువిప్పు

కథానిక

మధ్యాహ్నం మూడైంది. జయ చదువుతున్న పుస్తకం మూసి హాలులోకి వచ్చి రేడియో ట్యూన్ చేసింది, ఆహ్లాదకరమైన ఫిలిం సంగీతం వింటూ బద్ధకంగా సోఫాలో చేరబడి వంట మనిషి టేబిలుమీద పెట్టిన కాఫీ కప్పు అందుకుంది–

'హాల్లో జయా!' అంటూ ఆమె స్నేహితురాలు లలిత వచ్చింది.

'ఎక్కడికో ప్రయాణం కాబోలు!' అన్నది జయ ఆమె అలంకరణను పరిశీలిస్తూ.

'ఈరోజు శనివారం కదూ! పిక్చర్‌కు బయల్దేరాను. నీవు కూడా రాకూడదదూ?' అన్నది.

'మేము మొన్ననే వెళ్ళి వచ్చాం. మా నాన్నగారు అలవ్ చెయ్యరు. నువ్వంటే స్వతంత్రురాలివి కాబట్టి యెన్నిటికైనా, యెక్కడికయినా వెళ్తావు', జయ కంఠంలో నైరాశ్యం తొణికిసలాడింది.

'అవును. నాసంపాదన నా యిష్టాను సారంగా ఖర్చు పెడతాను. మా అన్నయ్య నాకు అడ్డు చెప్పడానికి జంకుతాడు. అయినా ఆర్థిక స్వాతంత్ర్యం ఉండటంలో చాల సుఖం ఉంది జయా!' అంటూ తన అనుభవం వెళ్ళబోసింది.

'నీ మాటలు నిజంలలితా! మనం ఒకరిపై ఆధారపడనప్పుడు వారి కట్టు బొట్లకు లొంగి ఉండనవసరం లేదు', అన్నది జయ, అప్పుడే లైబ్రరీ రూములోంచి యువతలకు వస్తూన్న విమల వారి మాటలు విని నవ్వుకుకుంది.

'నేనింక వెళ్తాను జయా! టైమైంది', అని లలిత హైహీల్సు చప్పుడు చేసుకుంటూ వెళ్లిపోయింది. అటువైపే చూస్తూ ఉండిపోయిన జయ 'నేను కూడ ఉద్యోగం చేస్తే'! అనుకుంది.

♦ ♦ ♦

శ్రీనాథంగారు బ్యాంకు మేనేజరు. చిన్నతనంలోనే తల్లిని పోగొట్టుకున్న జయను విమలను ముద్దుగా పెంచారు.

జయ బి. ఏ ప్యాసయేటప్పటికి విమల ఇంటర్‌లోకి వచ్చింది. జయ వివాహం శ్రీనాథంగారి స్నేహితుడి కొడుకైన ప్రకాశరావుతో నిశ్చయమయింది. ఇంజనీరు ప్రకాశరావు అమెరికా వెళ్ళాడు.

జయ చదువుకున్నా ఆమెలోని చిన్నతనపు భావాలు పోలేదు. విమలతో ప్రతి విషయంలో పోటీ పడేది. స్వతహా నెమ్మదస్తురాలైన విమల కోపగించుకోక అక్కను గౌరవించేది. శ్రీనాథంగారి అదుపాజ్ఞలు జయ కంతగా నచ్చేవికావు. స్వేచ్ఛగా తిరగాలని, ఆర్థిక స్వాతంత్ర్యం ఉండాలని ఆమె వాంఛించేది.

♦ ♦ ♦

శ్రీమతి జి. వాణి

మరునాడుదయం కాఫీ త్రాగుతూన్నప్పుడు జయ, 'నాకు ఉద్యోగం చేయాలని ఉంది నాన్నా ?' అన్నది గారాబంగా.

'హఠాత్తుగా అలాంటి కోరిక కలిగిందేం జయా?' అంటూ శ్రీనాథంగారు నవ్వుతూ ప్రశ్నించారు.

'చదువు పూర్తయినప్పటి నించి అనుకుంటున్నాను. నాకు చాల సరదాగా ఉంది. ప్రయత్నించరూ?' అంటూంటే ఆలోచనా పూరితమయినముఖంతో శ్రీనాథంగారు మేడమీదకు వెళ్ళిపోయారు.

నాలుగు రోజుల తరువాత ఒక నాడు పేపరు చూస్తూన్న జయ ఒక ఎడ్వర్‌టైజుమెంటు చూసి సంతోషంతో తండ్రి వద్దకు పరుగెత్తింది.

'మహేందర్ అండ్‌కో వాళ్ళకి క్లర్కు కావలిటనాన్నా! జీతం నూటపాతిక. అలవెన్సులతో నూటడెబ్భై వరకు వస్తాయి. ఆ కంపెనీ మేనేజరు సింగ్ మీకు పరిచయస్థుడే. చెప్పరూ?'

"నీవు నా కళ్ళముందు అనవసరంగా క్లర్కు పని చేయడం నాకిష్టంలేదు జయా కాలక్షేపం కోసమయితే నిన్ను ఎమ్. ఏ. లో చేర్పించడానికి నాకు అభ్యంతరంలేదు," అన్నారు శ్రీ నాథంగారు.

"నాకు ఉద్యోగమే చేయాలనుంది నాన్నా! ఒప్పుకోరూ!" అంటూ తండ్రివైపు ప్రాధేయపూర్వకంగా చూచింది జయ. ఆయన ఆమెను నిరుత్సాహ పరచడం యిష్టంలేని కారణంగా ఒప్పుకున్నారు.

శ్రీనాథంగారి పలుకుబడి కారణంగా జయ అప్లికేషన్ వేసిన వెంటనే ఇంటర్‌వ్యూ కార్డు వచ్చింది, ఆమెతో బాటు మరొక పది మంది హాజరైనారు. వారిలో జయ క్లాసుమేటయిన మృణాళిని కూడ ఉన్నది. ఆమె జయను పలుకరించినా ముభావంగా ఉండిపోయింది,

జయకు వెంటనే ఎపాయింటుమెంటు ఆర్డరు వచ్చింది. బి. ఏ. ఫస్టు క్లాసులో ప్యాసయిన మృణాళిని విజయం పొందలేక పోయింది.

♦ ♦ ♦

స్వేచ్ఛగా ఉండే జయకు కొన్ని గంటలు కదలకుండా పని చేయడం కష్టంగా తోచ సాగింది. కాని వచ్చే జీతాన్ని యే విధంగా వినియోగించాలో ఆలోచించుకుంటూ శ్రమను మర్చిపోయేది. ఇక తను తండ్రి డబ్బుకోసం, పర్మిషన్ కోసం యెదురు చూడనవసరంలేదని సంతోషించింది.

ఒక నాటి సాయంత్రం ఆరు గంటలకు జయ ఆఫీసు నించి అలసటగా వచ్చి సోఫాలో కూలబడింది. హాయిగా పుస్తకం చదువుకుంటున్న విమల తలెత్తి చూచి నవ్వింది.

"చాల అలసినట్లున్నావు అక్కా! పని యెక్కువగా ఉంది కాబోలు!" అన్నది.

'అవును. చాల విసుగ్గా ఉంది!" అన్నది కాఫీ సిప్ చేస్తూ.

"అసలు నీకు ఉద్యోగ్యం చేయవలసిన అవసరం యేముందక్కా!" విమల హఠాత్తుగా ప్రశ్నించింది, జయ.

"డబ్బు కోసం అంటే నేను ఒప్పుకోలేను. మనకు చాల డబ్బు ఉంది, నాన్నగారు మనకే లోటూ రానివ్వడంలేదు. ఇక నీ సంగతి. త్వరలో అన్ని విధాలా ఉన్నత స్థితిలో ఉన్న ప్రకాశరావు భార్యవి కాబోతున్నావు. నూట డెబ్భై కోసం యెందుకీ అనవసర త్రాపత్రయం?" అన్నది విమల.

"అదంతా వేరే విషయం విమలా! ముఖ్యంగా నాకు ప్రొద్దు పోవటం లేదని చేరేను", జయ తడబడింది. విమల చిన్నగా నవ్వింది.

"నీకంటె చిన్నదాన్ని. నీకు చెప్పకూడదు. కాని నీ మాటలు వింటూ ఊరుకోలేకపోతు

న్నాను. కాలక్షేపం, విజ్ఞానార్జన కలుగజేసే పుస్తకాలు మన లైబ్రరీలో వందలున్నాయి. ఎమ్. ఏ. కి కట్టవచ్చు. సంఘసేవ చేయవచ్చు నీకు అవసరం లేనప్పుడు, ఆ ఉద్యోగం నిరుద్యోగంతో బాధపడే యింకో వ్యక్తికిస్తే యెంతో సబవుగా ఉండేది. అది ఉపకారమే అవుతుంది,'' విమల ప్రశాంతంగా అక్కకు నచ్చజెప్పింది..

"అయిందా నీ ఉపన్యాసం, ఆదర్శాలు బాగానే వల్లిస్తావు,'' జయ విసురుగా కోపంతో మేడమీదకు వెళ్లిపోయింది,

♦ ♦ ♦

జయ తన మొదటి జీతంతో తనకు, విమలకు రెండు ఖరీదైన కాశ్మీరు సిల్కు చీరెలు కొన్నది.

మరునాడు స్నేహితురాలు కమల యింట్లో పేరంటానికి వెళ్ళింది, ఎప్పుడూ సందడిగా తిరిగే మృణాళిని కనిపించలేదు. జయ, ఆమె రాలేదేమని అడిగింది.

"వాళ్ళ నాన్నగారికి జబ్బుగా ఉంది. తనకి యెక్కడా ఉద్యోగం దొరకలేదు. ఇంటి యిబ్బందుల వలన రాలేకపోయిందనుకుంటాను. మనం వెళ్లిచూద్దామా? '' అన్నది కమల. ఇద్దరూ వెళ్ళారు.

బీదరికాన్ని సూచిస్తూన్న ఆ యింటిని చూచేసరికి జయకు బాధ కలగింది. అందం, తెలివి, కిన్నెర కంఠం స్వంతం చేసుకున్న మృణాళిని ఉండవలసిన స్థలం యిదేనా? అనుకున్నది.

జయ అహంభావాన్ని అర్థం చేసుకున్న మృణాళిని ఆమె రాకకు ఆశ్చర్యపడింది.

"నీరాక నాకు చాల సంతోషాన్ని కల్గిస్తూంది జయా! కాని మా యింట్లో సోఫాలు లేవు, '' అంటూ చాప తెచ్చి వేసింది. ఆమాటలు సహజంగానే ఉన్నా జయకు ఎత్తిపొడుపులాగా తోచాయి.

"నీకు జాబ్ వచ్చిందిట కదూ! మై హార్టీకం గ్రాట్యులేషన్స్,'' అన్నది మృణాళిని నిండుగా నవ్వుతూ. ఆ మాటల్లో, ఆమె ముఖంలో అసూయ తొణికిసలాడుతూందేమోనని వెదికిన జయ విఫలురాలైంది.

'థ్యాంక్స్,' అంతకంటే మాట పెగలలేదు—సంసార తాపత్రయంతో, నిరుద్యోగంతో మృణాళిని పడే ఆవేదన గ్రహించిన జయ మథనపడింది.

ఇంటికి వెళ్ళిన జయ తన గదిలో కుర్చీలో కూర్చుండి పోయింది. మృణాళిని దీనవదనం ఆమెకు పదే పదే జ్ఞప్తికి రాసాగింది. తను యింకా చదువుకుంటూ సాహిత్యసేవ చేయవచ్చు. విమల చిన్నదైనా యెంత నేర్పుగా సత్యాన్ని కళ్ళముందు నిల్పింది! ఇంక తను రాజీనామా నిచ్చి మృణాళినికా ఉద్యోగం యిప్పించాలి! అప్పుడే తనకు మనశ్శాంతి!

"అక్కా, చీకట్లో కూర్చున్నావేం?'' విమల వచ్చి లైటువేసి ఆమె చెంపలపై కన్నీటి చారలు చూచి తెల్లబోయింది.

"అలా ఉన్నావేం అక్కా? నాన్నగారు మన కోసం చూస్తున్నారు. భోజనానికి డైనింగ్ హాలులోకి నడిచారు.

"నేను రిజైన్ చేస్తాను నాన్నా! నాక్లాసు మేట్ మృణాళిని ఉద్యోగం దొరకక కష్టపడుతోంది. ఆమెకే నాపోస్టు యిమ్మని చెప్పండి,'' అన్నది శ్రీనాథంగారితో.

ఆమె మాటలు విమలకు, శ్రీనాథంగారికి సంతోషాన్ని కలిగించాయి.

"ఇప్పటికైనా నిజాన్ని గుర్తించగలిగావు. ఇతరుల కష్టాలు అర్థం చేసుకున్నావు. సంతోషం,'' అన్నారు శ్రీనాథంగారు.

రెండు రోజుల తరువాత మృణాళిని వచ్చి తనకు ఉద్యోగం అయిందని చెప్పినప్పుడు జయ తృప్తిగా నిట్టూర్చింది. ★

ANDHRA MAHILA SABHA

NURSING HOME & NURSES' TRAINING CENTRE

Statistics for the month of November, '59.

OUT-PATIENT REGISTER

No. of Surgical cases treated	61
„ „ Medical „ „	1,255
„ „ Gyneac „ „	175
„ „ Ante-natal „ „	281
„ „ Post-natal „ „	83
„ „ Dental „ „	22
„ „ E.E.N.T. „ „	75
Total Number of New Patients	1,952
Total Number of Old Patients	2,727
Grand total	4,679

ADMISSION REGISTER

No. of Normal deliveries		139
„ „ Abnormal deliveries (Forceps 15)		
T. P. Version	1	
Breech	2	
Force Presentation	2	20
„ „ Antenatal cases C False Pains		31
„ „ Antenatal cases C Texeamia		3
„ „ Post-natal cases		3
„ „ Gyneac „		23
„ „ Medical „		122
„ „ Babies admitted as Lodgers		162
Grand total		503

(Sd.) Dr. K. R. AMBUJA, *R. M. O.*

(Sd.) Dr. M. PAVANA BAI, *Medical Superintendent.*

(Sd.) Smt. V. LAKSHMI PARVATHI. *Secretary.*

జానకి చదువు

(కథానిక)

శ్రీ పి. నరసింగరావు

సాయంత్రం నాలుగున్నర గంటలు కావస్తోంది.

రోజూలాగే జానకి కాలక్షేపం కోసం డాబామీద నిల్చుంది. పక్కన చెల్లెలు లక్ష్మి చంకలో రెండేళ్ళ తమ్ముడు కృష్ణ ఉన్నాడు. అంతలో ఆవీధి గుండా స్కూలునుండి ఇళ్ళకు పోతున్న తన ఈడు పిల్లల గుంపుపై ఆమె దృష్టిపడింది. అ దృశ్యం ఆమె ఇంచు మించు ఒక సంవత్సరంనుంచీ రోజూ చూస్తున్నదే. కాని ఆనాడు ఉదయంనుంచీ అసలే మనస్సు బాగ లేక పోవడంతో "తనకు అలా స్వేచ్ఛగా వెళ్ళచదువుకునే యోగంలేదు కదా యని బాధపడసాగింది. ఈ విధమైన ఆలోచనలతో ఒక్కుమ్మడిని నిరుత్సాహం నిస్స్పృహ ఆమెను ఆవరించాయి. ఏదో తీరని అసంతృప్తితో, విరక్తితో,, పద్నాలుగుగేళ్ళయినా నిండని ఆ లేత హృదయం, భారమై దుఃఖం ముంచుకొచ్చింది. అనుకోకుండానే కనుకొలకుల్లో నీరు నిండింది.

"అక్కా ఏడుస్తున్నావెందుకే?"అంది నాలుగేళ్ళ లక్ష్మి అమాయకంగా.

జానకి జవాబు చెప్పకుండా మౌనంగా ఊరుకుంది అంతలోనే "జానకీ" అంటూ ఒక్క కేకవేసి పినతండ్రి రఘునాథం డాబాపైకి రావడంతో జానకి మళ్ళా ఈ లోకంలో పడింది. తన కన్నీరు పినతండ్రి కంటపడకుండా చేద్దామని ప్రయత్నించినా ప్రయోజనంలేక పోయింది.

"అదేమిటి జానకీ కన్నీళ్ళా?" అన్నాడు రఘు బాధగా.

"ఏమిటో బాబాయ్ నాలాంటి దురదృష్టవంతులకు. జీవితంలో చిన్న చిన్న కోరికలుకూడా తీరవు" అంది బాధగా కన్నీరు తుడుచుకుంటూ,

వీధిలో ఉత్సాహంగా పక్షుల గుంపుల్లా వెళ్తున్న బడిపిల్లలనుచూసి రఘు పరిస్థితిని అర్థం చేసుకున్నాడు "నాకు తెలుసు జానకీ నీవు ఎంతబాధపడుతున్నావో కాని ఏంచెయ్యడం? అన్నయ్య తనకు తోచినదే తప్ప మరొకరిమాట వినడుకదా"అన్నాడు రఘు తీవ్రంగా ఆలోచిస్తూ.

"పోనిమరొకసారి చెప్పిచూడు బాబాయ్ కనీసం ఈ సంవత్సరమేనా మళ్ళాబడిలో చేరితే బాగుణ్ణు" అంది జానకి దీనంగా.

"అలాగేనమ్మా తప్పకుండా మళ్ళాచెప్తా. అసలు నేను వచ్చింది అందుకేగా !" అన్నాడురఘు జానకిని ఓదారుస్తూ.

• • •

జానకి చదువు విషయంలో అన్నగారిని ఒప్పించలేక పోవడంతో రఘు మనస్సు పాడైంది. దానికి తోడు అతను ఎక్కి.. కూర్చున్న రైలుపెట్టె ఇంచు మించు అంతా ఖాళీగానే ఉండడం నుంచి సదుపాయంగా కూర్చుని అంతవరకు జరిగిన సంఘటనలు నెమరు వేసుకుంటున్నాడు. ఏవో రకరకాలైన ఆలోచనలు అతన్ని చుట్టుముట్టేయి తను, రమణయ్య. ఇద్దరూ ఒకే తల్లిపిల్లలైన, ఇంచు మించు ఒకే వాతావరణంలో పెరిగిన, ఇద్దరికీ. ఆదర్శాలలో, అభిప్రాయాలలో, ఎంత వ్యత్యాసముంది? తనకు స్త్రీల పట్ల ఎంత విశాల భావాలున్నాయో, పెద్దన్నయ్య రమణయ్యకు అంత సంకుచిత దృష్టి ! తనకు ఎంత ఆధునిక భావాలో. ఆయనకు అంత పురాతన భావాలు. ఇద్దరకు పొత్తు ఎలాకుదురుతుంది? అసలు జానకి ఏనాడు గౌనులు వదలి, వాణీలు వేసుకోవడం మొదలు పెట్టిందో, ఆనాడే ఆయన చదువు మాన్పించివేయడానికి సిద్ధపడ్డారు, కాని అప్పటికి జానకి చదువుతున్నది ఆడపిల్లల బడిలోకాబట్టి. పైగా అప్పటికి పెద్దపరీక్షలు మరో మూడు నెలలే ఉండడంనుంచి ఎలాగో అతికష్టంమీద ఆ ఎనిమిదవ తరగతి కాస్తా

పూర్తి చెయ్యనిచ్చేరు. ఇక అంతకన్నా చదవడం ఆడ పిల్లలకు అనవసరం అని ఆయన మొండిపట్టు పట్టుకుని కూర్చుంటే ఎవరుమాత్రం ఏంచెయ్యగలరు?

గమ్యం చేరిన తరువాత రఘు చాలా నిరుత్సాహంగానే ఇల్లు చేరుకున్నాడు. అతను సేదతీరిన తరువాత రాధ కాఫీగ్లాసు అందిస్తూ "ఏమండీ మీ అన్నయ్యా పిల్లలూ అంతా బావున్నారా?" అంది.

"ఆ"

"ఇంతకూ జానకి చదువుమాటేమైంది."

"ఏమౌతుంది? మనం అనుకున్నదే! మన ఇళ్ళల్లో వయసొచ్చిన పిల్లలు బడికి వెళ్ళి చదువుకునే అలవాటు లేదుట"

"అదేమిటండీ? అ పట్టింపులు ఇంకా ఈ రోజుల్లోనా?"

"బాగుంది రాధా నువ్వు ఇంటర్ ప్యాసైన దానివి నీకు అలాగే కన్పిస్తుంది"

"మరి మీ ఊళ్లో ఆడపిల్లల బడిలేదా?"

"లేదు. మగ పిల్లల బడిలో చదివించటం ఆయనకు ఇష్టంలేదుట."

"పోనీఇక్కడ ఆడపిల్లలకు ప్రత్యేకం హైస్కూలు ఉందికదా, పంపమనలేక పోయారా మనదగ్గర ఉండి చదువుకునేది?"

"చెప్పక పోవడమేమిటి రాధా. ఎన్నో విధాల చెప్పేను. కాని ఏదో సంబంధం కోసం చూస్తున్నారుట. అది కాస్తా కుదరగానే పెళ్ళిచేసి అత్త వారింటికి పంపుతారట. అంచేత ప్రస్తుతం మనదగ్గర ఉంచి చదివించడం సాధ్యపడదట"

"పోనీ పెళ్ళయేవరకూ ప్రైవేటుగా చదివించమనలేక పోయారా?"

"మగపిల్లలు ముగ్గురినీ చదివిస్తూ- దీన్ని ప్రైవేటుగా చదివించడానికీ. ప్రయివేట్లు పెట్టడానికీ అంత డబ్బు ఎక్కడుంది అన్నాడు. పోనీ దాని చదువు కోసం ప్రతి నెలా నేను కొంతసొమ్ము పంపుతానన్నా. దాంతో పౌరుషం వచ్చింది. కొసకు ఖచ్చితంగా తేల్చిందేమిటంటే అంతవరకూ చదివిందేదో చాలని. ఉద్యోగం చెయ్యాలా? ఊళ్లు ఏలాలా? ఆడ పిల్లలకు చదువెందుకు? అని. ఇకనేను చేయగల్గిందేముందిచెప్పు?"

"పోనీ మీ ఒదిన గట్టిగా చెప్పలేదూ?"

"ఆ ఆమెమాటకు అంతవిలువ ఉంటే ఇకలేనిదేం! ఇంతకూ ఆమెకు మాత్రం జానకి చదువుకోవాలని ఉంటేగా? ఆమెకు కావలసిందల్లా. పొద్దస్తమానం జానకి తనకు పని పాటలలో సాయపడడం. ఆ పైన చంటి పిల్లలను సముదాయించడం అంతే"

"పాపం జానకి ఎంత బాధపడుతుందో?"

"జానకేకాదు రాధా. మనమధ్య తరగతి కుటుంబాలలో ఇలా బాధపడుతున్న వాళ్ళు నూటికి ఇంచుమించు ఎనభై మంది పైగా ఉంటారనుకో. ఈ తల్లిదండ్రులకు, మగపిల్లల చదువు విషయంలో ఉన్నశ్రద్ధ ఆడపిల్లల చదువు విషయంలో ఉండదు అమ్మాయిలు పెద్దవారైన దగ్గరనుంచి, తమకు తాహతు లేకపోయినా అప్పోసప్పోచేసి అడిగిన కట్నం పారేసి పెళ్ళిచేసి అత్తవారింటికి పంపేద్దామన్న గోల తప్ప మరోదృష్టి ఉండదు అంత మాత్రంలో యుక్త వయస్సు వచ్చిన వాళ్ళకు వివాహం చెయ్యకూడదని నా అభిప్రాయంకాదు. కాని వివాహానికి ఎంత ప్రాముఖ్యం ఇస్తున్నారో చదువుకు కూడా అంత ప్రాముఖ్యం ఇవ్వాలి. మగ పిల్లలతో సమానంగా బి. ఎ. లు ఎమ్. ఏ. లు చదివించక పోయినా కనీసం, ఓ మెట్రిక్యులేషన్ వరకైనా ప్రతి ఒక్కరికీ విధిగా చదివించాలి. దానివలన ఉత్తరోత్తరా సంసారంలో ఒడుదుడుకులువచ్చినా, లేక దురదృష్టవశాత్తు ఏ కష్టమొచ్చినా-వాళ్లకాళ్ళమీద వాళ్లు నిలబడే అవకాశం. సంసారానికి ఆర్థికంగా సహాయపడగలమార్గం ఏర్పడతాయి. ఈ మంచిమార్పు వచ్చే వరకూ మన మధ్యతరగతి కుటుంబాలు బాగుపడవనుకో"

"మనం ఎంతబాధ పడితే మాత్రం ఏంలాభం? పెద్దలలో ఆ మార్పు కాలమే తేవాలి" అంది రాధ నిట్టూర్పు విడుస్తూ.

♦ ♦ ♦

ఈ రోజుల్లో మధ్యతరగతి కుటుంబాలలో పెళ్ళిళ్లు కావాలంటే పెద్ద బ్రహ్మాండమే. ఆడ పిల్లలకు గుణం రూపం, ఆరోగ్యం. ఉండగానే సరిపోవు. తగినంత

డబ్బుండాలి. కట్నకానుకలు విరివిగా ఇవ్వాలి. అంతే గాక పెండ్లి కుమారుల అభిరుచులను బట్టి, చదువు, సంగీతం: నృత్యం. ఇంటి పనులు ఒకటేమిటి ఇలా ఎన్నో అర్హతలు ఉండాలి. ఇవన్నీ ఉన్నా అదృష్టం లేకపోతే ఎన్ని సంబంధాలు చూసినా, ఒక్కొక్కప్పుడు ఉభయపక్షాలు ఒక నిర్ణయానికి రాలేకపోవచ్చు. అసలు వీటన్నిటికన్నా తమకు వచ్చే ఆదాయంతో సంసారాన్ని నిర్వహించగలమాలేదా అన్న అనుమానంతో చాలామంది యువకులు ఓ పక్కనుంచి వయస్సు ముదిరిపోతున్న వివాహానికి విముఖులుగానే ఉంటున్నారు.

ఇలాంటి క్లిష్టపరిస్థితిలలో రమణయ్యగారు కాళ్లు అరిగినట్లు తిరిగినా జానకికి తగిన సంబంధం స్థిరపరచలేకపోయారు. పాపం ఆయనమాత్రం పెళ్ళి చెయ్యడమంటే ఇంత కష్టం అని ఆనుకుంటేగా? మరి అందుకే అనుభవజ్ఞులు దిగితేగాని లోతు తెలియదన్నారు,

అనుకోకుండానే ఏనిమిది సంవత్సరాలు దొర్లిపోయాయి. జానకి వివాహం చెయ్యలేక పోయారు సరికదా, కుసుమ పెద్దమనిషై కూర్చుంది. ఇక లక్ష్మి కూడా నేడో రేపో పెద్దదై కూర్చుంటుంది. కుటుంబమైతే పెరిగిందికాని ఆదాయం పెరగలేదుగా? రమణయ్యగారికి గుమస్తాగిరీవల్ల నెలా నెలా వచ్చే నూటపాతికా ఏమూలకు? ఇకదానికితోడు ఒక సంవత్సరంలో రిటైర్ అవుతారు. ఇక మగపిల్లలా అంటే ఇంకా చదువుతూనే ఉన్నారు. వాళ్ళు చేతికందడానికి కనీసం అదో రెండేళ్ళయినా పడుతుంది. ఒకవేళ అన్నీ నవ్యంగా జరిగి ఏ గుమస్తా నౌఖరీవో దొరికినా అది ఉన్న ఊరిలోనే దొరుకుతుందని నమ్మకమేమిటి? ఏ పై వూరిలోనో దొరికితే మాత్రం ఈ కరువురోజుల్లో నెలా నెలా దొరికే స్వల్పజీతంలో వాళ్ళ ఖర్చులు పోనూ ఇంటికి ఎంత పంపగలరు? ఒకవేళ పంపినా ఎంతకాలం పంపతారు? ఇలా రమణయ్యగారు రాత్రీ పగలూ ఎడతెగని ఆలోచనలతో సతమత మౌతున్నాడు.

ఇక జానకి మాట సరేసరి. చదువు కుందామని తనకు ఎంతగాఉన్నా ఆకోరిక నెరవేరనేలేదు. పోనీ వివాహమైన అయిపోతే తనమాట ఎలా వున్నా కనీసం తల్లిదండ్రులకైనా శాంతి సౌఖ్యాలు లభిస్తాయనుకుంటే అది అంతకన్నా జరగలేదు. ఈ ఏడెనిమిది సంవత్సరాలలోనూ సుమారు పది పన్నెండుగురు పెండ్లికొడుకులు తనను చూశారు. నిజానికి చక్కదనంలోనూ, రూపంలోనూ, గుణంలోనూ, తనకు ఏలోటూ లేక పోయినా ఇంతవరకూ ఏదీస్థిరపడలేదు! వాళ్ళకు నచ్చితే వీళ్ళకు నచ్చదు, వీళ్ళకు నచ్చితే వాళ్ళకు నచ్చదు! ఉభయులకూ నచ్చితే బేరంకుదరదు, అయితే చివరకు మిగిలిందల్లా, నాటకంలో వేషధారిలా, తనకు ఇష్టం ఉన్నా లేకపోయినా పెళ్ళివారు చూడటానికి వస్తున్నారని చెప్పగానే ముస్తాబవడం, సిగ్గుతో తలవంచుకుని వాళ్ళ ముందు కూర్చోవడం. వాళ్ళు అడిగిన ప్రశ్నలకు జవాబులు చెప్పడం. ఏదో ఆశలు కల్పించు కోవడం కొనకు, నిరాశతో క్రుంగి పోవడం! తనను చూసినప్పుడల్లా తల్లి దండ్రులు తామేదో పెద్దభారం మోస్తున్నట్లూ అభారం ఎలా వదలించు కోవడమూ అన్నట్లు బాధ పడడం, వాళ్ళ ఆంతర్యం గుర్తించి తను లోలోపలే కుళ్ళిపోవడం! అంతకన్నా చేయగల్గేదేముంది?

టెలిగ్రాం ఆతృతగా విప్పి చదివి భార్యతో "యశోదా ఇంకేముంది! కొంపమునిగిందే"అన్నారు కుప్పగా కూలబడి రమణయ్యగారు.

"అయ్యో! అయ్యో! ఏంజరిగిందండీ'' అంటూ యశోదమ్మ భయంతో వొణికిపోయింది.

స్కూలుఫైనలు చదువుతున్న గోపాలం, తండ్రి చేతిలోని టెలిగ్రాంతీసి ,చదువుకుని "అమ్మా సరోజ అత్తయ్య మొగుడు ఏదో ప్రమాదంలో ఇరుక్కుని పోయాడుటే'' అన్నాడు.

దాంతో పెద్దా చిన్నా అందరూ గొల్లుమన్నారు.

ఎవరికి ఏ కష్టాలొచ్చినా, సుఖాలొచ్చినా కాలం ఆగదుగా!

రమణయ్యగార్కి యశోదమ్మకు పాతికేళ్ళయినా నిండని సరోజ భర్త పోయాడన్న దానికంటె, ఆమెను ఇద్దరు పసిపిల్లలను తామే పోషించాలన్న విషయం మరింత కలవర పెట్టింది క్రుంగతీసింది. కాని ఏం చేస్తారు? దిక్కూ మొక్కూ, ఇతరత్రా ఆస్థిలేని స్వంత విధవచెల్లెలును రమణయ్యగారు చూడకపోతే మరెవరు చూస్తారు? పైగా ఆయనకు సరోజపై విపరీతమైన అభిమానం! అంచేత ఆమెను పిల్లలను తీసుకు రావడంతో ఆర్థికంగా మరింత తల్లకిందు లయ్యారు.

సరోజ చదువుకుని ఉంటే కనీసం పాతికో పరకో వచ్చే ఏ నౌఖరీవో చేసైనా తనకాళ్ళ మీద నిలబడేది

కదా అన్న ఆలోచనలు రమణయ్యగార్కి వచ్చాయి. దాంతో ఎనిమిది సంవత్సరాల క్రిందట రఘు 'ఆడ పిల్లలకు చదువు ఆత్యావసరం' అని పదేపదే వాదించడం తాను 'అనవసరం అనవసరం' అని అతని వాదనను ఖండించడం గుర్తుకువచ్చి చాలాబాధ పడ్డాడు. అంతేకాదు ఎనిమిది సంవత్సరాలైనా పెళ్ళి పెడాకులు లేకుండా జానకిని ఇంట్లో కూర్చోపెట్టి కూడా ఆమెను కనీసం మెట్రిక్ వరకైనా చదివించ లేక పోయినందుకు తనను తాను నిందించు కున్నాడు. ఇవన్నీ ఆయనలో పెద్దమార్పు తీసుకు వచ్చాయి. ఆయన దృక్పథమే పూర్తిగా మారిపోయింది.

అందుకే చెల్లెలును పరామర్శ చేయడానికి వచ్చి వెళ్ళిపోకున్న తమ్ముడు రఘుతో "ఒరే రఘూ!, నేను పెద్ద పొరపాటు చేశా, ఆనాడు నీవు ఎంత చెప్పినా వినలేదు జానకి జీవితమంతా పాడుచేశా" అన్నారు

రఘుకు పరిస్థితి అర్థమైంది, అవును జానకి ఎంత మంచిదైనా ఎంత వినయ విధేయతలున్నదైనా ఆమెక్కూడా హృదయం ఉంది వీళ్ళ ఇష్టంవచ్చి నప్పుడు చదవడానికి వద్దన్నప్పుడు మానడానికి జీవంలేని కీలుబొమ్మా! ఇంతకూ చదువు మాన్పించిన ఎనిమిది సంవత్సరాల తరువాత, తన ఈడు వారంతా పట్టభద్రులైతే తాను ఈనాడు అవసరమొచ్చింది కదా అని మళ్ళీ తొమ్మిదవ తరగతిలో చేరడమా! కాని రఘు, రాధ, కలిసి జానకిని బుజ్జగించి ఒప్పించారు. తమతో తీసుకువెళ్ళి ప్రయివేటుగా చదివించి మెట్రిక్ పేసు చేయించడానికి నిశ్చయించారు జానకి పినతండ్రితో చదువుకై బయలుదేరింది.

వెళ్ళిపోతూ రాధ, బావగారితో "జానకికి ఏదైనా మంచి సంబంధం కుదిరితే మాత్రం వెంటనేరాయండి పంపుతా" అనిచెప్పి మరీ బయలుదేరింది రఘు, జానకి ఈ మాటలకు నవ్వుకున్నారు ★

స్వర్గతుల్యమైన:

జననీ - జన్మభూమి

శ్రీమతి గాదేపల్లి సుందరీ శంకరం

తనను గనిన తల్లి తాను పుట్టిన దేశము తనకు పవిత్రమై, పరమ ప్రీతికరమై స్వర్గతుల్యమగు చున్నవి. ఉపనిషద్వాక్యములలో కూడ మాతృ భూమికి మాతృదేవికి ప్రథమస్థానమే యీయబడింది

"అథాదిలోకం పృథివీ పూర్వరూపమ్ ద్యౌరుత్తర రూపం

ఆకాశస్సంధిః వాయుస్సంధానం యిత్యధిలోకం"

భూమి పూర్వ రూప మనియు అంతరిక్షము ఉత్తర రూప మనియు, ఈ రెండిటికీ సంధి ప్రదేశము ఆకాశ మనియు, ఈ రెండిటినీ చేర్చునది వాయు వనియు చెప్పబడింది. అటులనే

"అథాధిప్రజం మాతా పూర్వ రూపమ్
పితోత్తర రూపం, ప్రజాస్సంధిః
ప్రజననగం సంధానం ఇత్యధి ప్రజం"

అనగా మాతా పూర్వరూప మనియు, పిత ఉత్తర రూపమనియు, ప్రజా, సంతానము వీరిరువురికి సంధి యనియు. ఉపనిషద్వాక్యము తనను గన్న తల్లికి తాను నివశించున్న భూమికి దేవత్వము ఆపాదించ టంలో విశేషము లేకపోలేదు. శిశువు జనించగానే శిశు సంరక్షణకు కావలసిన పాలు తల్లికి కలుగు తున్నాయి అటులనే శరీర పోషణకు భూదేవి సమస్త అవసర పదార్థములను యిస్తోందకదా! మాతా శిశు వుల మధ్య జనించినది అవ్యాజమైన అనురాగము. ప్రేమ, భక్తి, త్యాగము గనుకనే పెద్దలు మాతృ దేవోభవ. పితృదేవోభవ ఆచార్యదేవోభవ అని చెప్పారు

ఈ పృథివియందుగల సమస్త చరాచరములైన జీవరాసులకు ప్రత్యక్షత్రిమూర్త్యాత్మకమైన అధినాథుడు ఆదిత్యుడు ఎటులనో శిశువునకు తల్లి కూడ అటువంటదే అని చెప్పారు సూర్యుడు ఉదయమున బ్రహ్మస్వరూపమనీ మధ్యాహ్నమున రుద్రస్వరూప మనీ, సాయంత్రమున విష్ణు స్వరూపమని కదా చెప్పారు! అటులనే మాతృశ్రీకి కూడ బ్రహ్మ విష్ణు మహేశ్వరత్వము ఆపాదించబడింది. శిరోభాగము బ్రహ్మ స్వరూపమనీ, హృదయ ప్రదేశము విష్ణు స్వరూపమనీ, అధో భాగము ఈశ్వర స్వరూపమనీ చెప్పారు ఎందుచేతనంటే యావత్సృష్టికీ బ్రహ్మ అధి దేవత అయినట్లే, సంకల్ప వికల్పములకు పంచేంద్రియ జ్ఞానమును కలిగిన శిరో భాగము సృష్టిని చేస్తోంది, సర్వాంగములతో కూడియున్న ఈ శరీరమును కర్త ప్రసారముచేత పోషించే చైతన్యముకు కలిగించునది హృదయము, గనుక దానికి విష్ణుస్థాన మీయబడింది. లయకారకుడైన ఈశ్వరుని స్థానము అధోభాగమునకు ఆపాదంచారు. ఇట్లు త్రిమూర్తి స్వరూపిణియైన మాతృదేవత, పంచభూతాత్మకమైన శరీరముతో ప్రత్యక్షదైవమగు చున్నది కదా!

తల్లి తరువాత పూజనీయమైనది భూమి. శైశవము నందు తల్లి రక్షించి, పోషించినట్లే తరువాత భూమాత కూడ సమస్త పదార్థములను సకల సౌకర్యములను కలుగ జేసి సమస్తమైన కోరికలను ఈడేరుస్తోంది. అందుచేత భూదేవికూడ పూజనీయురాలే. శ్రీ మహా విష్ణువునకు శ్రీదేవి భూదేవులు భార్యలైనట్లు పురాణ ములలో చెప్పబడింది. ఇది సత్యముగాను సమంజసము గానే కనబడుతోంది పోషణ కర్తయైన శ్రీ మహా విష్ణువు భూదేవి లక్ష్మీదేవుల ద్వారా మనకు సకలైశ్వ ర్యములను యిస్తున్నారన్నది పురాణప్రసిద్ధము. అందుచేతనే ఈ దేవతలను అనేక విధములుగా మనము ఆరాధిస్తున్నాము ఈశ్వరుడు పృథివ్యాపస్తేజోవాయు రాకాశములే శరీరము గాగలవాడని మన నమ్మకము. మన అభివృద్ధి యావత్తూ ఈ దేవతారాధన పైననే ఆధారపడియున్నదని మనమతము. ఈ దేవతలయందే మనము భక్తితాత్పర్యములుంచి సేవిస్తే మనకు సమ స్తము చేకూరగలవని మన విశ్వాసము. సూర్య చంద్రు లను యమ వరుణ అగ్ని మున్నగు దేవతలను యెల్ల ప్పుడు ప్రార్థిస్తూ మన నిత్యనైమిత్తికాది కర్మలను నడుపుకొనడం మన సాంప్రదాయము. కరువు కాటక ములు రాకుండ, ఉపద్రవములు పుట్టకుండ ప్రళయ

సన్నివేశములుకలుగకుండ ఈ దేవతలు మనలను కాపాడుచున్నారని మన వేదములు ఘోషిస్తున్నాయి. శృతిస్మృతులు నిరూపిస్తున్నాయి. బ్రహ్మము వలన ఆకాశము, ఆకాశమునుండి వాయువు, వాయువు వలన అగ్ని, అగ్ని వలన జలము, జలమునుండి పృధివి ఈ పృధివి నుండి శరీరాన్ని కాపాడే ఔషధులు, పోషించే అన్నము పుట్టుచున్నవనీ, అసలు ఈశరీరమే అన్నరసముయొక్క పరిణామ స్వరూపమని తైత్తిరయోపనిషత్తులో చెప్పబడినది. అందుచేతనే అన్నం పరబ్రహ్మ స్వరూపమన్నారు. ఈ అన్నము పచనము చేయునప్పుడు -దీనినిభుజించునప్పుడు యెన్నియో విధి నిషేధాలు నియమించి యున్నారు. అన్నద్వేషము కలిగిన వానికి ఆరు మాసములలో మరణము తప్పదని ఆర్యోక్తి. అలాగే బ్రహ్మద్వేషము అనగా భగవంతుని యందు భక్తి విశ్వాసములు నశించిననాడు నాశనము తప్పదని.



పెన్సిలిన్ కర్మాగారంలో ఒక దృశ్యం.

అటువంటి అన్న ప్రదాతయైన భూమాత మనకి పరమ పూజ్యురాలుఅన్న స్వరూప పరిణామమే ఈ శరీరము గనుక, ఈ శరీరమును సృష్టించి మన మతము యొక్క ప్రధాన అంశము. మనలను ప్రపంచమున మాతవలె పూజనీయు లాలే - గనుకనే "జననీజన్మ పడవేసిన తల్లియై నందున ఆమెకూడ మనకు పృధ్వి భూమిశ్చ స్వర్గాదపిగరీయసీ" అన్నారు.



శ్రేష్ఠ భిక్ష

సుఖశాంతు లెంతవరకు శాశ్వతము

సుందర పూలమాల తను లెంత శాశ్వతము

జీవితమూ అంతే కదా!!

శ్రావస్తీ నగరవాసులారా! మీలో ఎవరైనా మేల్కొంటున్నారా? మీ నేత్రాలను నిద్ర మత్తు నుంచి తొలగిస్తున్నారా? నేను బుద్ధ భగవానుని కొరకు యాచించుచున్నాను. భగవాన్ తథాగతుని కయి నాకు భిక్షను ప్రసాదిస్తారా?

నగరమంతా నిద్రాధీనమై ఉన్నది. శ్రావస్తుపుర గగన చుంబిత రమ్యహర్మ్యాలపై ఉషఃకాంతి మందంగా ప్రసరిస్తున్నది. దేవాలయాలలో వైతాళికులకు ప్రభాతగానం ఇంకా ప్రారంభం కాలేదు. సూర్యుడు ఉదయిస్తాడో లేదోయని కోకిల మెల్లమెల్లగా కుహూరవములు చేస్తున్నది.

అతను ఎవరు? ఈ సమయంలో, మాయమౌతున్న తారల అస్పష్ట కాంతిలో, నగరంలోని వీథి వీథి తిరుగుతూ కేకలేస్తున్నాడు. మేఘధ్వనివలె ఎవరిదా కంఠం ప్రతిధ్వనిస్తున్నది?

అతను భగవాన్ బుద్ధదేవుని శిష్యుడు "అనాధ పిండర్"

నిద్రిస్తున్న స్త్రీ పురుషులు అతని యాచన విని అటు నిటు కదలుతున్నారు. చెవులప్పగించి సన్యాసి కేక వింటున్నారు. భిక్షువు తిరిగి "వినండి నగరవాసులారా, మేఘాలు తమ సర్వస్వాన్ని కరగించి ఆ జలాన్ని జనుల కర్పిస్తున్నాయి. ఓ సాంసారిక జీవులారా త్యాగ, ధర్మమే అన్ని ధర్మముల సారము.

కైలాస శిఖరాలవరకు వినిపించేఆ భిక్షువువాణి ప్రభాత సుఖనిద్రలో ఉన్న ప్రజల చెవులలో ప్రతిధ్వనిస్తున్నది.

నిద్రిస్తున్న నగరవాసులు మేల్కొన్నారు. ఈ రాజ సంపద అంతా వ్యర్థమని రాజు అనుకొంటున్నాడు. ఈ విలాసములన్నీ వ్యర్థమని గృహస్తు లనుకొంటున్నారు. కోమల మనసిజులైన రమణులు హృదయాలు ద్రవీభూతమై అవ్యక్తంగా కన్నీరు కారుస్తున్నారు. సుఖలాలసలు తమ సుఖశాంతులెంత వరకు శాశ్వతము? ఇదంతా గతరాత్రి ధరించిన సుందర పూలమాల ప్రభాత సమయానికి ఏవిధంగా వాడిపోతుందో ఎందుకూ పనికిరాకుండా పోతుందో తమ జీవితమూ అంతేగదా అని ఆలోచిస్తున్నారు.

హర్మ్యాల ద్వారబంధాలు తెరచుకొన్నాయి. అందరూ కన్నులు నులుముకొంటూ చీకటిదారిపై పే చూస్తున్నారు. నిర్జన రాజ్యమార్గముపై ఒక నిద్రావిహీన భిక్షువుజోలి తీసుకొని కేకలేస్తున్నాడు, "భగవాన్ తథాగతునికి భిక్షను ప్రసాదించండి"

ఆహా, భగవంతునికి దానమివ్వ వలసిన ఘడియలివియే ఏ నిర్భాగ్యుడు ఈ క్షణాలను మరువగలడు?

రమణులు గుప్పిటలతో రత్నాలను వెదజల్లిరి కొందరు కంఠాభరణాలను తీసి విసరిరి. కొందరు ఆణి ముత్యాలను విసరిరి. లక్ష్మివర్షిస్తున్నదా అన్నట్లుండెను. రత్న భూషణ వస్త్రాదులతో రాజమార్గం కప్పుపడి పోయింది.

అయినా భిక్షువు ఇంకా అదేవిధంగా కేకలేస్తున్నాడు "భగవాన్ గౌతమ బుద్ధునికొరకు భిక్ష ఇవ్వండి" అతనలా అంటూ వెళ్ళిపోతున్నాడు. రత్న భూషణ సమూహము నుంచి వెళ్ళిపోతున్నాడు. అతని భిక్షాపాత్ర అలాగే ఖాళీగాఉంది, "ఓ అద్భుత భిక్షా గ్రేసరానీ కెలాంటి భిక్షకావాలి! నీకేంకావాలి? కోర్కె ఏమిటి?"

"నగరవాసులారా! మా ప్రభువుకు మణి మాణిక్యాలతో పనిలేదు. సుందర వస్త్ర భూషణాదులతో

మూలం: రవీంద్రనాథ ఠాకూర్.

అనుసరణ: కొసనం మహేశ్వరరావు

మా ప్రభువుకు అవసరంలేదు ఫకీరులకు. ఫకీరులకు ఆకలి అద్భుతంముగా ఉంటుంది. దానికి అన్నిటికన్నా ప్రభువు శ్రేష్టమైన దానము కావాలి."

ఆశ్చర్య విమూఢులైన నాగరికులు అలాగేమాస్తు నిలబడి పోయారు. భగవాన్ బుద్ధభిక్షువు ఖాళీజోలితోనే నగర ద్వారమును దాటాడు. అతను నిర్జరారణ్యములో వనచర పశువులకు. లతాద్రుమాలకు తన పిలుపును అందిస్తూ వెళ్తున్నాడు. "ప్రభువుగౌతమునికి భిక్ష ఇవ్వండి, తపింపజేసే ఆ మధ్యాహ్నసమయంలో నిర్జనారణ్యములో ఎవరా పిలచేది ఎవరో ప్రత్యుత్తర మిచ్చారు.

అటుచూడు! చిక్కి శల్యమైన ఒకస్త్రీ భూమిపై పడి ఉన్నది. ఆమెఅంగములపై ఏ భూషణమూలేదు. ఆమెదేహాన్ని ఒకే జీర్ణవస్త్రము అంటుకొని ఉన్నది. క్షీణ అస్పష్ట స్వరంలో ఆ స్త్రీ "ఓభిక్షువా ఆగుదేవాధిదేవునడైన తథాగతునకు ఈ బీదరాలి స్వల్ప కానుకను అందజేయి" అని ప్రక్కనే ఉన్న పొదలో అదృశ్యమైంది.

ఆ పొదచాటున తనదేహాన్ని దాచి, చేయి మాత్ర బయటకి చాచింది.

ఆ చేతిలో ఏముంది?

ఆమె నగ్న శరీరాన్ని దాచే ఒక జీర్ణవస్త్రపుతునక. ఆ స్త్రీ ఆ వస్త్రమును ఆ భిక్షువుజోలిలో వేసింది. "జయమగుగాక! మహా భిక్షువు హృదయం సంతుష్టి చెందింది. నేడు గౌతముని అవతారమునకు సఫలత సిద్ధించింది. జయమగుగాక! జగజ్జననీ జయమగుగాక"

జీర్ణమైన చింకి వస్త్రాన్ని శిరస్సుపై నుంచుకొని భిక్షువు అనాథపిండర్ భగవాన్ బుద్ధదేవునికి తను సంపాదించిన భిక్షను సమర్పించు కోవటానికి ఆత్మ సంతుష్టితో ముందుకు సాగాడు! ★

గాన ప్రవాహము

కె. సభా

ప్రవహించునుగాక
ప్రేమ పృథివిపై
ప్రవియించును గాక!

కఠిన కఠినమౌ హృదయమ్ములను
కరడుగట్టిన మానసములను
పెల్లగించుకొని ఉల్లాసముగా
ప్రేమ ప్రవాహము పృథివియంతటా!

కోటీశ్వరుల గుండెలలోని
గూడులదులిపి నీడలకడిగి
కోటలలో అధికారమదాంధుల
కోటి కెరటముల కౌగిలించుకొని!!

పాండిత్యముతో బలిసిన పెద్దల
పండిన తలలను నిండుగముంచి
ఎండిన మోడులు చివురులెత్తగా
ఖండ ఖండముల గానముఝుర్రైమై

ప్రవహించునుగాక
ప్రేమపృథివిపై
ప్రవియించుగాక!

ఎవరీ అసూయ?



(శ్రవ్యనాటిక)

కె. రామలక్ష్మి

ఎవరి అసూయ?

(తలుపు దభీలున వేసినచప్పుడు తాళంవేసినట్లు)

కృష్ణమూర్తి : సినిమాకా? బీచికా?

పార్వతి : చాలారోజులయిందిగా - బీచికి వెడదాం.

కృ : నడిచా? వాహనంలోనా?

పా : దగ్గిరేగా నడిచేవెడదాం.

కృ : (నవ్వుతూ) అయితే నడు పార్వతీ.

పా : ఎందుకూ నవ్వుతున్నావు?

కృ : ఏంలేదు. ఉట్టినేనే.

పా : చెప్తేగాని ఒక్క అడుగుకూడాముందుకు వేయను.

కృ : (నవ్వుతూనే) చెప్పేయమంటావా?

పా : ఊఁ కానీ మరి.

కృ : ఏంలేదు పార్వతీ, అనుకూల దాంపత్యం అంటే మనదీ అనిపించింది.

పా : ఎంచేత?

కృ : నిజానికి కృష్ణమూర్తికీనాడు సినిమాకి వెళ్ళాలని వుంది, నడవడానికి బద్ధకంగా వుంది. అయినా చూశావా భార్యా విధేయుణ్ణి.

పా : ఛో కృష్ణా, ముందే చెప్పకూడదూ.

కృ : అయినా యిప్పుడేం పోయింది. ఉట్టినే మెచ్చుకి చూపెడుతున్నా నువ్వంటే యీ కిష్టిగాడెలా పడి చస్తాడో-అయినా బీచియింత దగ్గిరసా పెట్టుకుని....

పా : నీకున్న జబ్బిదే. నాకోసం ఏదో పెద్ద శాక్రిఫైస్ చేసేసినట్టు—మహా.

కృ : (నవ్వుతూ) ఇంతకీ చెయ్యలేదంటావు-సహనంలో పోటీపడి ఏ మొగాడు గెలిచాడులే — వాడెవడో మన కేసే వస్తున్నట్టుంది.

పా : (వేళాకోళంగా) ఆ అంగలు వేయటం చూస్తే యింకా ఎవరో తెలియలేదూ,

కృ : (అనుమానంగా) రాధాయిలా వున్నాడు.

పా : అహాఁ సాక్షాత్తూను. ఇంక బీచికెళ్ళినా ఒకటే. వంటింట్లో పొయ్యిపక్కని హాయిగా కొంగుపరచుకు పడుకున్నా ఒకటే.

కృ : (గట్టిగా) రా, రా ......

పా : (తనలో తానుగా) అక్కడికి నిన్ను వదిలేస్తా దన్నట్లు.

కృ : ఏరా రాధా, యిలా వూడిపడ్డావు?

రాధా : (అతి వినయం ధ్వనిస్తూ) నమస్కారం పార్వతిగారూ

పా : (తప్పనిసరి అయి) నమస్కారం, బాగున్నారా?

రా : ఏదో మీ దయవల్ల.

కృ : ఏమిట్రోయ్, ఇంత సాధువై పోయావేమిటి?

పా : (ఉక్రోషంగా) లేకుంటే అంతా మీలాగే పెళ్ళయాకకూడా కొమ్ములు పెంచుకుంటూ కూర్చోరుగా.

కృ : (విరగబడి నవ్వుతాడు, రాధాయి కూడా జత కల్పుతాడు)

పా : ఇది పబ్లికురోడ్డు. వెంట ఒక ఆడదాన్ని తీసుకెడుతున్నామన్న యిద్దైనా లేదు.

రా : సారీ పార్వతిగారూ. ఏదో కోపంగా బయలుదేరినట్టున్నారు.

కృ : (తేలికగా) ఏంలేదురా, వస్తూ వస్తూనే హృదయం విప్పి మాట్లాడబోయాను.

రా : అఘోరించలేకపోయావూ. ఆడదానిముందు హృదయం విప్పి ఎవరోయ్ మాట్లాడమంట?

పా : (కోపంగా) అవునవును, ఉన్నవీ లేనివీ అన్నీ దాచుకోవాలిగాని.

కృ : పోనీలే పార్వతీ. అదిగాదురా....(పాత సంభాషణ అనుసరిస్తూన్నట్లు) సినిమాకా. బీచికా అన్నాను, చాలా రోజులైంది బీచికి వెడదాం అంది, నడిచా వాహనంలోనా అన్నాను, దగ్గిరేగా నడిచిఅంది. బస్ అసలింతే జరిగింది.

రా : ఒరేయ్, ఏదో దాస్తున్నావు. యీ చిన్న విషయానికి పార్వతిగారికి కోపంరాదు.

కృ : అఁ నాకసలు నడవాలని లేదు, సినిమాకి వెళ్ళాలని వుంది అనికూడా చెప్పేశాను.

రా : అదిగదీ. అక్కడా నువ్వు వేసిన ఘోరమైన తప్పటడుగు. ఇక అనుభవిస్తావులే.

పా : (హేళనగా) ఊరుకున్నావేం కృష్ణమూర్తీ యింకా పర్సనల్ విషయాలన్నీ వల్లెవేయవచ్చునే.

రా : సారీ పార్వతిగారూ, మాయిద్దరి మధ్య వ్యక్తిగత విషయాలన్నీ కామన్ విషయాలయి పోతాయి. దానికి మీరు బాధపడకూడదు.

(బీచి కెరటాలు దూరంగా విరిగిపడుతున్న చప్పుడు విన్పిస్తూంటుంది.)

పా : ఈ కృష్ణమూర్తిని వివాహం చేసుకున్నాక అసలు దేనికి బాధ పడ్డం మానేశాను.

కృ : అది అబద్ధం పార్వతీ, ఒకటి - నిన్న అన్నానికి రావడానికి ముందు సిగరెట్టు వెల్గించానని బాధ పడ్డావు. రెండు నిన్న నీ కిష్టంలేనప్పుడు రేడియో పెట్టానని బాధ పడ్డావు. మూడు.

పా : (విసుగ్గా) చాలు—యింకా యిలాలెక్కవేస్తే తెల్లారి లేచినది మొదలు చాలా వస్తాయి నీళ్ళ దగ్గిరసా కూర్చుందామా? యీ గట్టునా?

కృ : నీ యిష్టం.

పా : (విసురుగా) యిక నా యిష్టం చస్తే చెప్పను.

కృ : ఒరేయి రాధాయి, కోపంవస్తే పార్వతి ముఖం చూడలా.

పా : తుమ్మల్లో పొద్దుకూకినట్లు.

రా : యీ కథ విన్నావుట్రా, మనశీను లేడూ?

కృ : ఆఁ వాడేనా....రంగురంగుల మనిషి.

రా : చాలా గొడవైందిలే- మనం యిసివరకుండే వీధి చివర డాబాయిల్లులేదూ - అస్తమానూ అసూయా నెంబర్ వన్ అనేవాళ్లం.

కృ : (ఉత్సాహంగా) వాట్! అదెలా మరిచిపోతానురా,

పా : ఎవరా అనసూయ కృష్ణా?

రా : చచ్చాంపో. ఒరేయి, నువ్వేం సమాధానం చెప్పుకుంటావో చెప్పుకో.

కృ : అనసూయ అని అనలేదే?

పా : మాట మార్చేయడం ఎందుకూ? నీకు చెప్పకూడదనకూడదూ?

కృ : నువ్విట్టినే వూహించుకుంటున్నావు పార్వతీ, నాకే అనసూయా తెలియదు.

పా : చెప్తే చెప్పు. లేకుంటేలేదు. నాకీ దొంకతిరుగుళ్లు నచ్చవు.

కృ : (నవ్వుతాడు)

పా : అవునవును. మీకు వేళాకోళమే మరి ఉట్టి చేతకాని వాళ్లనిచేసి ఆడిస్తారు ఆడవారిని.

కృ : (ఇంకా నవ్వుతాడు)

పా : నవ్వండి. మీ ఘనతకి మీరే నవ్వుకోవాలి నా కిక్కడేంబాగులేదు. నే వెడతాను. మీరూ మీ స్నేహితులూ కులాసాగా కబుర్లేనా చెప్పుకుంటారు.

కృ : ఉండు పార్వతీ, యిద్దరం వెళ్లిపోదాం.

పా : ఒక్క క్షణంకూడా వుండను.

(పార్వతీ కేకవేస్తాడు-)

కృ : హుఁ, ఏమి ఆడవాళ్ళు.

రా : సారీ బ్రదర్, యింత నిప్పు అయితే ఏందారి?

కృ : (నవ్వుతూ) అంతేలే. తాటేకు మంట, సరుమనం వెడదాం...(ఎవరినో చూసినట్టు)చచ్చాంపో అక్కడ స్నేహితులమధ్య వసంతి కదూ?

రా : (ఉత్సాహంగా) 'కాక మరెంకెవరురా, అలా దీదేప్యమానంగా వెలిగిపోయేదీ?

కృ : హతోస్మి. యిదెప్పణ్ణుంచి?

రా : అసలా సంగతికి వద్దామనే యిందాకా అసూయ అన్నాను. ఒదినగారు అగ్గి గుగ్గి అయిపోయారు,

కృ : చూస్తే బాతాఖానీలో పడతాంగాని ఆ పక్కనుంచి వెళ్లిపోదాంపద,

రా : ఒరేయి, అంత దారుణం కూడదురా, వసంతని నువ్వుండగా ధైర్యంచేసి పలకరిద్దామని కదరా నీ వెంటవస్త.

కృ : (వేళాకోళంగా) ఒచ్చినవాడివి నోరుమూసుకుని నచ్చావా? నువ్వుపోయి కూర్చో, నేమెల్లిగా యింటికి పోతాను.


♦ ♦ ♦

(నిశ్శబ్దం ఎక్కడో గడియారం పన్నెండు కొట్టుతుంది)

కృ : (ఆవలించి చిటికివేస్తూ) ఇకనైనా అన్నం తిందామా పార్వతీ?

పా : నా కాకలి లేదు. నువ్వు తిని పడుకో.

కృ : నేనేం బకాసురుణ్ణా ఏమిటి. నాకూ ఆకలి లేదు. అయినా ఎందుకు పార్వతీ యింత కోపం? కన్నీళ్ళతో తలగడా అంతా తడిసింది. పాపం.



భారతీయ బాల భటులతో అమెరికా
అధ్యక్షుడు శ్రీ ఐసెన్ హోవరు.

పా : (పెల్లుబికివచ్చే ఏడుపుని ఆపుకొంటూ) అను, అను, నీయిష్టం వచ్చినట్టు అను, నాకొస్తే కోపం, మీకొస్తే వేళాకోళం, నారాతింతే....అయినా....

కృ : (చిన్న హేళన ధ్వనిస్తూ) ఆగిపోయావేం? ఇంకా తరువాయి లెందుకూ?

పా : (బాధగా) ఇక నా బ్రతుకంతా తరవాయే గా కృష్ణా, అయినా నువ్వింత యిదైనవాడివని అనుకోలేదు.

కృ : (నవ్వుతూ) అదే నాకు అర్థం కాలేదు పార్వతీ.

పా : అవునెలా అర్థం అవుతుంది? అర్థం చేసుకుందు కేనా ప్రయత్నిస్తేగా? (తనలోతనుగా) హుం. ఆడ దంటే ఎంత అలుసు. (బాధతో) ఇందుకేనా కోరి కోరి పెళ్ళాడింది? ఇలా చీటికీ మాటికీ బాధపడ్డం. ఏడవడం. (ఏడుస్తూ) ఎవరేం చేస్తారు, ఇందతా నా అదృష్టం. ఎవరినని ఏం ప్రయోజనం. జీవితం ఒక తియ్యని పాటలాగా పూలబాటలాగా సాగిపోతుంది అనుకున్నాను. సంతోషం పట్ట లేక హృదయం పురకలు పెడు తుందనుకున్నాను,

కృ: (అనునయం ధ్వనిస్తూ.) పార్వతీ.

పా : (ఏడుస్తూనే) నన్ను పిల వకు, నాకూ నీకూ ఏమిటి. యింకేమీలేదు నీ తీయని పాత గాఢలసి ప్రేమలని తవ్వుకు వాటిలో బ్రతుకు, నాకింకేం లేదు. యీ ఏడుపే.

కృ : (లాలనగా) పార్వతీ, అలా కంటతడిపెట్టకు పార్వతీ.

పా : నన్ను ముట్టుకోకు, యీ గాలికౌగిళ్ళు నాకక్కర లేదు. మనసొకచోట...

కృ : ఛీ. పార్వతీ, నీ అనుమానాలకీ, అసూయకీ అసలర్థం కూడా వుండదనుకుంటాను. ఏమొచ్చిందని యింత ఏడుపు? రాధాయి నీకు తెలియదా? వట్టి వేళాకోళం మనిషి. అయినా అడిగితే చెప్పిందికూడ వినిపించుకోవు. నీ వూహలు నీవేగాని.

పా : నేనడిగింది చెప్పావా? ఉట్టి కల్లిబొల్లి కబుర్లు చెప్పి నన్ను మభ్యపెట్టాలని చూశావు.

కృ: ఆదికాదు పార్వతీ, అసలు అనసూయలెవరూ నాకు తెలియను. అది నిజం.

పా : శుద్ధ అబద్ధం.

కృ : ఇవి కలియని పట్టాలు! ఇంక నేచెప్పి లాభం ఏమిటి? నువ్వు విని లాభం ఏమిటి? (అనునయంగా) నువ్వొట్టి అమాయకురాలివి పార్వతీ. నిన్నెన్నాళ్ళ నుంచో తెలుసు నాకు,

పా : అందుకే మరీ అలుసు.

కృ : నువ్వంటే నాకు ప్రాణం. ఆ సంగతి తెలుసు. నీ కోపం ముఖం రాధాయి కీనాడు కాదు—చాలా రోజులనుంచీ తెలుసు. నీకు జ్ఞాపకం వుందా? మీ

అన్నయ్యకోసం మేం వస్తే మండి పడేదానివి. నీ విప్పారిన కళ్ళు చూస్తే నాకు మైకం వచ్చినంత పన య్యేది. నీకు జ్ఞాపకం వుందా పార్వతీ?

పా : ఎందుకు జ్ఞాపకం లేదు— కళ్ళుమూసుకుంటే చాలు, యిలా స్విచ్ వేసినట్టు అంతా నా కళ్ళముందు వుంటుంది.

కృ : అవునా? మరి అలాంటి యీ దాసుణ్ణి యిలా ఆగ్రహిస్తే ఎలాగచెప్పు ?

పా : ....

క : సమాధానం కోసంకాదు పార్వతీ, అయినా మాటా మాట మధ్య స్థలం చేసుకుని నీ మాటలకోటలు కట్టేస్తావు. అది కాదంటే నమ్మవు. అవునంటే కోపం. నీతో కత్తిమీద సాములావుంది పార్వతీ.

పా : (నవ్వుతూ) అలా నీకుండాలి. ఇది నాఅత్తవారిల్లు

క : ఓహో, అందుకా యిది ఇద్దరికి అత్తవారిల్లు చేద్దామనా నన్నేడిపించడం ?

పా : ఛ, అవేంమాటలు- పోనిలే జరిగిందేదో జరిగిపోయింది- అన్నంతిందాంరా, కాకరకాయ వేయించాను,

కృ : హతోస్మి. ఇందాకానే చెప్పితే ఆకలి యింతసేపు ఆగేదా?

పా ; సరేగాని కృష్ణా, యిప్పుడు చెప్పు అసలు సంగతి-

కృ : అసలు సంగతేం లేదోయ్, ఆ రాధాయి, ఎలాగైనా అసూయ అనే అమ్మాయితో- మాట్లాడాలని - అదంతా చెప్పకుండానే నువ్వు మంగళం పాడేశావు.

(ఇద్దరూ నవ్వుకుంటారు)

♦ ♦ ♦

పా : హల్లో...ఏమిటీ తుఫాను రాక? రా, రా.

వసం : ఏమిటోయ్ పార్వతీ, నీకు తెరిపి వుండదేమో అని రాలేదు ఎలాగున్నావు?

పా : ఇదిగో, చూస్తూనే ఏమిటా చొప్పదంటు ప్రశ్నలు. విశేషాలంటే చెప్పుదూ ఏం తోచక వస్తున్నాననుకో.

వసం : ఆగాగు, విశేషాలకేం లోటు, అసలందుకేగా వస్త

పా : (కుతూహలంగా) మరయితే కానియి, (నవ్వుతూ) మళ్ళీ మగవాళ్ళొచ్చేస్తారు.

వసం : బాగా చెప్పావు. చూడు పార్వతీ, నీకు జ్ఞాపకం వుండే వుంటుంది. మీ పాతింటి వీధిలో చివరింట్లో వుండేటప్పుడేం, మీ ఆయనతో ఓ కుర్రాడు వస్తూండేవాడు, చూస్తుండగా, అంతింతై అన్నట్లు యీ క్షణానో పెద్ద యింజనీరట నీకు తెలుసా?

పా : కానీ. నువ్వింకా చెప్తే జ్ఞాపకం రావచ్చు

వసం : అతన్ని నాకు చూస్తున్నారోయ్ నాన్నగారు. ఏదో పెద్ద గునిసి గునిసి ఒప్పుకున్నాట్ట. ఎక్కడైనా ఒక్కరూ కన్పిస్తే అడుగుదామని వుంది.

సౌ : (చిలిపిగా) ఏమనీ?

వసం : ఏమనీ ఏమిటీ నీ ముఖం-ఓ మొద్దబ్బాయీ, నీ ముఖం ఎప్పుడైనా అద్దంలో చూసుకున్నావా? చూసుకున్నాకనే యింత కట్నం కానుకలు కావాలనుకున్నావా? నీ చదువంతా ఏ గంగలో కలిసింది - వగైరా-వగైరా——

పా : అడగ్గలవా నిజంగా వసంతా?

వంస : ఎందుకడగనూ, ఖచ్చితంగా అడిగేస్తాను.

పా : నీకా అబ్బాయి తెలుసా?

వసం : తెలుసు. అందుకే యింత మేర్చానీ చేశాడంటే తిక్కకోపం వచ్చింది. ఈ సంబంధం కాకుంటే మరోటాయిరి, ఏమంటావు పార్వతీ?

పా : (ఆలోచనలో పడ్డట్టు) అంత సులభం కాదు వసంతా.

వసం : ఏమిటీ ఆలోచనలో పడ్డావు?

పా : ఏంలేదు. కోరినమనిషి కానప్పుడు ఏ మనిషైనా ఒకటే, నిజమే. కాని ఈ సంబంధం నువ్వు చూశావా వసంతా?

వసం : ఫో పార్వతీ, నీకేంతెలుసు అతనికోసం నేను వేయిసంవత్సరాలనుంచి తపస్సు చేస్తున్నాను.

పా : అయితే అతను గునిసినా ఒకటే. యిక తప్పదని చేసుకున్నా ఒకటే నీకు. అయినప్పుడు నువ్వడుగుతానన్నవి అడిగీ ఏం ప్రయోజనం ?

వసం : అంతేలే పార్వతీ. పౌరుషం ఆడవాళ్లకి వుండీ లాభంలేదు.

పా : (వేళాకోళంగా)పౌరుషం ఏం వంకాయ కనకనా కాల్చి పచ్చడిచేసి ప్రేమతో పెట్టడానికి ! అవునుకాని

వసంతా. నువ్వేదో దాస్తున్నావు. నాదగ్గిర దాపరికం ఏమిటి నీకు ?

వసం : (నట్టుతూ) అదికాదు పార్వతీ....

పా : (ప్రోత్సహిస్తూ) చెప్పు వసంతా, ఏమిటి నిన్ను బాధపెడుతూన్న విషయం ?

వసం : అదికాదు పార్వతీ. నా తీయని కలలు పండేరోజు అందరినీ విసిగించే రోజు అవడంనాకిష్టంలేదు, ఏదో తప్పని సరికదా అని అమ్మ నాన్నగారూ; ఎలాగో అలాగ కట్టబెట్ట వలసిందేకదా అని అన్నలూ, అంతా అంటున్నారు పార్వతీ,

పా : అది సహజమేకాదూ, వాళ్ల కష్టాలు వాళ్లవి అయినా యీ అబ్బాయి కింతేసి గొంతెమ్మ కోరికలేమిటో?

వసం : ఈ రోజుల్లో ఇంతే పార్వతీ, అందరూ నీ అంత అదృష్ట వంతులవుతారా?

పా : (నవ్వుతూ) అలా అనకు వసంతా — పీత కష్టాలు పీతవి ; నీకేం తెలుసు?

వసం : ఇంట్లో వాతావరణం నచ్చడంలేదు. ధైర్యంచేసి నా పచ్చనికల నేను చెరిపేసుకోలేను. ఏం చెయ్యాను పార్వతీ- నాకేందారి తోచడంలేదు.

పా : నువ్వేం బాధపడకు. కృష్ణ వస్తాడుగా, అంతా అడిగి యిదో ఆదర్శ వివాహం చేద్దాం. నీకేం భయం లేదు.

(పార్వతీ అని కేక)

వసం : అదిగో మీ ఆయన వస్తున్నాడు—నే పోతాను.

పా : ఫరవాలేదు. వుండవోయ్. ఎవరో స్నేహితుల్ని కూడా తెస్తున్నారు. మనం లోపల కూర్చుందాం రా.

కృ : అమ్మయ్య. చూస్తూ ఎంత దూరం నడిపించావురా ఏది ఓ సిగరెట్టిలా పారేయ్,

రా : ఇదంతా చెప్పాక, యిక నీ తీర్పు చెప్పు.

కృ : దానికేముందీ పార్వతిని అడుగుదాం.

రా : ఒద్దురా బాబూ, మళ్ళీ రెండు రోజులు పస్తులూ... గొడవా....

పా : (వస్తూ) నా స్నేహితురాలొకామె వచ్చింది. యిలా లోపలికిరా కృష్ణా పరిచయం చేస్తాను.

కృ : ఉండరా బ్రదర్ యిప్పుడే వస్తా.

కృ : నమస్కారం.

వసం : నమస్కారమండీ.

కృ : మై గాడ్. పార్వతీ యీవిడే...

పా : బాగుందండీ, అసలే వసంత మనస్సు ఎంతో బాధతో కుమిలి కుమిలి వుంది.

కృ : అదికాదు పార్వతీ...

పా : ఏం లేదులే, నువ్వెళ్ళిక.

రా : (ఆత్రంగా) ఏరా, ఎవరామె?

కృ : (తాపీగా) అసూయరా? అసూయ. మూర్తీభవించి వంటయింట కూర్చుని వుందిరా, పలకరిస్తావా?

రా : నిజంగానా? ఆవిడేనా? సరిగ్గా చూశావా?

పా : ఎవరినండీ సరిగ్గా చూడ్డం?

రా : (తడబడుతూ) ఆవిణ్ణే ..

పా : ఇద్దరికిద్దరూ బాగా జతకూడారు. ఓ వసంతా, (పిలుస్తుంది)ఇలారా,కృష్ణ స్నేహితులొచ్చారిక్కడ. యీమె నా స్నేహితురాలు వసంత. వివాహం నిశ్చయం అయింది భయపడకండి.

రా : నిజంగానా? చాలా సంతోషం. ఎవరా అదృష వంతుడు.

కృ : (అందుకుంటూ) ఎవరో దురదృష వంతుడని అసలు అభిప్రాయం.

పా : (నవ్వుతూ) ఎవరో కౌన్ కిస్తాగారు. అవును కాని, మీ స్నేహితుడికికూడా పెళ్ళి సంబంధా లొచ్చాయటగా, చెప్పలేదేం?

కృ : ఇష్టంలేని పెళ్ళి కష్టం— పార్వతీ వాడందుకే రణాయించి ఆరువేలు కట్నం వడుక్కుంటున్నాడు.

పా : సిగ్గులేకపోతేసరి.

కృ : మరేం చెయ్య మన్నావు పార్వతీ, యిహం చెడ్డా ఫలమేనా దక్కాలిగా.

పా : మా వసంతకీ అంతే జరిగింది.

రా : మీ స్నేహితురాలికేమండీ, ఎవరైనా కళ్ళ కద్దుకు చేసుకుంటారు గదా?

పా : అదంతా కథల్లో.

కృ : కోపం తెచ్చుకోకుండా వుంటే ఒకటడుగుతాను

పార్వతీ. మగవాణ్ణి చూస్తే కొట్టే ఆడదాన్ని ఎవరు మటుకు సహించ కలరు చెప్పు?

పా : ఇష్టం అయితేసరి, పాముకి పాలుపోసి పెంచడం లేదూ?

రా : క్షమించండి పార్వతిగారూ, యీ వసంత మా అసూయ అని అనుకోలేదు. పెళ్ళి కొడుకుని చూడ మంటే అక్కర లేదందిట.

పా : వేషంలో ఏం చూడాలండీ, మరీను.

రా : అందుకే ఎవరో అనుకున్నాను. ఇప్పుడు తెలిసిందిగా. కట్నం వద్దు, ఏం వద్దు. నా ప్రాణం నిలపడానికి నన్ను పెళ్ళాడితే చాలు. ఏం వసంతగారూ?

పా : ఇది బాగుందయ్యా, డైరక్టు సమాచారాలిక్కడ కాదు—రండి అంతా బీచికి పోదాం. పున్నమ వెన్నెల ఉట్టినే పోతూంది.

(తలుపులు వేసినచప్పుడు)

నడు వసంతా, రాధాయి యింటికి జాగ్రత్తగా తీసుకు వెడతాడులే—మీ వీధి వీళ్ళిద్దరికీ కొట్టిన పిండి.

రా : చూడండి, వసంతగారూ...

కృ : (వేళాకోళంగా) అనబడే అసూయగారూ అనరా.

రా : నీ గొడవ నువ్వు చూసుకోరా. అనవసరంగా నాపై కేంద్రీకరిస్తే మళ్ళీ ప్రమాదం.

కృ : బ్రదర్, మరచిపోయావా, ఆడదంటే అసూయ, అసూయే ఆడది.

పా : (నవ్వుతూ)ఏ సన్నాసిగాడు చెప్పాడానిజం కృష్ణా?

కృ : బాగా చెప్పావు. ఎవరీ పార్వతి? ఎవరీ అసూయ. ఒరేయ్, మీరు బీచికి వెళ్ళండి, మేం సినిమాకి పోతున్నాం. వసంత జాగ్రత్త. గుడ్‌నైట్.

(ఇద్దరూ నవ్వుతారు)

(రేడియో ప్రసారితం) ★

ఒక అభిప్రాయం

ఒక అభినందన

డిశంబరు నెల ఆంధ్ర మహిళ నవంబరు 30 వ తేదీనే శుమార్పణ అను సంపాదకుల శీర్షికతో ప్రత్యక్షమైంది. ఆశ్చర్యపోయాను శుమార్పణకోరే అంత తప్పులు ఆంధ్ర మహిళ చేయదు కనుక. తీరా చదివి చూస్తే ఆశ్చర్యం ఆనందంగా మారింది. పదహారు సంవత్సరములు నిండిన ఆంధ్రమహిళ కలకలలాడుతూ దివ్య రూపముతో జనవరిలో ప్రత్యక్ష మవుతుంది. మంచి రూపంకావాలంటే. ముందు మంచి మనసు కావాలిచూడండి మరో పత్రిక సంపాదకు లెవరన్నా అయితే ఇంత మృదువుగా చెప్పరు.

సంపాదకురాలు మంచి వ్యాసములు కథలు. వ్రాసి పంపించండని రచయితలకు వ్రాశారు ఎప్పుడు చదవడమే కాని వ్రాయటం పత్రికలకు పంపటం అలవాటులేని నాకు వ్రాయాలనిపించింది ఎందుకంటే ఆంధ్ర మహిళను సృష్టించి మనకిచ్చిన శ్రీమతి దుర్గాబాయమ్మగారు ఆమెను సృష్టించి దేశసేవా సౌభాగ్యముల కొరకు సమర్పించిన శ్రీమతి కృష్ణవేణమ్మగారు ఒక్క మెరుపులా మెరిశారు. నా అనుభవములో మొదటిసారిగా గృహలక్ష్మిలో ఖద్దరుచీరెను నుదుట నయాపైసంత కుంకుమబొట్టు జాతీయ పతాకం చేతిలో ఉండగా చూచాను. వీరనారి దుర్గాబాయి మూర్తిని; తిరిగి 44 లో ఆంధ్ర మహిళ సంపాదకురాలుగా ప్రత్యక్షంగా చూడగలిగాను. అప్పటినుండి నేటివరకు ఆంధ్ర మహిళ ప్రతినెలా చూస్తున్నాను అందులో ఆంధ్ర మహిళలకు అతి ముఖ్యవిషయములు మాత్రం ఉంటాయి; చెత్తా చెదారంఉండదు. ఆంధ్ర మహిళలో ప్రతి శీర్షిక స్వార్థరహిత దేశసేవ నేర్పుతుంది.

స్థాపకురాలు శ్రీమతి దుర్గాబాయిగారిలోనే దివ్య సంపత్తి ఉంది. ఆమె సంకల్ప మాత్రంగా ప్రారంభించటం కార్య దీక్షాపరులు నిస్వార్థపరులు విద్యావినయశీలురు సమర్థులు అయిన మహిళామణులు ఎక్కడ ఉన్నా తన దివ్యదృష్టితో పట్టితెచ్చి వారిచేత నిర్వహింప చేయుటలోనే ఆమె ప్రత్యేకత ప్రతిఫలించుచున్నది.

ఒకసారి వారి దంపతులను దర్శించ వెళ్ళిన నన్ను దగ్గరకు తీసి భుజముతట్టి "గుడ్‌వర్కర్" అని శ్రీ దేశముఖ్‌గారితో చెప్పిన దృశ్యం తల్చుకుంటే: ఆ వాత్సల్యం ఆదరణ ఆ బుజ్జగింపుల్లో మాతృమూర్తి ప్రేమ తొణికిసలాడింది. ఆమె ఆసేతుహిమాచల పర్యంతము భారతావనికి సేవ చేసిన మహాతపస్వి. వీరదుర్గ విద్యాదుర్గ మహాదుర్గ విజయ పతాకంతో యీనాడు ఆంధ్రావని కెందరనో మహిళలను తయారుచేసి తను కరుణామూర్తిగా మాతృమూర్తిగా భారతావనికి ఆదర్శమహిళగా ధన్యత్వమునొందినది.

ఆంధ్ర మహిళగా పుట్టి తను ఒక ఆంధ్ర మహిళను మనకిచ్చే భారతమహిళగా విలసిల్లే విశాల హృదయ, ఈమెయొక్క చలువలో చల్లని ప్రేమపూరిత దృక్కులలో పదహారు సంవత్సరములు పెరిగి పేరెన్నిక గన్నది మన ఆంధ్ర మహిళ, సంపాదకుల చలువతో వ్యవస్థాపకుల ప్రేమతో రచయితల ఆదరణతో సర్వాలంకార శోభితమై ఎప్పుడు వచ్చునా అని ఎదురు చూస్తాము.

శ్రీమతి మంత్రిప్రగడ వరలక్ష్మమ్మ

కాశ్మీరంలో శశి

శ్రీ కొల్లుకుదురు రాజశేఖరరెడ్డి

అవి ప్రపంచంలో ప్రకృతిసౌందర్యానికి వన్నెకెక్కిన కాశ్మీర లోయలు. వాటి సౌందర్యాన్ని ఒక్క మాటలో చెప్పాలంటే "మానవుడు అవి చూడకుండా మరణిస్తే అతని జీవితం నిరర్ధకమే''

కుముద బాలధవుని ముదిత. కుముద పిండార బోసినట్లుగా కన్నుల పండువలా కురులాడుస్తున్నది. ఆ పుచ్చపువ్వులాంటి వెన్నెలలో కాశ్మీర్ లోయల సౌందర్యం ఇబ్బడిగా ఇనుమడిస్తున్నది. దూరాన పికీ కాంత ప్రియునికోసం తియ్యగా కూస్తున్నది. మరాళ జంటలు సెలయేళ్ళలో సరస సల్లాపాలు ఆడుకొంటు న్నాయ్. కుసుమముల నుండి పుప్పొడి మలయపవనములకు ఎగిరి మంచు బిందువులపై నేత్రానందంగా పడుతున్నది.

అట్టిరమణీయ ప్రకృతిలో యొక జవ్వని మంచులో తడసిన పుప్పొడిలాంటి మెత్తని గడ్డిపై వెల్లకిలా పరుండి ఏదో తెలియని స్వప్నాలలో విహరిస్తూ ఆనందంచక్కలిగింతలు పెట్టగా వాలుకన్నులు చిన్నగా మూస్తూ తెరుస్తూంది. శరత్ తమస్వినుల మనోజ్ఞసుంధాంశు కిరణములను మత్తుగా వీక్షిస్తూ మధ్య మధ్య అరుణకాంతిని బోలు పెదవులనుండి ఎల నవ్వులు చిందిస్తున్నది.

ఆ మనోహార దివ్యరూపమును ఏమని వర్ణించడం? అప్పుడే విరిసిన లే గులాబిలోని మార్దవాన్ని మృదుత్వాన్ని పుణికి పుచ్చుకొన్నది ఆ లేజవ్వని శరీరం. పాలరాతిని ధిక్కరించే ఆమె దేహచ్ఛాయ ముందు తుహినకిరణుడు తలవంచుకున్నాడు. చంద్రబింబాన్ని చిన్న బుచ్చే ఆమోము, నల్లకలువ పత్రాలవంటి సోగ కన్నులు, కొనదేలి ముద్దొస్తున్న ముక్కు, తామర పూరేకువంటి చెక్కిళ్ళు, నెమలి దంతమురీతి దంతములు, తామర తూడులవంటి మృదువైన చేతులు, గుప్పెటలో ఇముడునాయన్నంత నడుము, కమలాల మొగ్గలవలె నున్న పాదాలు, మధుర మోహన జ్యోత్స్నలో మరింత సుందరమై లోకాల నావరిస్తున్నది.

వంపులు తిరిగిన యవ్వన పొంకపు వలపుచే కాబోలు అప్పుడప్పుడు మేను అదురు చున్నది. ప్రేమతో, ప్రేమ శ్రుతితో, ప్రేమానురాగాలతో, ప్రేమ గీతాలతో, అటు ఇటూ కదలుచున్నది.

జవ్వని నోటినుండివినిపిస్తున్న గీతములు లోయలో ప్రతిధ్వనిస్తున్నాయి. ఆమె కంఠ మాధుర్యమునకు పికజాలము పారిపోయినవి. మధుర గీతికలను విని ఆనందించి సాంద్ర చంద్రికా స్తోమ విరాజితంబువలె వెలిగినాడు కైరవప్రుడు. ద్రికాదేటి తనపాట నాపి శ్రద్ధతో జవ్వని గీతమునాలకి ఎల తోటివారలకు నేర్పుటకు కాబోలు పరుగు పరుగుంచి తుర్రుమన్నది.

ఆమె కాశ్మీర్ లోయలలోని రైతు కుటుంబంలో జనన మొందినది. శశి అను అక్షరములే ఆ మనోరి నామము. అరవిచ్చిన అరవిందంలాంటి ప్రకృతి సౌందర్యానికీ ఆమె బానిస. రేయింపవళ్లు కాశ్మీర్ లోయలలో తిరుగుతూ, ఎగురుతూ, ఏవేవో గీతాలు అల్లుతూ సంతోషంతో ఉక్కిరి బిక్కిరౌతుంటుంది. ఈ జగతితో ఆమెకు సంబంధ బాంధవ్యాలు తక్కువ. ఆమెది వేరే లోకం. అది ఏ మధుర లోకమో. ఆమె మనస్సుకే తెలుసు.

శశి అల్లిన రమ్యమైన గీతాల కోసం. స్నేహితులు ఇరుగు పొరుగువారు చెవి కోసుకొనేవారు. పదే పదే ఆమె నోటినుండి విన్నవారికి ఆ గీతాలు వచ్చేస్తుండేవి.

ఆమె తండ్రికి తన కూతురు విషయమేమీ అంతు పట్టేదికాదు. ఈ కవిత్వమేమిటో, ఈ పాటలేమిటో. ఇవంతా పొడుకాలపు తక్కువ బుద్ధులని తలచేవాడు. చెంగు చెంగుమని దూకుతూపారే సెలయేళ్ళనుచూస్తే అలా చూస్తూ ఏదో గొణుక్కొంటుంది. చక్కని పువ్వులనుచూచినా, కిల కిలా రావములతో విహరించే, విహంగములను తిలకించినా అంతే. పాపం అతనికి శశి ప్రకృతి ఏమీ అర్ధంకాలేదు. ఇలా వదిలేస్తే చెయ్యి దాటి పోతుందని తలచి కట్టుబాట్లు పెంచాడు.

మునపటిలా ఆమెను ఎప్పుడు పడితే అప్పుడు. ఎక్కడికి పడితే అక్కడికి పోనీయటంలేదు. బయట ప్రపంచంతో చాలవరకు ఆమెకు బాంధవ్యం తెగిందనే చెప్పాలి. ఈ ఆంక్షలకు కారణమేమిటో ఆమె లీలగా ఊహించినా మిక్కిలి బాధపడింది.

వెన్నెల రాత్రులు. కోయిల పాటలు ఎలదేటి ఝుంకారములు, నదీతీరవిహారాలు, కరువైయ్యాయి. ఆమెకు పిచ్చెత్తినట్లయింది, తల్లి తండ్రుల ఎదుట రోదించింది, అరిచింది, బెదిరించింది, ఎన్నెన్నో చేసింది కాని ఆమె ఆశించినమార్పు ఆబండ హృదయాలలో కలగలేదు.

ఉన్నట్టుండి ఒక రోజు ముస్తాబుచేశారు, ఎందుకో ఆమెకు అర్థంకాలేదు. ఆతర్వాత వినిగోల చేసింది. పెద్ద పెట్టునఏడ్చి ఆహారపానీయాలు విసర్జించినా లేక్కచేయక ఆమె తల్లి దండ్రులు ఆమె కంఠమునకు ఉరికట్టించారు. లోకజ్ఞానం తెలియని ఒక అమాయక రైతుయువకునితో ఆమె వివాహం జరిగిపోయింది

ఈ-బలవంతపు పెళ్లి ఆమెను క్రుంగదీసింది. అటు, తల్లి తండ్రులు చేసిన ఘోర అన్యాయానికి, ఇటు విధి తనకు విధించిన ఘోరమైన శిక్షకు అల్లాడిపోతూ రోజులు భారంగా వెళ్ళదీస్తూ గడుపుతోంది,

మూఢుడైన భర్తనుజూచి పదె పదె ఏడుస్తున్నది,

ఆమె కోరింది ఏలోకమో ఆమెకు దాపురించింది ఏలోకమో పరిస్థితులకు బానిసయని తలచింది,

శశిలో సంతోషం, సరంభం, ఉత్సాహం ఉల్లాసంలేదు. జీవచ్ఛవంలా బ్రతుకుతోంది. ఏదో పంజరంలో బంధించిన పికములావుంది,

ఒకనాడు మామూలుగా తెల్లవారింది, కాని ఆరోజు ఆమె జీవితంలో మధురస్రవంతులు ప్రవహిస్తాయని, బ్రతుకులో వెలుగువెల్లి విరుస్తుందని ఎవరికితెలుసు? ఆమెకు తెలియకపోయినా ముప్పిరిగొంటున్నది, మునుపటి ఉత్సాహమంతా ఒక్కసారిగా ఆమెలోఆవహించింది. రైతాంగనలుపనులకు వెళ్ళిపోయారు, రైతు వాడలో జనం పల్చ పల్చగా మిగిలున్నారు, శశి ఇంటిపనులుచేస్తూ పూర్వం తాను అల్లిన గీతములనుపల్లె వేస్తున్నది

ఇంతలో ... దూరాన గుర్రపుడెక్కలు, ఆమె జీవితాని కవి స్వేచ్ఛాపూరిత రెక్కలు, ఆరోజు కాశ్మీరదేశపు యువరాజు సపరివారంగా వేటకువెళ్ళ తిరిగివస్తున్నాడు, యువరాజుకు లీలగా మధురమైన గానం వినపడింది, ఆ ధ్వనివస్తున్న దిక్కుకు వెళ్ళాడు, హాయిగా తియ్యగా, శరీరాన్ని, మనస్సుని ఈ లోకం నుండి వేరొక లోకంలోకి తీసుకెడుతున్న ఆ పాటవిని అతడు సమ్మోహ సహితుడైయ్యాడు. యువరాజు గుర్రం మందగమనంగా నడుస్తున్నది, తిన్నగా అది శశి గృహం చెంతకొచ్చి ఆగింది. యువరాజు గుర్రం దిగి యింటిముందునకు నడిచాడు.

వెయి కోయిలలు ఒక్క సారి ఒకే గొంతుతో గానం చేస్తున్నవా, అన్నట్లుగా శశి పాడుతోంది.

యువరాజు ఆ మధురగీతి వింటూ స్థాణువులా నిలబడి పొయ్యాడు,

ఆహా ! ఏమిపాట ? ఇంతటి మనోహారగీతి ఇది వరకు తానెన్నడూ వినలేదే ?

శరిరమంతటిని రోమాంచముతో ముంచ్చెత్తే ఈ పాట పాడుతోంది ఎవ్వరు ?

లోపలికి తొంగిచూచి దిగ్భ్రాంతుడైయ్యాడు.

యువరాజు కళ్ళు చెదిరిపోయాయి.

మనోహారి గీతి, గీతికన్నా మధురమైన కంఠము. అన్నిటినీమించిన ఆ అపురూప సౌందర్యం, ఎవరీమె ?

మానవుడు చెరపట్టిన దేవతయా ?

నరుని వలచివచ్చిన రంభయా ?

ఆనందంతో, ఆవేశం ముప్పిరికొనగా యువరాజు 'శశిని, అమాంతంగా ఎత్తుకొని గుర్రంపై కూర్చుండ బెట్టుకొని దౌడుతీశాడు.

'శశి' ఈవింత సంఘటనకు చకితపడి భయకంపితు రాలై యింది.

ఆమె ముఖ కవళికలను గమనించిన యువరాజు ఇలాన్నాడు "సుందరీ ! నే నీ దేశపు యువరాజును. రాజమహాలుల్లో రాణించి వెలుగొందవలసిన ఈ దీపం ఈ పూరిండ్లలో మినుకు మినుకు మంటుంది. మసి బొగ్గుల్లో మాణిక్యంలా నీవు ఈ ప్రదేశాల్లో వుండడం ఏం తగును ? మొదటి చూపులోనే నన్ను నీ దాసు ణ్ణిగా జేసుకొన్నావు. నీ సౌందర్యం, నీ కవిత్వం, నీ గానం సార్థకతపొందే రాణించాలంటే రాజాంతఃపురా ల్లోనే తెలిసిందా ? ఈ ప్రేమ దాసుడికి బిక్షపెట్టి కని కరించు సుందరీ."

శశి ఆశించిన కోరిక సిద్ధించింది. ఆమె వాంఛించిన ఏవో లోకాలు అందాలు ఆమె అంగీకరించింది. అతడు పరవశుడై య్యాడు.

శశి యువరాణి అయింది

ఆమెకిదంతా, ఏదో స్వప్నంలా తోచింది.

శశి, యువరాజు లిద్దరూ చందమామ తీయని వెన్నెలలో, నందనవన సీమల, ఆడుకొంటూ, పాడు కొంటూ తేలిపోతున్నారు నిత్యమూ.

ఆమె అదృష్టాన్ని ఎంత బంధించినా దాగలేదు. కాలం కలిసివస్తే ఇవన్నీ ఒకలెఖా. అదృష్టం ఎప్పుడూ దాగియుండదు. ఒకనాడు అది సిద్ధించి-తీరుతుంది,

ఆమె రైతు లోకంలో వున్నప్పుడు అల్లిన గీతాలు మాత్రమే బయటనిలిచి నేటికీ వున్నాయ్, పడవ వాళ్ళు, పల్లె యువతుల, నోట ఇప్పటికీ వినపడు తుంటాయి, అంతఃపురంలో అల్లిన గీతాలు ఆ గోడల లోపలనే తిరిగి ఆ గోడలు పడిపోగానే మాసి పోయాయి. ★

ఆకాశంలో అనుస్వారాలు

చంద్రుడూ సూర్యుడూ ఆకాశంలో అనుస్వారాలు
చుక్కలన్నీ కామాలు సెమికోలన్లు కోలన్లు
ఫుల్‌స్టాపులు; ఇతరగ్రహాలే చిత్ర చిత్రాక్షరాలు

చితగుప్తుడు ఆకాశపు నీలి నీలి పెద్ద చిట్టాలో కూర్చు
సూర్యచంద్రులతో చుక్కలతో రకరకాల మబ్బులతో
మన అదృష్టాల, కర్మల, మంచి చెడుగుల జమాకర్చు

అసలు మనం వ్రాసే వ్రాతలోనూ అతి ముఖ్యమైనవి
అనుస్వారాలు; అవి లేకుండా వ్రాత ఏమాత్రం సాగదు
అందుకే సూర్య చంద్ర గోళాలు అఖిలలోకాలకూ విలువైనవి

పగలంతా చిత్రగుప్తుడు చిట్టాలో లెక్కలు రాస్తాడు
అందుకే పగటి పూట ఆకసంలో చుక్కలు కనిపించవు
రాత్రి మనం చదువుకోడానికి చిట్టా తెరుస్తాడు

అయితే అందరికీ ఆ లెక్కలు అర్థం కావుట
అర్థమయితే మళ్ళీ మళ్ళీ తప్పులు చేస్తామా?
తెలుసుకునే వాళ్ళు కొందరే; వాళ్ళే మనకు వెలుగుబావుటా

అసలు చంద్ర మండలంలోకి వెళ్ళి మనంఏంచేస్తాము?
అది వట్టిసున్నా. శూన్యం తప్ప అక్కడేమీ వుండదు
దూరం నుంచే చంద్రికా వైభవం మనం అనుభవిస్తాము

అయితే అక్కడికి వెళ్ళిరావడం తప్పనడంలేదు
ఎక్కడికైనా వెళ్ళిరావచ్చు రెక్కలుంటే చాలు గాని;
తీరా అక్కడికి వెళ్ళితే అక్కడ వెన్నెలే కానరాదు

మొత్తం మీద అనుస్వారాలే మనలోకాన్ని బతికిస్తాయి
సూర్యచంద్రులు లేకుండా శూన్యమే కదా లోకం?
అవే మనకు ఆనందాన్నీ హాయినీ కలిగిస్తాయి

— దాశరధి —

వ్యక్తిత్వపు విలువలు

శ్రీమతి పవని నిర్మల ప్రభావతి

ఉన్నన్నాళ్ళూ — లోపాలు వెతకడం
లేనన్నాళ్ళూ - కంట తడిపెట్టడం
— అంతా
గతజల సేతు బంధనం!!
బ్రతికి వున్నప్పుడు వ్యక్తి విలువని గుర్తించాలి!
మానవుని మంచి తనం వెల్లువగా పారించాలి!

రిక్షా దిగి లోపలికెళ్ళేసరికి, లలిత అశోక వృక్షంక్రింది సీతాదేవి పోజ్‌లో కూచుని వుంది. ఏదో కథ వుంది లెమ్మనుకుంటూనే వెళ్ళాను. నన్ను చూచీ చూడగానే అందుకోసమే కూచున్నట్లుగా హైవాల్యూములో మొదలెట్టింది లలిత "ఆ పక్షి (అనగా పనిమనిషి 'అని గమనించ ప్రార్థన) చాలించుకుంది మొన్నట్నుంచి. ఈ వెధవ (పుత్రుడు) తో చాకరీచేసుకోలేక వచ్చి పోతున్నానోయ్। వాళ్ళ నాన్నగారిని మరో మనిషి కుదర్చమంటే నాకు తెలీదు పొమ్మ'న్నారు" అంటూ, బట్టలుతకడం వల్ల కాబోలు నెప్పెడుతున్న చేతుల్ని వత్తుకుంటూ। కళ్ళ నీళ్ళు తక్కువగా వుంది దాని పరిస్థితి।

ఎలాగూ ఈ పరిస్థితీ, సంజాయిషీ కూడా ఓ నాడు ఎదురౌతాయని నాకు ముందుగానే తెలుసు. సంవత్సరం లోపల ముగ్గురు పని మనుషుల్ని మార్చి, ప్రస్తుతం మానేసింది నాలుగో అంకె అన్నమాట. కొత్తగా ఈ మనిషి పనిలో కొచ్చిన మర్నాటి నుంచీ ఈ మూడు నెలల్లో, లలిత మా ఇంటికి వచ్చినా, నేను వాళ్ళింటికెళ్ళినా, అది చెప్పే కబుర్లలో గంటకు ఏభై నిముషాలు పని మనిషి చేతకాని తనం గురించే వ్యాఖ్య వుంటుంది. తెల్లగా మిల మిలాడేలా అంట్లు తోమటం లేవని, బట్టలు శుభ్రంగా ఇస్త్రీ మడతల్లా లేవనీ, అదీ ఇదీ కాకుంటే పిల్లాణ్ణి కాస్సేపు ఆడించుక రమ్మంటే ఏడ్పి పోతుందనీ. ఇలా వర్ణించి వర్ణించి చెబుతూండేది.

సరే ఎలా అయితేనేం అది కాస్తా మానుకుంది. రోజూ ఆ పని చెయ్యలేదు, ఈ పనిచెయ్యా లేదంటూ గొణిగే లలిత, అంతాపనీ నెత్తిన పడేసరికి, లోపాల మాట దేవుడెరుగు, అది లేకుంటే తనకెంత అవస్థో అర్థంచేసుకుంది. దానికి తోడు మూడూ మూన్నాళ్ళకు పనిమనిషిని మాన్పించగానే రెడీగా మరో మనిషిని కుదిర్చి పెట్టేవాళ్ళ శ్రీవారికి కూడా ఈసారి విసుగెత్తింది కాబోలు— మరి ఆ మాటనుకోలేదు దాంతో మరీ బేజారెత్తిపోయింది. సమయానికి, దాని కష్టాలు, వినాల్సిన భారం నామీద పడటంతో నాకు తోచిన సలహా చెప్పి, నాలుగుచీవాట్లేసి చక్కావచ్చాను. ఆతర్వాత. ఆ మానుకున్న మనిషినే మళ్ళీ పిల్చి పనిలో కుదుర్చుకుంది లలిత!

పై సంఘటన ఎందుకు చెప్పానంటే, మా లలిత లాంటి వాళ్ళు చాలా మంది వున్నారు. ఒక్క పనివాళ్ళ విషయంలోనేకాదు.— ఎవరయినా సరే. ఎదుటి మనిషి విలువను బొత్తిగా అర్థంచేసుకోలేరు. అదేం ఖర్మమో గానీ, అవతలి మనిషి ప్రతి సెంటీ మీటరులోని లోపాల్ని, భూతద్దాలక్రింద పరిశీలించి. వ్యాఖ్యానిస్తారేగానీ, వాళ్ళలో కూడా కొన్ని మంచి గుణాలుంటాయికదా— వాటిని సక్రమంగా ఉపయోగించుకుదామని గానీ. లెఖ్ఖ తీసుకుందామని గానీ అనుకోరా మానవులు. ఒక్కమాటలో చెప్పాలంటే పైరకం మనుషులకు వ్యక్తిత్వపు విలువల్ని అర్థం చేసుకోటం బొత్తిగా తెలీదని చెప్పాలి! ఇలాంటి వాళ్ళలో. స్త్రీ, పురుష ప్రత్యేకత లేదు. రెండు రకాల వాళ్ళూ వున్నారు.

మాకు తెలిసిన ఆఫీసరుగారొకరున్నారు. ఆయన ఒక్కో ఊళ్ళో ట్రాన్సఫరయి వెళ్ళే రెండు మూడేళ్ళలోనూ కనీసం ముగ్గురు జవాన్లనేనా మారుస్తూంటారు. పతిసారీ "పోయినసారి వాడేమేలు" అంటూ వాపో

తూనూ వుంటారు. మరి ఈ అవస్థ ఏమిటిః అంటే ఆయనకు వర్తమాన కాలంలో తన దగ్గర పనిచేస్తుండే ప్రతి మనిషిలోని లోపాలూ, చేతులు కట్టుక కళ్ళముందు నిల్చుంటాయిట! కానీ ఫలితం చూచేవాళ్ళకు చిరాకే కాకుండా, తమకుసుఖమూ శాంతీ రెండూ ఉండవు.

ఇల్లా ఎదుటి మనషుల్ని బొత్తిగా అర్థంచేసుకోలేని వాళ్ళలో మరీ తమాషా మనుషులు కొందరున్నారు. ఇంట్లోవాళ్ళ, స్వంత మనుషుల విలువలు కూడా వాళ్ళ కర్థంకావు ఎదుట కన్పిస్తుంటే! అదే ఆమనుషులు దగ్గర లేనప్పుడు, వాళ్ళ సుగుణాల్ని, తలుచుక తలుచుకు అవస్థ పడ్తుంటారు. కొందరి కా మనుషులు పూర్తిగా ఈ లోకం నుంచి తప్పుకుపోయే వరకూ జ్ఞానోదయం కాదు. కానీ ఫలితం శూన్యం

మా పిన్ని ఆ కోవకు చెందిన మనిషే! కోడలు బతికున్నన్నాళ్ళూ, ఆ అమ్మాయి చేసే ప్రతి పనిలో లోపాల్ని వెతకటం, హాబీగా పెట్టుకున్నట్లుండేది. ప్రతి చిన్న విషయం కొండంతగా చేసి పొద్దస్తమానూ సాధిం చేది చాలక, ఎవరేనా దురదృష్టవశాత్తూ ఎదురైతే, చెప్పి చెప్పి, చివరకు "దీంతో వేగలేక ఛస్తున్నాను" అంటూ నిట్టూర్చేది. లోలోపల క్షోభపడి, పడి చివరకు కన్న బిడ్డనూ, కట్టుకున్న భర్తనూ, వాళ్ళమానాన వదిలేసి శాశ్వతంగా కళ్ళు మూసిందా అమ్మాయి— ఏదో మింగి.

ఇక ఆ తర్వాత చూడాలి పిన్నిబాధ! కళావిహీనంగా వున్న ఇల్లూ, విరక్తిగా, బాధతో, కృశించిపోతున్న కొడుకూ, తల్లి కోసం బిక్కు బిక్కుమంటూ చూస్తూ ఏడ్చే, ఆ పసి బిడ్డా, ఇవి చాలక క్షణం తీరికలేని పనీ! ఇప్పుడు పొద్దస్తమానూ "అది వుంటే ఈ పని చేసేది— ఆ పనిచేసేది" అంటూ ఎంత వాపోయినా, ఎంత పశ్చాత్తాప పడినా (నిజంగానే అనుకోండి) ఏం లాభం? గతజలసేతు బంధనం! చనిపోయింతతర్వాత గుర్తించిన అవిలువ, ఆమె బ్రతికుండగా తెలుసుకొని వుంటే ఎంత బావుండేది?


ఒక్క పిన్నేకాదు.... చిన్నవాళ్ళల్లో కూడా చాలా మంది వున్నారు. దగ్గర పెద్దవాళ్ళెవరేనే వుంటే, చాదస్తాలనీ, మూర్ఖత్వమనీ, అదీ ఇదీ కాకుంటే గొణుగు కుంటారానీ, మొత్తానికి ఎలా అయితేనేం ఒకటే బాధ పడ్తుంటారు. తీరా వాళ్ళులేని సమయంలో కానీ, ఆత్మీయత ఆకళింపునకు రాదు.

మా సరోజ అలాంటిదే! ఆ మధ్య కొన్నిరోజులు, వాళ్ళత్తగారు— ఈ కొడుకు మీద ప్రేమతో దగ్గరి కొచ్చింది. ఆవిడ నిజానిక్కాస్త పాతకాలపు మనిషే లెండి! మడీ— ఆచారం వుంటం వల్ల తానే వంటచేసే దిట. ఇక చూచుకోండి. ఉదయం ఎనిమిది గంటల కల్లా తీరిగ్గా, చిన్న పిల్లాడ్ని తీసుకుని మా ఇంటికొచ్చి కూచునేది సరోజ. "అబ్బ! ఈ మడివంటతో చచ్చి పోతున్నామే! అది తాకకూడదూ-ఇది ముట్టుకోకూడదూ అంటూ ఒకటే రూల్సు. మధ్యాహ్నం పదకొండు గంటలు దాటుతోంది భోజనాలయ్యేసరికి. దిక్కుమాలిన దేవుడి పూజతో ప్రాణం పోతోంది! సాధ్యంకాక, విజయను (పెద్ద పిల్ల) గొను విప్పి ఆవిడ దగ్గర వదిలేసి వచ్చాను." అంటూ పదిన్నర దాకా గొణిగి లేచి వెళ్ళేది మళ్ళీ మధ్యాహ్నం మూడున్నర (కాఫీలయింతర్వాత) గంటల నుంచీ సాయంత్రం ఆరు దాకా అదేటేపురికార్డు!

నిజంగా ఆలోచిస్తే, వాళ్ళత్తగారు, ఒక్కకాఫీలు మినహా మిగతా పనులన్నీ తనే చేసుకునేది పాపం! పైపెచ్చు పిల్లల్నిద్దర్నీ అస్తమానూ ఆడిస్తుండేది. కబుర్లూ రిపోర్టులూ చేస్తూ కాలం వెళ్ళబుచ్చుతూ, అంటీ అంట నట్టుగా వుంటూ కూడా మా సరోజకింకా బాధే! ఆ తర్వాత ఓరెణ్ణెల్లలోనే పెద్ద ఆవిడ కూతురు కాన్పుకు కాబోలు వెళ్ళిపోయింది. ఇంకేం ప్లేటు మారింది! "వాళ్ల నాన్నగారికి పెందరాళే వంటకాలేదని దిక్కుమాలిన కోపం! ఈ గ్రహాలు (పిల్లలు) రెండూ ప్రాణాలు తోడేస్తున్నాయి! గడప దాటడానికి వీల్లేకుండా ఛస్తున్నాను!" అంటూ చీదేస్తుంటుంది. దగ్గర ఉన్నన్నాళ్ళూ ఎందుకుందా? అంటూ ఎడ్చి, లేనప్పుడు ఇలా మరో రకంగా బాధ వెళ్ళబోసుకుంటే లాభమేమిటి?

ఇలా రక రకాలుగా వున్నారు. "ఆయన, డాక్టరు!" అంటే గబుక్కున నమస్కారం అంటాడు. "అదో ఆవిడ మంత్రిగారి ఇలాకా!" అనగా వుండనీండి- చిన్న ఉద్యోగం చేస్తున్నాడు కాబట్టి- అతని వ్యక్తిత్వానికి విలువలేన్నమాట, మాస్టారి భార్యకూ ఆదరణ లభించక పోవటంలో అతిశయోక్తిలేదు. అంటే ఈ రకంవాళ్లు వ్యక్తుల్నికాదు గౌరవించేది వృత్తి—ఉద్యోగాల్ని—తప్పిస్తే పోదాని! అంతేకానీ మంచి గుణాలకూ- వ్యక్తిత్వపు విలువలకూ తావేలేకుండా పోతోంది.

ఎంతసేపూ విలువ- అంటారేమో! మనుషుల విలువల్ని రూపాయణాలలో లెక్కకట్టడం సాధ్యంకాదు.



ఆంధ్ర మహిళా సభ నర్సింగ్‌హోమ్‌లో బాలల దినోత్సవం

మదరాసు ఆంధ్ర మహిళా సభ నర్సింగ్ హోమ్‌లో నవంబరు 14 వ తేదీన బాలల దినోత్సవం జరిగినది. శ్రీమతి వి. లక్ష్మీపార్వతి సదస్యులకు స్వాగత మిచ్చారు. శ్రీమతి టి. ఏ. వర్గీసు పిల్లల పోషణ, వారి ఆరోగ్యమునకై తీసుకొన వలసిన జాగ్రత్తలను గురించి ప్రసంగించారు. శిశుప్రదర్శనం జరిగినది. పోటీలో గెలుపొందిన వారికి శ్రీమతి లలితా బాలకృష్ణ శెట్టి బహుమతులు పంచిపెట్టిరి. కుటుంబ నియంత్రణ ఉద్యోగిడా. కమలా దేవిగారు వందనము లర్పించారు. తదుపరి బ్రిటిష్ కౌన్సిల్‌లో అమెరికా సమాచార శాఖ వారు సరఫరా చేసిన పిల్లలు ఫిల్ము ప్రదర్శనము జరిగినది. పై చిత్రం శిశు ప్రదర్శన సందర్భంలో తీసినది.



భారత స్త్రీలు!

స్త్రీలకి వుండే మూఢ నమ్మకాలూ విశ్వాసాలూ తెలుచుకుంటే కూడా ఆశ్చర్యం వేస్తుంది– ఒకప్పుడు. ఇవి తీసేదారి పుణ్య పథానికి దగ్గర దారనీ, వీటి ద్వారా తప్పించి ఆలోక సౌఖ్యాలు అలభ్యాలనీ, భావించుతూ అవి లేనివాళ్ళ జన్మలు ఎవరికీవద్దు అని నమ్ముతారు వీరు. నిజానికి ఇటువంటి వారి భక్తి ప్రపత్తులు తమ పుణ్య చింతనకి తోడు ఎదుటి వారి అవిశ్వాసాఘాయిత్యానికి ప్రాయిశ్చిత్తంగా కూడా వుంటాయంటే అబద్ధంకాదు.

పూర్వపు ఒక కథ చెప్తారు. ఒకటేమిటి అలాంటి కథలు చాలా వున్నాయి. పతివ్రతలూ– గయ్యాళుల కాంబినేషన్ కథలు. ఈ రోజుల్లో కొందరి భక్తి చూస్తే నాకివే జ్ఞాపకం వస్తాయి. పుణ్యవతి అయిన కోడలు వడ్లు దంపుతూ భర్త రావడం చూసి ఆ రోకలి అలాగే గాలిలో వుంచేసి పాదపూజ చేసి వచ్చిందట. ఇది చూసిన రెండవ కోడలు– పరమ గయ్యాళి- ఒక రోజలాగే తన పాతివ్రత్యాన్ని కూడా టెస్టుకి పెట్టిందట. కాని రోకలి వచ్చి నెత్తిన పడిందట. అలాగ్గానే సన్యాసుల పూజతో వచ్చిన వాళ్ళకి లాభం రాని వాళ్ళకి నష్టం వస్తూనే వున్నా అదంతా పుణ్యపాపాల ఫలితాల చిట్టాకి జమవుతూంది! మొన్నామధ్య నొక చిట్టి తల్లి 'భవాని' అయి ఎందరినో పొట్టన పెట్టుకుంది. పాపం అయినా ఆవిడదేం తప్పు? వెళ్ళిన వాళ్ళది గాని అంటారు. పుణ్య స్త్రీని చూడ్డానికి వెళ్ళాలంటే కుతూహల పడని భారత స్త్రీ ఎవరు? (ఒక్క మోడరన్ వనిత తప్ప! యీ అమ్మాయినీ యింటి పెద్దలు చివాట్లు వేసి లాక్కెళ్ళే వుంటారు.) దైవభక్తీ పుణ్యచింతనా కొరవడుతున్నాయి అందుకే యీ విపరీతమైన ఎండలూ, ఉద్ధతం అయిన వానలూ వరదలూ అంటారు. కాని అవి కొరవడుతున్న నిదర్శన లేదు.

మూఢ నమ్మకాలు సరదాగా కాలక్షేపానికి (పొద్దుపోని వారికి) బాగానే వుంటాయి. కాని సామాన్యుని గృహిణికి. అలాంటివి వుంటే– సంసార సాగరం అదే!! ఆ మానవుడికి కింది నేలా పైన గాలీ అందక వుక్కిరి బిక్కిరి అవుతాడు! అలా జరక్కుండా చూడడం గృహిణికి మంచిది. మూఢ నమ్మకాలతో బాధపడుతూ: ఏ ఒక్క సరదా తీర్చుకొందుకీ ఆర్థిక స్థోమతు లేని వారు కూడా, డబ్బు గుమ్మరిస్తారు. ఇదెంత దారుణం! నిత్య జీవితంలో ఏ బాధ లేకుండా హాయిగా వూపిరి తీసుకొనే సదవకావశం లేని సామాన్యులు కూడా ఏదో గ్రహశాంతి చేస్తే అది వస్తుందని ఉన్నదంతా ముడుపు కడితే- వస్తాయనుకున్న ఆయురారోగ్య ఐశ్వర్యాలు రావడం లేటయితే యిబ్బంది పడేది మనం

కె.రామలక్ష్మి


కాని పూజలు చేయించిన పురోహితుడు కాదు; పూజ లందుకున్న భగవంతుడూ కాదు. నవ గ్రహ శాంతి ముందు మన ఆత్మారావుడికి. తరువాత పూజారికి. కొందరు మహిళ లుంటారు. భర్తల నాస్తికత్వానికి ప్రాయిశ్చిత్తం అన్నట్లు అతి భక్తులుగా వుంటారు. మాటి మాటికీ యీ తతంగాల వల్ల గృహంలో ప్రశాంతతే వుండదు. భర్త విసుక్కుంటాడని, ఆయన ఆఫీసుకు వెళ్ల గానే పిలిపిస్తుంది జ్యోతిష్యుణ్ణి. ఎవరూ గదమా యించడానికైనా లేని సమయంలో జ్యోతిష్యుని మాటకిక తిరుగేమిటి? ఎన్ని గ్రహశాంతులనైనా సూచిస్తాడు. అధికస్య అధికంఫలం అన్నారు కదా?

భక్తి వద్దనీ, నమ్మకాలు వుండ కూడదనీ కాదు. వుండ వచ్చు. ఉండాలి కూడా. కాని దానికొక గిరి వుండాలి. అది దాటి యీ భక్తి మన నిత్య జీవితాల మీద అజమాయిషీకి తయారు కాకూడదు. ఇంగిత జ్ఞానానికి తెర వేయ కూడదు. అలాంటి పక్షంలో ఎంత భక్తి వున్నా ఫరవాలేదు.

మధ్య తరగతి కుటుంబాలు అన్నీ బ్రతికేది రూపాయిణా పైసల లెక్కల మీద. అవి సంసార పక్షమైన 'ప్రణాలిక'కే సరిపోవు. అలాంటప్పుడు భక్తి కర్చుకే ఎక్కువ ఎలా కేటాయిస్తాం? కేటాయించడం న్యాయమా? సకుటుంబంగా కాకుండా ఒక్కడూ సినిమాకి వెళ్లివస్తే రాద్ధాంతం చేస్తుంది యిల్లాలు. రొంప పడితే తిన్నగా తగ్గిపోతే ఆంజనేయ స్వామికి డజను కొబ్బరికాయలు అమాంతం మొక్కేసు కుంటుంది. మా నాన్నగారంటారు—వారానికో-కాయ కంటా ఎక్కువ మొక్కుకో కండని. దాని వల్ల గృహిణికి భక్తి- సంసారానికి ముక్తి అని ఆయన నమ్మకం.

ఇంతకీ నేచెప్పేది నాస్తికత్వాన్ని అలవాటు చేసుకోమని కాదు. మూఢ భక్తి తగ్గించుకో మని. అంత మెటీరియలిస్టు తత్వం కూడదంటా రేమో—మనలో మనమాట అసలు స్వాములూ సన్యాసులూ రూపాయిలు కూడా గడుతుంటే—గంపెడు సంసారాన్ని గట్టు చేర్చవలసిన సామాన్యుడు ఆ పని చేస్తే తప్పులేదుగా?

మన దేశంలో భక్తికి ఆడవాళ్ళదే పెట్టినది పేరు. వీరి కున్నంత భక్తి మొగ వారికి అవ సరం కూడా లేదేమో. నిత్యం యిల్లు చక్కపెట్టి సవ్యంగా సంసారం సాగిపోయేలా చూడవలసిన బాధ్యత కూడా గృహిణిదే. అటువంటప్పుడు మూఢ నమ్మకాలతో ధనవ్యయం తప్పు దారిన పట్టిస్తే దాని పర్యవసానం అనుభవించేదీ గృహిణే కనుక వీటి పేరిట బాధ్యతలను తొల గించుకోవడమే అవుతుంది. భక్తి వుండవచ్చు. దైవభీతి వుండవచ్చు. కాని వాటి పరిమితి వాటి కుండాలి. వీటి బహిరంగ ప్రదర్శన జన నష్టా నికీ, అంటు రోగాలకీ దారి తీసిన సంగతి ఒక పక్క వింటూనే లెక్క చెయ్యక పోవడం అంత మంచి పని కాదేమో. ఏమైనా భారత స్త్రీలకి అణకువా, సహజ సౌందర్యాలూ ఎలా పెట్టని అలంకారాలో, బహిరంగ ప్రదర్శన కాని భక్తీ, ఇంగితాన్ని మరుగు పరచని పూజా కూడా సహజ గుణాలు కావాలి. ★



దూరతీరాల మహిళా ప్రపంచం

రష్యను వనితలు

పూర్వము "సోవియట్ స్త్రీలు" అన్నప్పుడు 'స్త్రీలు' అనుటకన్నా సోవియట్ మీదే దృష్టి పోనిచ్చేవారు. దీనికితోడు యుద్ధ సమయంలో దేశానికై తమ ప్రాణాలను బలియిచ్చిన జోయా, తాన్య, మొదలగు స్త్రీల చరిత్రలు, వారిని గూర్చిన వ్యాసాలు రష్యాలోని స్త్రీలు ధైర్య వంతులు, దేశభక్తి కలవారని మాత్రమే తెలియజేసేవి. శాంతి సమయాలకు సంబంధించిన రష్యను కథలలో కూడ రష్యను స్త్రీలు దేశ నిర్మాణంలో పురుషులకెంత మాత్రము తీసిపోకుండ పాల్గొంటున్నదీ, క్రీడా రంగంలో బరువులు మోయడంలో, విమానాల మీద నుండి పారాచూట్‌లలో దూకడంలో స్త్రీలు ఎలాగ ముందంజ వేస్తున్నది తెలియవచ్చేవి. వీటి ఫలితంగా రష్యాను గూర్చి సరిగా తెలియనివారికి అక్కడి స్త్రీలంటే కొంచెం విచిత్రమైన భయముకొల్పే అభిప్రాయమే ఉండేది.

నామటుకు నాకు ఢిల్లినుండి మాస్కో వెళ్లే ప్లేనులో కూర్చున్న తర్వాతగాని రష్యను స్త్రీలనుగూర్చి అదివరకు ఉన్న విపరీత అభిప్రాయము మారలేదు. అదే విమానంలో రెండు మూడేండ్ల కుర్రవాడితో గూడ రష్యను దంపతులు ప్రయాణము చేసారు. విమానము ఎత్తుగా వెళ్తున్నప్పుడు ఆ చిన్న పిల్లవాడు నిద్రపోసాగాడు. తల్లి వాడి యెర్రని కపోలమును తన ముఖానికి ఆనించుకొని గట్టిగా కౌగలించుకొని జోకొడుతూ పడుకొన్నది. తల్లికి కునుకు పట్టినప్పుడు తండ్రి ఆబిడ్డను దగ్గరకు తీసికొని మీదపడుకో పెట్టుకొనేవాడు. ఆ సున్నితమైన ప్రేమను అక్కడ ఆ విమానంలో మాత్రమే కాకుండా, రష్యా దేశములో కాలుపెట్టిన తర్వాత నా భార్య స్నేహితుల ఇండ్లకు వెళ్ళినప్పుడు ప్రతిచోట చూడగలిగాను. పార్కులలోను, వీధులలోను పిల్లలను లాగుడు బండ్లలో నుంచి యెత్తుకొని, లాలించే ముద్దాడే తల్లులు వందల కొలదిగా నాకు కన్పించారు. కర్మాగారాలలో, కార్యాలయాలలో కఠినమైన పనులు చేసినప్పటికి, రష్యను వనితలు, సున్నితమైన మాతృత్వాన్ని కోల్పోలేదు అని తెలిసివచ్చింది.

రష్యను స్త్రీలు చాలా కష్టపడి పనిచేసే వారనడం అతిశయోక్తి కాదు. వారికి పురుషులలో సమానమైన హక్కులు—సాంఘికంగా, ఆర్థికంగా, రాజకీయంగా— అన్ని రంగాలలోను ఉన్నాయి. కాని స్త్రీల కంటూ ప్రత్యేకంగా, రక్షణ హక్కులేవీలేవు. ప్రత్యేక విద్యాలయాలు కళాశాలలు అంతకంటే లేవు. కార్యాలయాల నుండి ఇంటికి మరలిన దంపతులు ఇంటి పనులలో ఒకరి కొకరు చేదోడు వాదోడుగా ఉంటారు. కాని ముఖ్యమైన ఇంటి బాధ్యత అంతా స్త్రీ నెత్తినే పడుతుంది. "ఇంటికి రాణి" అన్న పాత పలుకుబడిని ఏవగించుకుంటున్నప్పటికి, గృహాలంకరణలో అతిధి సత్కారంలో, పిల్లల పెంపకములో అంతా ఇల్లాలిదేపూచీ. పిల్లలను జోకొట్టి నిద్రబుచ్చి, బట్టలుతకడం, ప్లేట్లు కడగడం మొదలైన చిల్లర పనులను ఆమే చేసుకుంటుంది. లెనిన్‌గ్రాడులో మేం ఉండే భాగానికి పక్కవాటాలోని రష్యనురెక్చరరు

శ్రీ ధూళిపూడి ఆంజనేయులు

భర్త ప్లేట్లు అవి కడగవచ్చినా "అయ్యో చాలాధరగలవి పగల గొట్టేస్తావు." అనితానే కడుక్కుంటుంది. రష్యను కుటుంబానికి పురుషుడే పెద్ద, కాని ఎంత సమానహక్కులుకోరి పురుషుణ్ణి మించి అన్ని రంగాలలో అభ్యున్నతి పొందినా అతిథులను సత్కరించి ఆదరించడంలో రష్యను వనితది. అందెవేసిన చేయి అని అనకతప్పదు. ఎవరివి గాని భోజనానికో, టీకో, పిలిస్తే, ఇక రష్యను స్త్రీలు ఆరోజు సెలవు పెట్టైయినా సరే, బాగా తయారు చేస్తారు. ఇక శాఖాహారులు వస్తారంటే, ఎన్ని అంగళ్లు తిరిగైనా సరే, జార్జియా దేశపు మిరపకాయలు, రకరకాల పండ్లు, షర్బత్తులు, జున్నుపాలు, పెరుగు, మాంసం లేని సూపులు బల్లమీదికి చేరుస్తుంది. కొంచెం స్నేహితులైతే "మీకేమిష్టం?" అని అడిగి తెలుసుకొని భర్తను కొన్ని వస్తువులు తెమ్మని పురమాయించి తాను తన శక్తి సామర్థ్యాలను వినియోగించి అతిథులను తృప్తి పరచడానికి ప్రయత్నిస్తుంది. ఒక వారానికి ముందునుంచి ప్రయత్నాలుచేసి మరికొందరు స్నేహితులను పిలిచి పెద్ద విందే తయారు చేస్తుంది. ఎండాకాలము, శరత్కాలము అయితే పచ్చికూరలు టొమేటాలు దోసకాయలు, ఉల్లిపాయల ఆకులు. తరిగి దానిమీద మీగడవేసి పెట్తారు. చలికాలము వసంతకాలంలో పచ్చికూరలంతగా దొరకనందున డబ్బాలలో భద్రపరచిన పండ్లు, కూరలుపెడ్తారు. అన్నికలిపి పదిరకాలైనా గృహిణి అతిథిని ఆహ్వానిస్తే తయారు చేస్తుంది. ఇంకొంచెం తినండి. ఏం నచ్చలేదా? ఇంకొకటి తింటారా అని కడుపు నిండి నప్పటికి బలవంతం చేసి తినిపించడం మన భారతదేశపు ఇల్లాండ్రకే అలవాటు అనుకున్నాను, కాని లెనిన్ గ్రాడులో అదే విధంగా ఎక్కడికెళ్ళినా స్త్రీలు ఆదరణ చూపించడం నాకు ఆశ్చర్యం కలిగించింది. నిగనిగలాడే కత్తులు, ఫోర్కులు బంగారుమలాముపూసిన చంచాలు, రకరకాల పింగాణీ కప్పులు, సాసర్లు, టీ పాట్లు అన్నీ మెరసిపోతుంటే, గాజు ప్లేట్లలో, స్వేలాయడ్ బుట్టలలో డజన్లకొద్ది ఆపిల్లు, అరంజిపండ్లు, అనాసపండ్లముక్కలు, లెమనేడ్, సోడావాటర్ల సీసాలు చుట్టూరా అమర్చబడి ఉండడం చూస్తే రష్యను గృహిణి ఓపిక వ్యక్తమౌతుంది.

ఇటు ఇంటి పనులలో అటు ఆఫీసు పనిలో నిమగ్నురాలై యున్నప్పటికి విసుగ్గా కనిపించదు. అక్కడి స్త్రీ అలంకరించుకోడంలోను, ఆరోగ్యం కాపాడుకోడంలోను ఆమె సోమరితనం పడదు. అట్లని ఇతర దేశాల్లోని కొందరు సోదరీ మణులవలె గంటలు గంటలు అద్దము ముందు గడపి, పురుషత్వాన్ని తెచ్చిపెట్టుకొని స్త్రీత్వాన్నికి స్వస్తి చెప్పరు. మాస్కోలోను ముఖ్యంగా లెనిన్ గ్రాడులోను రకరకాలుగా కేశాలంకరణలను చేసుకున్న స్త్రీలు కన్పిస్తారు. అంటే పొడుగాటి వాలుజడలతోను, రెండు జడలతోను, అజంతా చుట్టలతోను, గుబ్బపుతోకవలెముడిచి కట్టుకొని స్త్రీలు కన్పిస్తారు. పాశ్చాత్యరీతి కత్తిరించు కొన్నవారు లేకపోలేదు. కాని వారు అల్పసంఖ్యాకులే. వాసన ద్రవ్యాలను, అలంకరణసామాగ్రిని స్త్రీలు దొరికితేచాలు కొనేస్తారు. నర్తకీ నర్తకులు తప్ప ఎవ్వరు సన్నగా ఉండాలని తిండి సరిగా తినకుండా బాధపడరు. గొంతునరాలు కనిపిస్తూ మెడ యెముకలు నిక్కపొడుచుకుని ఉండడమే స్త్రీ లావణ్యంగా, సౌందర్యచిహ్నంగా పరిగణించినట్లు కనబడదు. అక్కడిస్త్రీలలో చాలామంది కండపుష్టి కలిగి, స్త్రీత్వాన్ని వ్యక్తపరచే అవయవ సౌందర్యంతో ప్రాచీన ఇటలీ చిత్రకారుల నాయికల వలే పూర్ణంగా ఉంటారు. పండుగ పర్వమైనప్పుడు ద్రాక్షారసము నియమితంగా అందరు తాగుతారు. అప్పుడప్పుడు సిగరెట్లు త్రాగడం కూడ స్త్రీలలో చూడ గలుగుతాము. కాని అదేపనిగా పొగతాగడం, సారాయిలో మునిగిపోవడం అదే స్వాతంత్ర్యానికి లక్షణమని గుండెలు చరచుకోడం మాత్రం రష్యను వనితలలో కన్పించదు.

గృహ జీవనానికి కేంద్రంగాను, ఇంటికి లక్ష్మిగాను, ఉండడమే కాకుండా రష్యను నారి కొన్ని క్షేత్రాలలో పురుషుని మించినదని కూడ నాకుతోచింది. ఆమె నాకు చేతకాదని వదలివేసినపని ఏదిలేదు. నర్సింగ్, అధ్యాపికవృత్తి, మొదలుకొని, టాక్సీ, ట్రాములు, బస్సులు, నడపడం వరకు, డాక్టరీ మొదలుకొని స్పుట్నిక్ రిసర్చి వరకు ఆమె చేయని పనిలేదు. ప్రవేశించని క్షేత్రంలేదు. ముఖ్యంగా హోటళ్ళు వసతి గృహాల నిర్వహణచేసేదంతా స్త్రీలే. విమానపు టాఫీసులలోను, రైల్వేబుకింగ్ ఆఫీసులలోను నిమిషాలమీద పనులను చక్కబెట్టేవారు స్త్రీలే. రష్యను భాషరాని విదేశీయులకు దుబాషీలగా పని చేసి సహాయము చేసేవారు నారీమణులే. నామటుకు నాకు అనేక భాషలు నేర్చుకొనే తెలివి, ప్రతిభ పురుషులకంటే ఏదేశంలోగాని స్త్రీలకే ఎక్కువగా ఉన్నదనిపిస్తుంది. ఒక నెల రోజులు లెనిన్‌గ్రాడులో ఉండడంలో నాకు రష్యనుభాష కర్ణకఠోరంగాను ఉండగలదని, అతి మార్దవంగాను వీనులకు విందుగాను ఉండగలదని తెలిసి వచ్చింది. "విశాలదేశం మనది" అన్న "పనోరమా"

సినిమాచిత్రాన్ని వ్యాఖ్యాతకర్త కంఠంలో రష్యనుభాష కర్కశంగా వినిపించింది. మర్నాడే పీటర్ – పాల్ కోటను సందర్శించేటప్పుడు మాకు మార్గ దర్శకురాలు మాట్లాడుతూంటే ఇంకా వినాలనిపించే టంతటి మధురంగా ఉంది.

ఇంటిపనులు చేయడానికి పనివాండ్రు దొరకక పోవడం ఇండ్లుకూడ తగినంత విశాలంగా లేకపోవడంకూడ ఒకందుకు మంచిదిగానే ఉన్నది. పిల్లలు కిండరు గార్డెనులకు వెళ్ళినా వారికి కావలసిన సమస్తమూ తల్లే చూచుకోడంవల్ల, ఒకే ఇంట్లో కుటుంబస్థులందరు కలిసి ఉండటంవలన, కుటుంబ ప్రేమలు విచ్ఛిత్తి పొందడంలేదు. మాప్రక్కనే కాపురమున్న "బుల్గారయేవా" అనే ఆమె తన పదేండ్ల కూతురుకి ప్రతి నిత్యము జడలల్లి, పాఠాలు చెప్పి, బడికితయారుచేసి పంపిస్తుంది. రష్యాలో "మాతృదేవతలు" అని పిల్ల లెక్కువగాగల స్త్రీలకు గౌరవ బిరుదాలిచ్చి, బహుమతు లిచ్చినప్పటికి సమకాలీన వనిత లెవ్వరికి ఒకరిద్దరికి పైన పిల్లలులేరు. వివాహచ్ఛేదానికి చట్టమున్నప్పటికి, దానికి తంతు చాలా క్లిష్టమైనది. విడిపడదలచుకున్నవారు కోర్టుకు కొన్నివేల రూబుల్సు వరకు చెల్లించ వలసి ఉంటుంది. పైగా విడాకులివ్వడం రష్యాలో ఫ్యాషనుకాదు. రజతోత్సవాలు చేసుకోవడం దంపతులకుభయులకు చాలసరదా. రెండు మూడు తరాలవారు జంటలు జంటలుగా కలిసుండే కాపురాలు కొన్నిఉన్నాయి అలాంటి వారిని ఆదర్శంగా గ్రహించడం పరిపాటి. కాని పరిస్థితులు విషమించి, వివాహాలకు ముందే తల్లులైన స్త్రీలకుకూడ సంఘంలో స్థానంలేక పోలేదు మన భారతీయ నారివలెనే రష్యను వనితకూడ తన భర్త గుణగణాలను గూర్చి తెలివి తేటలనుగూర్చి గర్వపడుతుంది. కాని తన హక్కులను జారవిడుచుకోకుండా కుటుంబానికి సంఘానికి తనకుగల బాధ్యతలను గుర్తించి మెలగుతుంది. తన భార్య అభిమానం పోగొట్టుకోనంత వరకు రష్యను భర్త చాలసంతోష పురుషుడే. కాని ఎంతమాత్రమైన అమెకు ఆగ్రహం కలిగించే పనులుచేస్తే మాత్రం అతనికి సౌఖ్యం శూన్యమనే చెప్పాలి. ప్రేమతో భర్తను ఎంతైన గౌరవించే అదే స్త్రీ అసూయ ఆగ్రహం కలిగితే ప్రతిక్రియ నభిలషించే నాగినిగా మారిపోతుంది. తమాషాగా మాకు బాగా పరిచయమైన ఒక రష్యను స్నేహితుడిలా అన్నాడు. "దేవునికి మేము భయపడ్డా పడకున్నా, శక్తిస్వరూపిణులైన స్త్రీల ఆగ్రహానికి భయిపడి తీరాలి. మాస్త్రీల దేశభక్తి పురుషుకన్న ఎన్నోరెట్లు మించినది. ఏరంగంలోకాని వారు చేయిపెడితేకాని అది పూర్తికాదు. మాసమాజానికి స్త్రీలు అలంకారాలు మాత్రమేకాదు, ఆధార మూర్తులు కూడాను."

★

భర్త: "ఇక మీదట తాకనని ఒట్టెట్టుకున్నాను."

భార్య: 'ఇదేన్నో సారో!'

భర్త: 'యీ మాటు యిక తప్పను'

భార్య: 'ఎందుచేతో?'

భర్త: "నిన్నరాత్రి తలుపు తెరిచింది ఒక్కత్తెకాదు కాదు ఇద్దరూ. అప్పుడే ఒట్టు పెట్టుకున్నాను, ఒకరి కింకొకరు జత అయితే భయం కాదూ?"

అమృతాంజనము

అన్ని నొప్పులకు దివ్యామృతము

1893 నుంచి లక్షలాది ప్రజలు అమృతాంజనం వాడి, ఎంత అమోఘమైన శక్తికలదో తెలుసుకుంటున్నారు. అమృతాంజనంలో వాడే ఔషధాలన్నీ అతి శీఘ్రంగా బాధను పశమింప చేయుటయేగాక చాలా హాయిని కూడా కలిగిస్తాయి. హాని కలిగించే పదార్థాలేమీ లేవు కూడా. దగ్గు, జలుబు మొదలైనవి కూడా శీఘ్రంగా ఉపశమిస్తవి. అమృతాంజనం దగ్గర ఉంటే మీ రెటువంటి బాధనైనా జయించవచ్చు!



అమృతాంజన్ లిమిటెడ్,
మద్రాసు-4
బొంబాయి-1,
కలకత్తా-7

AL-57-1 TELUGU

ANDHRA MAHILA SABHA

NURSING HOME & NURSES' TRAINING CENTRE

Statistics for the month of December, '59.

OUT-PATIENT REGISTER

No. of Surgical cases treated	64
" " Medical " "	1,107
" " Gyneae " "	158
" " Ante-natal " "	260
" " Post-natal " "	97
" " Dental " "	9
" " E.E.N.T. " "	54
Total Number of New Patients	1,749
Total Number of Old Patients	2,365
Grand total	4 114

ADMISSION REGISTER

No. of Normal deliveries	157
" " Abnormal deliveries (Forceps 11) Version 3	14
" " Surgical cases	1
" " Antenatal cases C False Pains	30
" " Antenatal cases C Texeamia	1
" " Post-natal cases	4
" " Gyneac "	30
" " Medical "	90
" " Babies admitted as Lodgers	169
Grand total	496

No. of Operations done - Sterilisation 1

(Sd.) Dr. K. R. AMBUJA, *R. M. O*

(Sd.) Dr M. PAVANA BAI, *Medical Superintendent.*

(Sd.) Smt. V. LAKSHMI PARVATHI. *Secretary.*

Printed & Published by Smt. T G Hymavathy, at the Andhra Mahila Press, Mylapore Madras 4.
Editor: Mrs Ramalakshmi Arudra